3-1Pg1exHMNWJQE 1 GNT_3-1Pg1exHMNWJQE.qxd 02/Jan/26 11:46 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital


మీ నమ్మకమే మా తరగని సంపద
KAPIL GROUP కపిల్ చిట్స్ 46 Years
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
3-1-2026 శనివారం సంపుటి: 31 సంచిక: 333 పేజీలు: 12 వెల: 6.50

## నీటి తగవుపై ప్రత్యేక కమిటీ

### ఎపి, తెలంగాణ మధ్య జలవివాదాల పరిష్కారానికి కేంద్రం కొత్త యత్నం

### సిడబ్ల్యుసి ఛైర్మన్ అతుల్ జైన్ నాయకత్వం


అతుల్ జైన్

**విజయవాడ,జనవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య దశాబ్దకాలంగా కొనసాగుతున్న కృష్ణా, గోదావరి నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఉన్నతస్థాయి నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఛైర్మన్ ఈకమిటీకి అధ్యక్షత వహిస్తారు. కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల (కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ) ఛైర్మన్లు, జాతీయ జల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) చీఫ్ ఇంజినీర్‌తో పాటు ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖల ఉన్నతాధికారులు ఇందులో సభ్యులుగా ఉంటారు. గతేడాది జులైలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్‌పాటిల్ అధ్యక్షతన జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఆసమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొని చర్చించారు. ఇటీవల డిసెంబర్‌లో తెలంగాణ ప్రభుత్వం తమ ప్రతినిధులను నామినేట్ చేయడంతో కమిటీ ఏర్పాటు ప్రక్రియ వేగవంతమైంది. ఇరురాష్ట్రాల మధ్య నీటిని సమానంగా పంచడం, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, కొత్త ప్రతిపాదనలు వంటి కీలక అంశాలపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేసి, పరిష్కార మార్గాలను సూచిస్తుంది. ఇదేసమయంలో, కృష్ణా జలవివాదాల ట్రైబ్యునల్2 (కేడబ్ల్యూడీటీ2) గడువును కూడా కేం ద్రం 2026జులై వరకు పొడిగించింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని >>2

# సకాలంలో సాగునీటి పథకాలు

### 2027 డిసెంబరుకు పోలవరం పూర్తికి లక్ష్యం, వెలిగొండ, పోలవరం తదితర ప్రాజెక్టులను ఈ నెలలోనే పరిశీలించనున్న సీఎం చంద్రబాబు

### ప్రభుత్వ నీటివిధానంపై త్వరలో ముసాయిదా, 2027జూన్‌లో గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు



**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సాగునీటి పథకాలను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 2027 డిసెంబరు నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనేది లక్ష్యంతో కార్యాచరణ చేపట్టామని తెలిపారు.ఈ నెలలో సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించించనున్నట్లు వివరించారు.ఈ మేరకు సీఎంవో కార్యాలయం కీలక సమాచారాన్ని ఆప్డేట్ చేస్తూ వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టుకు తొలివిడత నిధుల మంజూరుతో పాటు, అడ్వాన్సు గా నిధులిచ్చేందుకు అంగీకరించిన క్రమంలోనే కేంద్రం గడువు కూడా నిర్దేశించింది. ఇప్పటికే కాఫర్ డ్యాం పనులు ఓ కొలిక్కి వస్తున్నాయి. మరోవైపు గ్యాప్1 ప్రధాన డ్యాం పనులు ప్రారంభమయ్యాయి. ప్రధాన డ్యాంగ్యాప్ 2 పనులూ సాగుతున్నాయి. డయాఫ్రం వాల్‌పై ప్రధాన డ్యాం పనులు ప్రారంభించారు. వీటితోపాటు కుడి, ఎడమ కాలువలను అనుసంధానించే పనులూ వేగంగా జరుగుతున్నాయి. 2027 ఖరీఫ్ నాటికి పోలవరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు ఉన్న అవకాశాలు,నిర్మాణ పురోగతిపైనా ముఖ్యమంత్రి దృష్టి సారించనున్నారు. పోలవరం ఎడమ కాలువ పనులు జనవరి నెలాఖరుకు పూర్తిచేయాలనేది లక్ష్యం.ఇప్పటికే పనులువేగంగా జరుగుతున్నాయి. పోలవరం వద్ద చేపట్టే పర్యాటక ప్రాజెక్టులపైనా సీఎం సమీక్షి స్తారని సంబంధిత అధికారుల తెలుపుతున్నారు. పోలవరం ప్రాజెక్టు వద్ద ఈ ఏడాది నీటి విధానానికి ముసాయిదా విడుదల చేయనున్నారు. జలాశయాల్లో నీటి నిల్వలు 80కు మించి అందుబాటులో ఉండటంతో అన్నిప్రాంతాల్లో చెరువులు నింపేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నీళ్ల అందుబాటులో ఉన్నందున ఖరీఫ్ సాగు ముందుగా ప్రారంభించాలనేది ప్రణాళిక. భూగర్భజలాలు పెంచే ప్రణాళికలనూ గ్రామాలవారీగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ నీటివిధానంపై ముసాయిదా విడుదల చేస్తారు. పారిశ్రామిక, తాగు, సాగునీటి విడుదలకు ప్రణాళిక వెలువరిస్తారు.

**వెలిగొండకు జనవరి 7 లేదా 9న:** వెలిగొండ ప్రాజెక్టును ఈ నెల 7 లేదా9న సీఎం సందర్శించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది జులై నాటికి వెలిగొండ ప్రాజెక్టు నుంచి నల్లమలసాగర్‌కు నీళ్ల మళ్లించి తొలిదశలో 1,19,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో పనులు చేస్తున్నారు. రెండు టన్నెళ్లలో బెంచింగ్ లైనింగ్ పనులు పూర్తిచేసేలా అడుగులు పడుతున్నాయి. ఇలా నీళ్ల ఇవ్వాలంటే హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్‌ల నిర్మాణం పూర్తిచేయాలి. తొలి టన్నెల్‌లో 15 మీటర్ల మేర లైనింగ్, రెండో టన్నెల్‌లో 361మీటర్ల మేర బెంచింగ్ తవ్వకంతో పాటు 3,686 మీటర్ల మేర లైనింగ్ చేయాలి. ఫీడర్ కాలువలో పెండింగ్ పనులనూ కొలిక్కి తేవాలి. ఇక్కడ రిటైనింగ్ వాల్ >>2

## రాజముద్రతో రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణి

### రీసర్వే పూర్తయిన గ్రామాల పరిధిలో కొత్త పాస్ పుస్తకాలు అందజేత

### 9వ తేదీ దాకా కొనసాగనున్న కార్యక్రమం

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** రాజముద్రతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ నూతన సంవత్సర కానుక అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీవ్యాప్తంగా పట్టా దారు పాసుపుస్తకాల పంపణీపై ముఖ్యమంత్రి శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా మంత్రులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రికి రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. ఈ సందర్భంగా మత్రులకు సీఎం చంద్రబాబు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఒకరోజు పాల్గొంటానని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాటి సీఎం జగన్ మోహన్ రెడ్డి ఫొటోలతో భూమి హక్కు పత్రాలను పంపిణీ చేశారని ధ్వజమెత్తారు. నాటి ప్రభుత్వ చర్యలపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. తాము అధికారంలోకి రాగానే రీ సర్వే చేసి తప్పులను సరిదిద్ది కొత్త పాసుపుస్తకాలు ఇస్తామని హామీ ఇచ్చామని ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చినట్లుగానే రాజముద్రతో కొత్త పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. రీ సర్వే పూర్తైన గ్రామాల పరిధిలో 22 లక్షల కొత్త పాసుపుస్తకాల పంపిణీని ప్రారంభించామని పేర్కొన్నారు. జనవరి 2వ తేదీ నుంచి 9వ తేదీ వరకు పాసు పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పుకొచ్చారు. ఇవాళ ఏపీ వ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల చేతుల మీదుగా పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. వేలాది గ్రామాల్లో సంబరంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ మొదలైందని తెలిపారు. జగన్ బొమ్మతో ఉన్న పాసు పుస్తకాల స్థానంలో రాజముద్ర ఉన్న వాటిని పంపిణీ చేస్తోండటంతో ప్రజల నుంచి సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**భూ సమస్యల పరిష్కారం**

గత ప్రభుత్వ తప్పిదాలతో ప్రతి గ్రామంలో రెవెన్యూసమస్యలు ప్రజలను పట్టిపీడిస్తున్నాయని అన్నారు. వివాదాలు లేని స్థలాలను కూడా రీ సర్వే పేరుతో అడ్డదిడ్డంగా చేసి వివాదాస్పదం చేశారని మండి పడ్డారు. భూమే ప్రాణంగా బతికే రైతన్నలకు భూ సమస్యలు లేకుండా చేయడం మన లక్ష్యమని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వం అసంబద్ధంగా తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజలకు అభద్రతను దూరం చేశామని తెలిపారు. నేడు పాసుపుస్తకాల పంపిణీ ప్రతి ఇంట్లో కొత్త సంతోషాన్ని తెస్తోందని అన్నారు. పాసుపుస్త కాలపై తమ బొమ్మలకు నాటి పాలకులు రూ.22 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. ప్రజలకు భూ వివాదాలు లేకుండా చేయడం మనప్రథమ కర్తవ్యం కావాలని సూచించారు. అధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలు నిరిష్ట సమయాన్నిలక్ష్యంగా పెట్టుకుని పనిచేయాలని ఆదేశించారు. మంత్రులు, జిల్లా కలెక్టర్లు ఈ విషయంలో ఎక్కువగా చొరవ తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.



### పెట్టుబడుల సాధనలో రాష్ట్రం నం.1

### ఇది ఎపి సాధించిన మరో రికార్డు: మంత్రి లోకేష్

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** బ్యాంక్ ఆఫ్ బరోడా తాజా నివేదికలో పెట్టుబడుల సాధనలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెంబర్‌వన్‌గా నిలిచింది. ఇందుకు సంబంధించిన నివేదికను ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మంత్రి నారా లోకేశ్ ట్వీట్ పెట్టారు. ఆంధ్రప్రదేశ్ ముందుకు దూసుకెళ్తుందని అంటూ ఈ విషయాన్ని లోకేశ్ పంచుకున్నారు. 2025 2026 ఆర్థిక సంవత్సరంలో తొమ్మిది నెలల్లోనే దేశవ్యాప్తంగా ప్రకటించిన పెట్టుబడుల్లో 25.3 శాతం ఆంధ్రప్రదేశ్ ఆకర్శించిందని తెలిపారు. దేశవ్యాప్తం >>2

## నేటి నుంచి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు

### హాజరవుతున్న వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు

### ప్రారంభసభకు ముఖ్యఅతిథిగా విశ్వయోగి విశ్వంజి

### ప్రతిభావంతులకు 80 పూర్ణకుంభ పురస్కారాలు, 40 విశిష్ట పురస్కారాలు

### 3రోజులపాటు సాహితీ సదస్సులు, అవధానాలు, సంగీత కార్యక్రమాలు




**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** మాతృభాషకు ప్రాధాన్యతను.అవశ్యకతను వివరించే దిశలో తెలుగువారి ఆత్మీయ పండుగకు గుంటూరు సర్వాంగ సుందరంగా ముస్తాబయింది,. జనవరి 3, 4, 5 తేదీల్లో మూడో ప్రపంచ తెలుగు మహాసభలకు ముమ్మరంగా ఏర్పాట్లు జరిగాయి.శనివారం ఈ సభలు అంగరంగ వైభోగంగా ఆరంభమవుతున్నాయి.ఈ సభలకు తెలుగువారి అనురాగ సంగమంగా నామకరణం చేశారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.3వ తేదీ విశ్వయోగి విశ్వంజీ ముఖ్య అతిథిగా ప్రారంభ సభలో పాల్గొంటారు. కీలక సభలో జస్టిస్ పమిడిఘంటం నరసింహ ముఖ్య అతిథిగా, స్పీకరు చింతకాయల >>2

### మరోసారి సిట్ కస్టడీకి జోగి బ్రదర్స్

### నకిలీ మద్యం కేసు

**విజయవాడ,జనవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం తయారీకేసులో మాజీ మంత్రి, వైసీపీనేత జోగి రమేశ్‌కు సంబంధించిన సిట్ దూకుడు పెంచింది. ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న జోగి రమేశ్, ఆయన సోదరుడు రాములును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) మరోసారి కస్టడీలోకి తీసుకుంది. శుక్రవారం ఉదయం వారిద్దరినీ అధికారికంగా కస్టడీలోకి తీసుకున్న సిట్ అధికారులు, మూడురోజుల పాటు లోతైన విచారణ చేపట్టనున్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంతంలో నకిలీ మద్యం తయారీ, సరఫరాకు సంబంధించిన కేసులో ఇప్పటికే జోగి >>2

## మాతృభాషను రక్షించుకుందాం

### 'సుప్రీం' న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహ

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** మాతృభాష పరిరక్షణ అందరిపైనా ఉందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం నరసింహ అన్నారు. పిల్లలను పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలన్నారు.పుస్తకమహోత్సవాలను పిల్లలకు చూపించాలన్నారు.తాను కుడా అనేకమంది పిల్లల మాదిరిగా కాన్వెంట్ స్కూల్‌లో చదివానన్నారు. అప్పట్లో తెలుగులో రాస్తే కొట్టేవారన్నారు.ఇంగ్లీష్‌లోనే లేఖ రాయమనే వారు.అలా రాస్తే మా నాన్న తెలుగులోనే రాయమని చెప్పారన్నారు.విజయవాడ నగర పాలకసంస్థ క్రీడా మైదానంలో 36వ పుస్తక మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమాన్ని జస్టిస్ పమిడిఘంటం నరసింహ ప్రారంభించారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్,ఉపసభాపతి కనుమూరు రఘురామ కృష్ణరాజు, సీపీఐ జాతీయ నేత నారాయణ,సీనియర్ సంపాదకులు కె.రామచంద్రమూర్తి,మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్ర సాద్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జరిగిన సభలో జస్టిస్ పమిడిఘంటం నరసింహ మాట్లాడుతూ కాన్వెంటు చదువు తరువాత తాను తెలుగునేర్చుకుని రామయణం, భాగ వతం చదివాను.తనకు చిన్నతనం నుంచి పుస్తకాలంటే అనుబంధం ఉండేదన్నారు.అవి ప్రాణం పోసుకున్న జీవులనే అభిప్రాయం అన్నారు. పుస్తకాలు మనల్ని ఎన్నుకుని నన్ను చదవరా అని పిలుస్తాయి, పుస్తకాలు మనందరి మధ్యలో పెరుగుతాయి. కొన్ని నవ్విస్తాయి, కొన్ని సీరియస్‌గా ఉంటాయి.తీర్పును నిర్ణయం చేసే సమయంలో రాజ్యాంగంలో ఉన్న అక్షరాలు >>2



శుక్రవారం విజయవాడ పుస్తక మహోత్సవంలో ప్రారంభోపన్యాసం చేస్తున్న జస్టిస్ పమిడిఘంటం నరసింహ

### నేడు కొండగట్టుకు డిసిఎం పవన్

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రంలోని కొండగట్టు ఆంజనేయస్వామి క్షేత్రానికి ఈనెల 3 శనివారం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెళ్లనున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సహకారం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో తెలంగాణలోని కొండగట్టు ఆంజనేయ క్షేత్రానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు మంజూరు చేసింది. టీటీడీ నుంచి రూ.35.19 కోట్ల నిధులతో సత్రం, దీక్షావిరమణ మండపం నిర్మాణాలు చేయనున్నారు. రేపు పవన్ కల్యాణ్ కొండగట్టుకు వెళ్లి ఈ నిర్మాణాల పనులకు శంకుస్థాపన చేయనున్నారు. శనివారం ఉదయం 10.30 ని.నుంచి 11గం.30ని. మధ్య డిప్యూటీ సీఎం పవన్ కొండగట్టు క్షేత్రంలో >>2



## బళ్లారిలో టెన్షన్..టెన్షన్..

### బ్యానర్ వివాదంలో కాంగ్రెస్, బిజెపిల మధ్య ఘర్షణ

### కాల్పుల్లో ఒకరి మృతి.. పలువురికి గాయాలు, 144 సెక్షన్ అమలు

### భారీగా పోలీసు బలగాల మొహరింపు

### ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డిపై కేసులు

**అనంతపురం, జనవరి 2 ప్రభాతవార్త బ్యూరో:** కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో బిజెపి, కాంగ్రెస్ వర్గాల మధ్య బ్యానర్ వివాదంతో మొదలైన రెండు వర్గాల మధ్య గొడవ ఘర్షణలకు దాడి తీసింది. >>2

### శ్రేయా ఇన్‌ఫ్రా ఆస్తుల జప్తు!

### వందల కోట్ల కుంభకోణం ఆరోపణలు

### దర్యాప్తు జరుపుతున్న సిఐడి

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని శ్రేయా ఇన్‌ఫ్రా కంపెనీలపై ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. ఈ కంపెనీపై రూ.వందల కోట్ల కుంభకోణం ఆరోపణలు ఉన్న నేపథ్యంలో సీఐడీతోపాటు, స్థానిక పోలీసులు చర్యలు చేపట్టారు. శ్రేయా ఇన్‌ఫ్రా డైరెక్టర్లు, వారి బంధులు పేరిట ఉన్న స్థిరాస్తులును డిపాజిటర్ల రక్షణ చట్టం కింద అటాచ్ (జప్తు) చేసే ప్రక్రియలో భాగంగా సీఐడీ అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపినట్లు సమాచారం. దాదాపు రూ.206 కోట్లు వరకు మోసం జరిగిందని ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తుంది. ఇన్‌ఫ్రా వల్ల నష్టపోయిన 8వేల మంది బాధితుల బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేశారు. ఈ సంస్థకు చెందిన కీలక >>2

## పోక్సో కేసు: నిందితునికి 20యేళ్ల జైలు

### రూ.5 వేలు జరిమానా

### బాధితురాలికి రూ.5 లక్షలు మంజూరు

**విజయనగరం, జనవరి 2 ప్రభాతవార్త:** విజయనగరంజిల్లా బాడంగి పోలీసు స్టేషనులో 2024సం.లో నమోదైన పోక్సో కేసులో నిందితుడు బాడంగి మండలం, వాడాడ గ్రామంకు చెందిన వాడాడ వెంకటరమణ (23)కు 20ఏళ్లు జైలు శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కే.నాగమణి తీర్పు వెలువరించారు. అలాగే నిందితుడికి రూ.5,000లు జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5లక్షలు మంజూరు చేస్తూ జనవరి 2న తీర్పు వెల్లడించారని విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపీఎస్ తెలిపారు. వివరాల్లోకి వెళ్ళితే బాడంగి మండలం, రాజేరు గ్రామానికి చెందిన ఒక బాలిక (14) కనపడుటలేదని 2024 డిసెంబరు 28న బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ జె.తారకేశ్వరరావు మిస్సింగు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో బాడంగి మండలం, వాడాడ గ్రామానికి చెందిన ఒకనిందితుడు వాడాడ వెంకటరమణ (23)ఆ బాలికను ప్రేమిస్తున్నాని వెంటపడుతూ, పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను కత్తిపూడి తీసుకొని వెళ్లి, అక్కడ శారీరకంగా పలుమార్లు అనుభవించాడని తెలియడంతో పోక్సో చట్టం క్రింద కేసును ఆల్టర్ చేయగా, బొబ్బిలి డిఎస్పీ జి.భవ్యరెడ్డి కేసును దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేసారన్నారు. నిందితుడు వెంకటరమణపై నేరారోపణలు రుజువు కావడంతో విజయనగరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి 20సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.5,000లు జరిమానా విధించడంతోపాటు, బాధితురాలికి పరిహారంగా రూ.5లక్షలు మంజూరు చేస్తూ జనవరి 2న తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితుడిపై నేరం నిరూపణ అయ్యే విధంగా పోలీసులు తరుపున పోక్సో కోర్టు ఇన్చార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటరు ఎం. ఖజానారావు వాదనలు వినిపించారన్నారు. ఈ కేసులో క్రియాశీలకంగా పనిచేసి, నిందితుడిని శిక్షించబడే విధంగా సమర్థవంతంగా పని చేసిన బొబ్బిలి >>2



శుక్రవారం వైకుంఠంలో భక్తుల క్యూలైన్లను ఏఐ విధానం ద్వారా పరిశీలిస్తున్న అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

# ఇక సామాన్యుడిదే 'వైకుంఠం'

## ప్రశాంతంగా భక్తుల సంతోష దర్శనం

**తిరుమల,జనవరి 2(ప్రభాతవార్తప్రతినిధి):** ధనుర్మాసంలో పవిత్రమైన పదిరోజుల వైకుంఠద్వార దర్శనంలో నాల్గవరోజు శుక్రవారం నుండి వారంరోజులు సామాన్యభక్తులకే అవకాశం కల్పిస్తున్నారు. ఈ వైకుంఠ దర్శనాలకు ఎటువంటి టోకెన్ ,టిక్కెట్ లేకున్నా సర్వదర్శనమ్‌లో భక్తులను తిరుమలలోని ఆక్టోపస్ భవనం కూడలి నుండి గురువారం రాత్రి అనుమతించిన టిటిడి అధికారులు శుక్రవారం ఉదయం శిలాతోరణం వద్ద ఉన్న క్యూలైన్ల మీదుగా భక్తులను వైకుంఠం 2 లోనికి అనుమతిస్తున్నారు. తొలి నుండి పటిష్టప్రణాళికలు రచించిన టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ,తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సరితామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్‌ఒ కెవి మురళీకృష్ణ గురువారం మధ్యాహ్నం నుండి క్యూలైన్లను పర్యవేక్షించారు. శుక్రవారం ఉదయం నుండి సామాన్యభక్తులకు ఆన్‌లైన్‌లో 300 రూపాయలు 15వేలమంది, వెయ్యిమంది శ్రీవాణి టిక్కెట్ భక్తులతో బాటు వైకుంఠద్వార దర్శనాలను మహాలఘువులోనే అనుమతించి చేయిస్తున్నారు. సాయంత్రం వరకు 47వేలమంది భక్తులు వైకుంఠద్వారంలో ఏడుకొండలస్వామిని దర్శించుకున్నారు.పదిరోజుల వైకుంఠ దర్శనాల్లో తొలిమూడురోజులు డిసెంబర్ 30,31,జనవరి 1న మాత్రం ఆన్‌లైన్‌లో ఇడిప్ టోకెన్లు కలిగిన 1.79లక్షలమంది భక్తులు దర్శనం చేసుకోగా అదనంగా మరో దాదాపు 23వేలమంది వరకు భక్తులు రాజ్యాంగహోదాలో ఉన్న వివిఐపిలు కుటుంబసభ్యులు ,టిటిడి ఉద్యోగులు దర్శనం చేసుకోవడం విశేషం. ఆ మూడురోజులను సాఫీగా చేయించిన టిటిడి అధికారులు శుక్రవారం నుండి రెండింతలు ప్రశాంతంగా, సాఫీగా సంతోషకర వైకుంఠ దర్శనాలు చేయిస్తున్నారు. తిరుమల ఆలయంలో ప్రతి ఏడాది వైకుంఠ ఏకాదశి,ద్వాదశి పర్వదినాలతోబాటు మరో ఎనిమిదిరోజులు భక్తులు తిరుమలకు చేరుకుని హరిహరి గోవింద మాలలు ధరించి గోవిందనామాలతో తిరుమల మారుమోగుతోంది. భక్తులకు టిటిడి అధికారులు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. సరాసరి రోజుకు 70వేలమందికి మించి దర్శనం చేసుకోబోతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలమేరకు సామాన్యభక్తులకే వైకుంఠద్వార దర్శనాలు ప్రాధాన్యతనిస్తున్నామని టిటిడి అదనపు ఇఒచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరితెలిపారు. నిర్దేశిత సమయం ప్రకారమే భక్తులను రెండు గంటల్లోనే సర్వదర్శనంలో వైకుంఠద్వార దర్శనం చేయించడం ప్రత్యేకత. తిరుమలలో భక్తులకు క్యూలైన్లలో సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. తాగునీటిని ప్రత్యేకంగా క్యాన్లను తీసుకువచ్చి భక్తులకు ఎక్కడ అడిగితే అక్కడ తాగునీరు అందించడం ఈ ఏడాది ప్రత్యేకత. కాగా ఏంటో తొలిసారిగా తిరుమలలో శుక్రవారం ఉదయం 9గంటలవరకు 805వాహనాలు చేరుకోగా,తిరుపతికి 399 వాహనాలు వెళ్ళాయి. మొత్తం 30,976మంది భక్తులు చేరుకోగా 10వేల మంది భక్తులు దర్శనం చేసుకున్నారు.ఈ వివరాలను అదనపు ఇఒ వెంకయ్యచౌదరి వెల్లడించారు.



ఆలయం ముందు భక్తులకు తాగునీరు అందిస్తున్న సేవకులు

# బెలూచిస్థాన్‌లో చైనా మిలిటరీ మోహరింపు

## సిపిఇసి కారిడార్‌కోసం పాక్ చైనాతో కుట్రలు

## భారత్ విదేశాంగమంత్రికి బలూచ్‌నేత లేఖ

**క్వెట్టా, జనవరి 2:** దక్షిణాసియాలో వ్యూహాత్మక సమీకరణలు వేగంగా మారుతున్నాయి. పాకిస్థాన్‌లోని అస్థిర ప్రాంతమైన బలూచిస్థాన్‌లో చైనా తన సైనిక బలగాలను మోహరించబోతోందన్న వార్తలు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. ప్రముఖ బలూచ్ నేత మీర్ యార్ బలూచ్ ఈ మేరకు భారత విదేశాంగమంత్రికి లేఖరాసారు. చైనాపాకిస్థాన్ మధ్య పెరుగుతున్న సైనిక అనుసంధానం కేవలం బలూచిస్థాన్‌కే కాకుండా భారతదేశ భద్రతకు కూడా పెను ముప్పుగా పరిణమించబోతోందని ఆయన హెచ్చరించారు. భారత విదేశాంగ మంత్రికి రాసిన బహిరంగ లేఖలో పలు సంచలన విషయాలను వెల్లడించారు. చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సిపిఇసి) ప్రాజెక్టు ఇప్పుడు తుది దశకు చేరుకుందని ఈ క్రమంలో తన పెట్టుబడులను కాపాడుకోవడానికి చైనా నేరుగా తన సైన్యాన్ని బలూచిస్థాన్ గడ్డపై దింపేందుకు సిద్ధమవుతోందని ఆయన పేర్కొన్నారు. మరో కొన్ని నెలల్లోనే బలూచిస్థాన్‌లో చైనా సైనికుల బూట్ల చప్పుడు వినిపించవచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బలూచిస్థాన్‌లో చైనా సైనిక ఉనికి కేవలం స్థానిక సమస్య కాదని ఇది భారత భవిష్యత్తుకు కూడా సవాలుగా మారుతుందని మీర్ యార్ బలూచ్ విశ్లేషించారు. చైనా, పాకిస్థాన్ కూటమి అంతకంతకూ బలపడుతోందని దీనిని అడ్డుకోవడానికి బలూచ్ స్వాతంత్ర్య పోరాట శక్తులకు అంతర్జాతీయ మద్దతు అవసరమని ఆయన కోరారు. ముఖ్యంగా గత ఏడాది భారత ప్రభుత్వం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ వంటి ధైర్య సాహసోపేతమైన చర్యలను ఆయన ప్రశంసించారు. ఉగ్రవాద స్థావరాలపై భారత్ జరిపిన మెరుపు దాడులు ప్రాంతీయ భద్రతకు ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. గత ఏడు దశాబ్దాలుగా పాకిస్థాన్ సైన్యం బలూచిస్థాన్‌లో సాగిస్తున్న అరాచకాలు, అపహరణలు, ఊచకోతలను ఆయన తన లేఖలో ప్రస్తావించారు. పాకిస్థాన్ తన స్వార్థం కోసం బలూచిస్థాన్ వనరులను చైనాకు తాకట్టు పెడుతోందని 6 కోట్ల మంది బలూచ్ ప్రజల అనుమతి లేకుండా చైనా సైన్యం అక్కడ అడుగు పెడితే అది చట్టవిరుద్ధమైన ఆక్రమణే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం పాకిస్థాన్ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడం, మరోవైపు చైనా తన ప్రాజెక్టుల రక్షణ కోసం పాక్ సైన్యంపై నమ్మకం కోల్పోవడం వంటి పరిణామాలు ఈ సైనిక మోహరింపు వార్తలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఈ ఉదంతంపై అటు చైనా గానీ, ఇటు పాకిస్థాన్ గానీ ఇప్పటి వరకు అధికారికంగా స్పందించలేదు. అయితే బలూచ్ నేత చేసిన ఈ హెచ్చరికలు ఇప్పుడు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో తీవ్రస్థాయి చర్చనీయాంశంగా మారాయి.

# ఖతార్‌జైలులో ఉన్న నాసోదరుడిని విడిపించండి

## నేవీ మాజీ అధికారి సోదరి ప్రధాని మోడీకి విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, జనవరి 2:** ఖతార్‌లో గూఢచర్యం ఆరోపణలతో అరెస్టయి, ఆ దేశ పాలకుడి క్షమాభిక్షతో విడుదలైన 8 మంది భారత మాజీ నేవీ అధికారుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏడుగురు అధికారులు భారత్‌కు తిరిగి రాగా, మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌కు చెందిన రిటైర్డ్ కమాండర్ పుర్ణేందు తివారీ (65) మాత్రం ఓ కొత్త కేసులో చిక్కుకుని దోహా జైల్లోనే మగ్గుతున్నారు. తన సోదరుడిని వెంటనే విడిపించాలని కోరుతూ ఆయన సోదరి డాక్టర్ మీతూ భార్గవ ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌లకు విజ్ఞప్తి చేశారు. 2022 ఆగస్టులో గూఢచర్యం ఆరోపణలపై తివారీ సహా 8 మందిని ఖతార్ అధికారులు అరెస్ట్ చేశారు. మొదట మరణశిక్ష విధించినా, భారత ప్రభుత్వం చేసిన దౌత్య ప్రయత్నాల ఫలితంగా శిక్షను జైలు శిక్షగా మార్చారు. 2024 ఫిబ్రవరిలో ఖతార్ అమీర్ క్షమాభిక్ష ప్రసాదించడంతో ఏడుగురు అధికారులు స్వదేశానికి తిరిగి వచ్చారు. అయితే, తివారీ పనిచేస్తున్న దహ్రా గ్లోబల్ టెక్నాలజీస్ కంపెనీకి సంబంధించిన ఆర్థిక అవకతవకల కేసులో ఆయనపై ట్రావెల్ బ్యాన్ ఉండటంతో ఆయన అక్కడే చిక్కుకుపోయారు. తాజాగా పాత కేసు ఆధారంగానే కుట్రపూరితంగా మరో కేసును సృష్టించారని, అందులో క్రిమినల్ కుట్ర, మనీ లాండరింగ్ ఆరోపణలతో తన సోదరుడికి ఆరేళ్ల జైలు శిక్ష విధించారని మీతూ భార్గవ ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా ఆయన జైల్లో తీవ్ర అవమానాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు.

# నీటి తగవుపై ప్రత్యేక కమిటీ

>> చాప్టర్9, సెక్షన్ 84 ప్రకారం.. కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగానికి సంబంధించిన విషయంలో సమస్యల పరిష్కారం కోసం అపెక్స్ కౌన్సిల్ ఏర్పాటైంది. 16, జూలై 2025 నాడు ఢిల్లీలో కేంద్ర జలవనరుల శాఖ (జల్‌శక్తి) మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్న విషయం తెలిసిందే. ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలను ఇద్దరు ముఖ్యమంత్రులు ప్రస్తావించగా.. వాటిని చర్చించి, సాంకేతికతంగా పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం, ఇరు రాష్ట్రాల ప్రతినిధులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయాలని అపెక్స్ కౌన్సిల్ నిర్ణయించింది. ఇందుకోసం ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తమ ప్రతినిధులను నామినేట్ చేయాలని సూచించింది. డిసెంబర్ 23, 2025 నాడు తెలంగాణ ప్రభుత్వం నామినేట్ చేయడంతో శుక్రవారంనాడు కేంద్ర జలవనరుల సంఘం కొత్త కమిటీని నోటిఫై చేసింది. ఈ కమిటీకి కేంద్ర జల వనరుల సంఘం చైర్మన్ నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీలో తెలంగాణ నుంచి జలవనరుల శాఖ సలహాదారు, ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ, ఇంజనీర్ ఇన్ చీఫ్ సభ్యులుగా ఉండగా.. ఆంధ్రప్రదేశ్ నుంచి.. జలవనరుల శాఖ స్పెషల్ సెక్రటరీ, జలవనరుల శాఖ సలహాదారు, ఇంజనీర్ ఇన్ చీఫ్ (ఇరిగేషన్), చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఉండనున్నారు. వీరితోపాటుగా.. కృష్ణానది యాజమాన్య బోర్డు చైర్మన్, గోదావరి నది యాజమాన్య బోర్డు చైర్మన్, నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యుడిఏ) చీఫ్ ఇంజనీర్, సిడబ్ల్యుసి చీఫ్ ఇంజనీర్ కూడా సభ్యులుగా ఉండనున్నారు.

# పెట్టుబడుల సాధనలో రాష్ట్రం నం.1

>> గా ప్రతిపాదిత పెట్టుబడుల్లో రాష్ట్రం అగ్రగామిగా ఉందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఒడిశా (13.1 శాతం), మహారాష్ట్ర (12.8 శాతం) రాష్ట్రాలను వెనక్కునెట్టి ముందంజలో నిలిచిందని పేర్కొన్నారు. నిరంతరం సంస్కరణలు, వేగవంతమైన నిర్ణయాలు, పెట్టుబడిదారుల పట్ల స్పష్టమైన నిబద్ధతకు ఇదే ఫలితమని తెలిపారు. దీని ద్వారా దేశంలోని పారిశ్రామిక, పెట్టుబడి దిశ తూర్పు నుంచి దక్షి ణ రాష్ట్రాల వైపు మళ్లుతున్నట్లు స్పష్టమవుతోందని పేర్కొన్నారు. నివేదిక ప్రకారం దేశవ్యాప్తంగా ప్రకటించిన మొత్తం మూలధన పెట్టుబడుల్లో 51.2 శాతం కేవలం మూడు రాష్ట్రాల్లోనే కేంద్రీకృతమై ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిపాదిత పెట్టుబడి ప్రకటనలు రూ.26.6 లక్షల కోట్లకు చేరాయన్నారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు అనుకూల పాలన, అనుమతుల మంజూరులో వేగం, రంగాలవారీ విధానాలు, పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్, ఇంధనం, డిజిటల్ మౌలిక వసతులపై భారీ పెట్టుబడులు ఈ విజయానికి ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు.

# నేటి నుంచి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు

>> అయ్యన్న పాత్రుడు, విశిష్ట అతిధిగా,కేంద్రమంత్రులు పెమ్మసాని చంద్రశేఖర్, కింజరపు రామ్మోహన్ నాయుడు, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, భూపతిరాజు శ్రీనివాసవర్మ పాల్గొంటారు. సభలో తెలుగుభాష అభ్యున్నతి, పరిరక్షణకు విశేష కృషి చేసిన సంస్థలు, ప్రతిభావంతులకు 80 పూర్ణకుంభ పురస్కారాలు, 40 విశిష్ట పురస్కారాలతో పాటు జీవన సాఫల్య పురస్కారాలనూ ప్రదానం చేయనున్నారు. వెయ్యిమంది కవులతో అమరావతికి సహస్ర కవితా నీరాజనం సమర్పించనున్నారు. దీనికితోడు పండితులతో సైతం అవధానం సాగనుంది జనవరి 4వ తేదీన మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ ఈ కార్యక్రమానికి హాజరై మంచి సందేశం ఇస్తారని గజల్ శ్రీనివాస్ తెలిపారు. మారిషస్‌లో ఎక్కువమంది తెలుగువారు ఉండడంతో ఆహ్వానించామని గజల్ శ్రీనివాస్ చెప్పారు. అంతేకాకుండా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, పూర్వపు సీజేఐ జస్టిస్ ఎన్.వి. రమణతో పాటు సుప్రీంకోర్టు న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తులు, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి నలుగురు గవర్నర్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ రాష్ట్రాల ఎంపీలు సైతం హాజరవుతారని గజల్ వివరించారు. 5వ తేది సీఎం చంద్రబాబునాయుడు ఈ సభలో పాల్గొంటారు. వీవీఐపీల కోసం ప్రత్యేకంగా సభావేదికల వద్ద మూడు క్యాప్సూల్ హోమ్స్ ను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఇంటిని తలపించేలా షవర్లు, బెడ్‌రూమ్, బాల్కనీ వంటి వసతులన్నీ ఉన్నాయి. అతిథుల కోసం గుంటూరు పరిసరాల్లో 3,000 గదులను నిర్వాహకులు ఇప్పటికే సిద్ధం చేశారు. మొత్తం మూడు రోజుల పాటు దాదాపు 25,000 మంది యువతీ యువకులతో తెలుగు భాషపై వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

# కొత్త కరెన్సీని విడుదలచేసిన సిరియా అధ్యక్షుడు

**డమాస్కస్, జనవరి 2:** సిరియాలో అంతర్యుద్ధం ముగిసిన తర్వాత నెలకొన్నఆర్థిక సంక్షోభం చక్కదిద్దేందుకు ఆదేశ తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్‌షరా సిరియా ఆర్థిక వ్యవస్థలో సంస్కరణలు తెస్తున్నారు. కొత్త కరెన్సీ నోట్లను ప్రవేశపెట్టారు. అయితే, కేవలం కరెన్సీ మార్పిడి మాత్రమే కాదని, సిరియా జాతీయ అస్తిత్వానికి ప్రతీక అని అల్ షారా పేర్కొన్నారు. అసద్ పాలన నాటి నోట్లను మార్చి, కొత్త డిజైన్లతో కూడిన కరెన్సీని కొత్త సంవత్సరం మొదటి తేదీనే విడుదల చేశారు. అధ్యక్షుడు అహ్మద్ అల్‌షారా, సిరియా సెంట్రల్ బ్యాంక్ గవర్నర్ అబ్దుల్ ఖాదర్ హుస్రేహ్ ఈ కొత్త నోట్లను రాజధాని డమాస్కస్‌లో ఆవిష్కరించారు. పాత నోట్లలో అసద్ కుటుంబ సభ్యుల చిత్రాలు ఉండేవి. ఇప్పుడు వాటి స్థానంలో చారిత్రక కట్టడాలు, గులాబీలు, గోధుమలు, ఆలివ్‌లు, నారింజలు, మల్బరీల వంటి వ్యవసాయ, ప్రకృతికి సంబంధించిన చిహ్నాలను ఉంచారు.

# నేడు కొండగట్టుకు డిసిఎం పవన్

>> పర్యటించనున్నారు. గతంలో ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకున్న పవన్ మొక్కులు చెల్లించుకున్నారు. ఆ సమయంలో అక్కడ నిర్మాణాలకు సంబంధించిన అంశాలను అర్చకులు పవన్ కు వివరించారు. కొండగట్టు క్షేత్రంలో నిర్మాణాలపై సీఎం చంద్రబాబుతో పవన్ సమావేశమయ్యారు. టీటీడీ సహకారంతో కొండగట్టు క్షేత్రంలో నిర్మాణాలు చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీఎం చంద్రబాబును కోరారు. చంద్రబాబు ఆదేశాలతో టీటీడీ చైర్మన్ తో పవన్ చర్చించారు. అనంతరం రూ.35.19 కోట్లు మంజూరుకు టీటీడీ బోర్డు అంగీకారం తెలిపింది. ఈనిధులతో కొండగట్టు ఆలయంలో దీక్ష విరమణ మండపం, 96 గదుల సత్రం నిర్మాణాలు చేపట్టనున్నారు. ఒకేసారి 2 వేల మంది భక్తులు దీక్షలు విరమించేలా మండపాన్ని నిర్మించనున్నారు. శనివారం పవన్‌తో కలిసి టీటీడీ చైర్మన్ బి ఆర్‌నాయుడు, ఎమ్మెల్సీ హరిప్రసాద్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం , టీటీడీ బోర్డు మెంబర్లు బి.ఆనందసాయి, ఇతర నేతలు పాల్గొనున్నారు. ఆలయం అభివృద్ధి పనుల శంకుస్థాపన అనంతరం జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకులు, శ్రేణులతో పవన్ కళ్యాణ్ సమావేశం కానున్నారు. ఆతర్వాత ఇటీవలి తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో జనసేన మద్దతుతో గెలిచిన వారితో భేటీ అవనున్నారు. ఈ భేటీలు, సమావేశాలు కొడిమ్యాల సమీపంలోని బృందావనం రిసార్టులో జరగనున్నాయి.

# సకాలంలో సాగునీటి పథకాలు

>> నిర్మాణ పనులూ ప్రారంభమయ్యాయి. తీగలేరు కాలువకు హెడ్ రెగ్యులేటర్ల నిర్మాణమూ సాగుతోంది. పునరావాసం కూడా పూర్తిచేయాలి. నల్లమలసాగర్‌లో ఉన్న గ్రామాలను ఖాళీచేయించాలి. ప్రస్తుతం ఈ పనులు జరుగుతున్నా రూ.500 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. సీఎం ఈ పనులు పరిశీలించి, మార్గదర్శనం చేస్తారు. పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులతో పాటు ఉత్తరాంధ్ర ప్రాజెక్టులనూ క్షేత్రస్థాయిలో సందర్శించనున్నారు.అంతేకాకుండా గడువులోగా ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయడంపై సమీక్షి స్తారు. ఈ మేరకు సీఎంఓ నుంచి జలవనరులశాఖ ఉన్నతాధికారులకు గురువారం సమాచారం అందింది. ఈజనవరి తొలివారంలోనే పోలవరంప్రాజెక్టును సందర్శిస్తారు. గోదావరి పుష్కరాలు 2027జూన్ చివరి వారంలో మొదలవుతాయి.సరిగ్గా అప్పుడే ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతుంది. అప్పటికి పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తే బాగుంటుందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు.ఈ నెల 17న ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు దృష్టిసారిస్తారు. ఆయన ఏ ప్రాజెక్టును సందర్శిస్తారో ఇంకా ఖరారుకావాలి.ఈ జిల్లాల్లో రూ.2,087 కోట్లు ఖర్చుచేస్తే 9 ప్రాజెక్టులు పూర్తవుతాయని జలవనరులశాఖ ప్రణాళిక రూపొందించింది. కొత్త ఆయకట్టు 1.24 లక్షల ఎకరాలు సాగులోకి రావడంతోపాటు 2.48లక్షల ఎకరాల స్థిరీకరణకు ఉపకరిస్తుంది. నేరడి బ్యారేజి నిర్మాణం చేపట్టాలనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. ఇందుకు వీలుగా వంశధార ట్రైబ్యునల్ తుది నోటిఫికేషన్ వెలువరించాలని పట్టుబడుతోంది.

# బళ్లారిలో టెన్షన్..టెన్షన్..

>> ఈ ఘర్షణల్లో ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డిపై తుపాకీతో కాల్పులు జరిపి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ప్రస్తుతం 144 సెక్షన్ అమల్లో ఉంది. గాలి జనార్ధన్‌రెడ్డి ఇంటి వద్ద బ్యానర్లు ఏర్పాటు చేసేవిషయంలో ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి మద్దతుదారులమధ్య గురువారంరాత్రి ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వు కోవడంతోపాటు తుపాకులతో కాల్చే వరకు సంఘటన చోటు చేసుకుంది. ఆ సంఘటనలో ఒక యువకుడు చనిపోయినట్లు పోలీసులతో సహా పలువురు గాయపడటంతో ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ ఘర్షణలో కాంగ్రెస్ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి సన్నిహితుడు సతీష్‌రెడ్డి కూడా గాయపడి బెంగళూరులో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరినట్లు తెలిసింది. తుపాకి కాల్పులకు గురై చనిపోయిన కాంగ్రెస్ కార్యకర్త రాజశేఖర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బళ్లారి లోని కిమ్స్ ఆసుపత్రిలో ఉంచారు. **బళ్లారి ఘర్షణలో జనార్ధన్‌రెడ్డితో సహా 11 మందిపై కేసు :** గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీరాములు, మాజీఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డితో సహా 11 మందిపై కేసు నమోదు చేశారు. బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి సన్నిహితుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గాలి జనార్ధన్‌రెడ్డిపై ఎ1గా,ఆయన సోదరుడు సోమశేఖర్‌రెడ్డిని ఎ2గా, మాజీమంత్రి శ్రీరాములును ఎ3గా బళ్లారి మున్సిపల్ కార్పోరేషన్ ప్రతిపక్షనాయుడు శ్రీనివాసులును ఎ4గా చేర్చారు.ఇదిలా ఉండగా కాంగ్రెస్ కార్యకర్త రాజశేఖర్‌రెడ్డి శరీరంలోకి దూసుకెళ్లిన బుల్లెట్ పోలీసు బుల్లెట్ కాదని బళ్లారి ఎస్పీ పవన్ నెంజూర్ చెబుతున్నారు. ఆ బుల్లెట్ ప్రైవేట్ వ్యక్తులదై ఉంటుందని ఈ విషయాన్ని సిసి పుటేజీ ద్వారా తనిఖీ చేస్తున్నట్లు ఎస్పీ చెబుతున్నారు.



శుక్రవారం విజయవాడలో జరిగిన పుస్తక మహోత్సవంలో
జస్టిస్ పమిడిఘంటం నరసింహకు పుస్తక జ్ఞాపికను అందిస్తున్న నిర్వాహకులు

# మాతృభాషను రక్షించుకుందాం

>> చూస్తే ఒళ్ళుపులకిస్తుంది. స్వేచ్ఛ,సమానత్వం,బంధుత్వం అని ఉంటాయి. తెలుగు భాషతో మనకు బాంధ్యవ్యం ఏర్పడుతుందన్నారు.ఒక్కో పుస్తకం నుంచి ఒక్కో ఆలోచన వస్తుందన్నారు.సభలో జస్టిస్ పమిడిఘంటం నరసింహకు నిర్వహకులు పురాణ గ్రంధాలను జ్ఞాపికలుగా అందించారుజ.ఇక విజయవాడలో 36వ పుస్తక పండగ సందడి చేయనుంది. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 12 వరకు ఈ వేడుక జరగబోతోంది. గతేడాదితో పోలిస్తే ఈసారి స్టాళ్ల సంఖ్య బాగా పెరిగింది. దేశంలో ప్రముఖ ప్రచురణ సంస్థలు అన్నీ తరలి వచ్చాయి. ఈసారి తెలుగుతో పాటు ఆంగ్ల పుస్తకాల ప్రచురణ సంస్థలు భారీగా వచ్చాయని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు టి. మనోహర్‌నాయుడు తెలిపారు. ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 వరకు కూడా ప్రదర్శన కొనసాగుతుంది. దేశంలోని ప్రముఖ ప్రచురణ సంస్థలవి 262 స్టాళ్లు కాగా, 47 స్టాళ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలవి. గత ఏడాది 240 స్టాళ్లే ఏర్పాటు అయ్యాయి. గతసారి పుస్తక మైదానానికి వేదిక వెతుకులాటతోనే ఆఖరు నిమిషం వరకూ ఉత్కంఠ నెలకొంది. చివరిలో ఇందిరాగాంధీ మైదానం కుదిరింది. ఈసారి ముందే వేదికపై స్పష్టత వచ్చింది. దీంతో స్టాళ్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 1989 అక్టోబరులో నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మొట్టమొదటి పుస్తక మహోత్సవం విజయవాడలో నిర్వహించారు.తర్వాత ప్రతి సంవత్సరం పుస్తక మహోత్సవం నిర్వహించాలని ప్రచురణకర్తలు నిర్ణయించారు. విజయవాడలో ప్రచురణకర్తలు, సాహితీవేత్తలు, కవులు, రచయితలు అంతా కలిసి విజయవాడ పుస్తకమహోత్సవ సంఘం (జుతీసీలీ)గా ఏర్పడ్డారు. తొలి ఏడాది 1989లో 84 స్టాళ్లతో నిర్వహించారు.1991లో ఈ సంఖ్యం 90కు పెరిగింది. 2015లో అత్యధికంగా 389 స్టాళ్లు ఏర్పాటుతో రికార్డుసృష్టించారు.క్రమంగా స్టాళ్లు తగ్గుతూ వస్తున్నాయి. ఈసారి స్టాళ్లు 309కి పెరిగాయి.

**పాదయాత్రకు రానున్న సీఎం చంద్రబాబు:**

కోల్‌కతా పుస్తక ప్రదర్శన స్ఫూర్తితో 'ఏటా పుస్తక ప్రియుల పాదయాత్ర' బెజవాడలోను కూడా నిర్వహిస్తున్నారు. జనవరి 6న సాయంత్రం 4 గంటలకు మొగల్రా జపురం సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణం వరకు కూడా ఈ పాదయాత్రను నిర్వహించనున్నారు. ఈసారి సీఎం చంద్రబాబు రానున్నారు.

# ఇవిఎంలపై కాంగ్రెస్ పోరాటం చేస్తే

# కర్ణాటకలో సర్వే మాత్రం వాటికే ఓటు

**బెంగళూరు,జనవరి 2:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లపై ఓటర్లలో విశ్వాసం అన్న అంశంపై కర్నాటకలో ఇటీవల సర్వే నిర్వహించారు. ప్లానింగ్ అండ్ స్టాటిస్‌టిక్స్ శాఖ ఆధ్వర్యంలో నడిచే కర్నాటక మానిటరింగ్ అండ్ ఎవాల్యువేషన్ అథారిటీ ఆ సర్వే చేపట్టింది. సుమారు 5100 మంది ఓటర్ల నుంచి అభిప్రాయాలను సేకరించారు. అయితే 85 శాతం మంది ఓటర్లు ఈవీఎంలపై తమ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలను స్వేచ్ఛగా నిర్వహించినట్లు తెలిపారు. ఆ సర్వే రిపోర్టు ఇప్పుడు కాంగ్రెస్, బీజేపీ మధ్య ఘర్షణకు దారి తీసింది.

ప్లానింగ్ అండ్ స్టాటిస్‌టిక్స్ శాఖ నిర్వహించిన సర్వేతో తమకు సంబంధం లేదని కర్నాటక ప్రభుత్వం చెబుతోంది. కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నట్లు బీజేపీ ఆరోపించింది. ఓటు చోరీ జరుగుతున్నట్లు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలు నిజం కాదు అని బీజేపీ నేత బీవై విజయేంద్ర తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేశారు. సర్వే నివేదిక ద్వారా ఆ విషయం స్పష్టం అవుతోందన్నారు. కానీ ఆ సర్వేకు అనుమతి ఇవ్వలేదని కర్నాటక ఐటీశాఖ మంత్రి ప్రియాంక్ ఖర్గే అన్నారు. పీఎంవో ఆఫీసుతో లింకున్న ఓ వ్యక్తికి చెందిన ఎన్జీవో సంస్థ ఆ సర్వే చేపట్టినట్లు ఖర్గే తెలిపారు.

# ఆస్తుల జప్తు!

>> వ్యక్తులు పరారీలో ఉండగా, వారి ఆచూకీ కోసం సీఐడీ బృందాలు ఇతర రాష్ట్రాల్లోనూ సోదాలు నిర్వహిస్తుంది. తక్కువ సమయంలో పెట్టిన పెట్టుబడికి అధిక వడ్డీలు ఇస్తామని, రియల్ ఎస్టేట్ ప్లాట్లు కేటాయిస్తామని మాయ మాటలు చెప్పి వేల మంది అమయాకులను ఈ సంస్థ డిపాజిట్లు సేకరించింది. గడువు ముగిసినా డిపాజిటర్లకు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కుంభకోణంలో కీలక వ్యక్తులు ఉండటంతో కేసును సీఐడీకి అప్పగించారు.

# జోగి బ్రదర్స్

>>బ్రదర్స్ ను సిట్ అధికారులు ఒకసారి ప్రశ్నించిన విషయం తెలిసిందే. అయితే అప్పటి విచారణలో వెలుగులోకిరాని కీలక అంశాలు, మరికొందరు వ్యక్తులతో ఉన్న సంబంధాలు, నిధుల లావాదేవీలపై స్పష్టత కోసం రెండోసారి కస్టడీ అవసరమని అధికారులు భావించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జోగి రమేశ్, రాములు ఇద్దరూ రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.ఈ కేసుకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. జోగి కుటుంబ సభ్యులకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. జోగి రమేశ్ అరెస్టు సమయంలో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లిన సందర్భంలో అక్కడ జరిగిన ఘటనలపై నమోదు చేసిన కేసులో భాగంగా, ఆయన భార్యతో పాటు కుమారుడికి సీఆర్‌పీసీ 41ఏకింద నోటీసులు అందజేశారు. ఆసుపత్రిలో అద్దాలు ధ్వంసం చేయడం, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలతో ఈ కేసు నమోదు అయింది. **నిందితులకు రిమాండ్ పొడిగింపు:** నకిలీ మద్యం కుంభకోణం కేసులో నిందితుల రిమాండ్ వ్యవధి కూడా పొడిగించారు. ఈరోజు రిమాండ్ గడువు ముగియడంతో నిందితులను విజయవాడ జిల్లా జైలు నుంచి కోర్టుకుతరలించారు. వాదనలు విన్న న్యాయస్థానం ఈ నెల 16వ తేదీ వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం నిందితులను తిరిగి జిల్లా జైలుకు తరలించారు.

## 20యేళ్ల జైలు

>> డిఎస్పీజి.భవ్యరెడ్డి, బొబ్బిలి రూరల్ సి.ఐ. కె.నారాయణరావు,బాడంగి ఎస్ఐ జె.తారకేశ్వంరావు,సి.ఎం.ఎస్. హెచ్.సి.సిహెచ్. రామకృష్ణ, కోర్టు హెడ్ కానిస్టేబులు బి.మహేష్, స్పెషల్ పిపి ఎం.ఖజానారావులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ప్రత్యేకంగా అభినందించారు.

## వారం - వర్జ్యం

03-01-2026, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం, పూర్వాషాఢ కార్తె
○ పౌర్ణమి ము.3.35,
ఆరుద్ర సా.5.30,
వర్జ్యం : తె.4.23-తె.5.50,
దు.ఉ.6.37-ఉ.8.10
శుభసమయం : ఉ.8.20-8.50,సా.5.50-6.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ఇంటి యందు శుభకార్యాల గురించి సన్నిహితులతో చర్చిస్తారు. స్త్రీ మూలంగా ధనలాభం పొందుతారు.

**వృషభం :** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు.

**మిథునం:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి కొంత వరకు మెరుగు పడుతుంది. నూతన ఒప్పందాలు చేసుకుంటారు.

**కర్కాటకం:** బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు. వివాదాలకు దూరంగా వుండండి. ఉద్యోగులకు స్థాన చలనం.

**సింహం:** దూర ప్రాంతాల నుండి ముఖ్య సమాచారం తెలుసుకొంటారు. చర్చా గోష్ఠులలో పాల్గొంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

**కన్య :** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. ఆహార నియమాలు పాటిస్తారు.

**తుల :** పారిశ్రామిక, రాజకీయ రంగాలలోని వారికి కొంతవరకు అనుకూలం. శుభవార్తలు ఆనందం కలిగిస్తాయి.

**వృశ్చికం:** దురభ్యాసాల వైపు మనస్సు మళ్ళకుండా జాగ్రతలు వహించండి. ఆదాయాన్ని మించి ఖర్చులు పెరుగుతాయి.

**ధనుస్సు:** స్పెక్యులేషన్కు దూరంగా ఉండటమే పరోక్షంగా లాభంగా పరిణమిస్తుంది. ఇంటాబయటా అనుకూలం.

**మకరం:** వృత్తి, ఉద్యోగాల పరంగా ఉపయుక్తం లేని బాధ్యతలు పెరుగుతాయి. ఆరోగ్య నియమాలను పాటించండి.

**కుంభం:** మానసిక వత్తిడి అధికమవుతుంది. సెంటిమెంటు వస్తు భద్రతపట్ల జాగ్రత్తలు అవసరం.

**మీనం:**స్త్రీలతో విభేదాలు ఏర్పడనంతవరకు చెప్పుకోదగిన ఇబ్బందులు లేవీ చోటు చేసుకోవు. వాహన సౌఖ్యం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## అమరావతిలో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాజధాని ప్రాంతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు, నీరు నిల్వలు ఏర్పడకుండా ఉండేందుకు చేపడుతున్న వరద నియంత్రణ చర్యల్లో భాగంగా, ఉండవల్లి గ్రామం వద్ద పంపింగ్ స్టేషన్-2 నిర్మాణానికి టెండర్లను ప్రభుత్వం ఖరారు చేసింది అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టను జోన్-8 పరిధిలో నిర్మించనున్నారు. ఈ పంపింగ్ స్టేషన్ ద్వారా వరదల సమయంలో సుమారు 8,400 క్యూసెక్కుల నీటిని కృష్ణా నదిలోకి పంపించేలా డిజైన్ చేశారు. వర్షాకాలంలో రాజధాని ప్రాంతంలో నీటి ముంపు ఏర్పడకుండా ముందస్తు రక్షణ కల్పించడమే ఈ ప్రాజెక్ట ప్రధాన లక్ష్యం. ఈ పనులకు సంబంధించిన టెండర్లలో మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థ ఎల్1 బిడ్‌గా నిలవడంతో, ఆ సంస్థకే ప్రాజెక్ట బాధ్యతలను అప్పగిస్తూ తిదీదిలి నిర్ణయం తీసుకుంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా అధికారికంగా ఆమోదం తెలిపింది.

# రైతుల మేలుకోసమే రీ సర్వే



## అంపోలులో 4 వ విడత రీసర్వే ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

**శ్రీకాకుళం, జనవరి 2 ప్రభాతవార్త:** కుటుంబంతో ఎలాంటి రక్త సంబంధాలు కొనసాగిస్తామో అలాంటి బంధమే భూములతో కూడా ఉంటుందని.. ఆ బంధాన్ని బలపరిచే భాధ్యత కూటమి సర్కారు తీసుకుందని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ అన్నారు. గార మండలం అంపోలు గ్రామంలో జరిగిన రీ సర్వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌తో కలసి పాల్గొన్నారు. సభా కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన ర్యాలీలో కేంద్ర మంత్రి పాల్గొన్నారు. సభలో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు 2026 సంవత్సరంలో కేంద్ర మంత్రి హోదాలో తాను పాల్గొంటున్న తొలి అధికారిక కార్యక్రమం ఇది అని, జిల్లాలో కీలకంగా ఉండే అంపోలులో ఇది జరగడం ఆనందంగా ఉందని చెబుతూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర మంత్రిగా గడచిన 18 నెలలు దేశమంతా క్షణం తీరిక లేని పర్యటనలు చేస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నామని స్పష్టం చేశారు. ఎంతమంది ప్రజా ప్రతినిధులు ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నా అనేక భూ సమస్యలు ఇంకా ఉండనే ఉన్నాయని, సమయం, ఖర్చులు, ప్రయాసలు పెరుగుతున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రీ భూ సర్వే ద్వారా అన్ని సమస్యలు పరిష్కారం అవ్వాలని ఆకాంక్షించారు. గతంలో మాదిరిగా భూ సమస్యల పరిష్కారానికి ప్రజలు ప్రభుత్వం వద్దకు వెళ్ళే విధంగా కాకుండా ఈ సారి భిన్నంగా ప్రజల వద్దకే ప్రభుత్వం వచ్చే ఏర్పాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేశారని ఈ గొప్ప ఆలోచనతో శతశాతం సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందులో ఎలాంటి రాజకీయాలకు ఆస్కారం లేదని తెలిపారు. జిల్లాను అభివృద్ధి చెయ్యాలని అధికార యంత్రాంగం శ్రమిస్తున్నా వారికి అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు సవాల్ విసురుతున్నాయని స్పష్టం చేశారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేలా స్థానిక ప్రజలు సైతం సహకారం అందించాలని తెలిపారు. గత వైఎస్సార్సిపి ప్రభుత్వ హయాంలో భూ సర్వే పేరుతో అనేక తప్పులు జరిగాయని ఆరోపించారు. గతంలో ఆరు వందల గ్రామాల్లో రీసర్వే జరిగితే ఎవరికీ సంబం ధ ంలేదా.

## టిటిడి ట్రస్ట్‌లకు రూ.20లక్షలు విరాళం



**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు తమవంతుగా విరాళాలందిస్తున్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన రైడాన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సిఇఒ వంగల హర్షవర్ధన్ 10లక్షలు రూపాయలు ఎస్వీ ప్రాణ దానట్రస్ట్‌కు, గ్లోబల్ మ్యాను ఫాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ జాయింట్ డైరెక్టర్ నేలబొట్ల శుభ సౌజన్య బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి 10లక్షలు రూపాయలు డిడిలను టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. ఆ సంస్థల తరపున ప్రతినిధులు కుప్పాల గిరిధర్‌కుమార్ విరాళాలిచ్చారు.

## 'వైకుంఠవాకిలి' దర్శనం ముక్తికి సోపానం : ప్రముఖులు



**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోపల పవిత్రమైన వైకుంఠవాకిలిద్వారా శ్రీవారిని దర్శించుకోవడం ఆనందకరమని పలువురు ప్రముఖులు తెలిపారు. భక్తుల్లో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శరత్‌ఛంద్రచందూర్కర్, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గడి ప్రవీణ్‌కుమార్,సింగర్‌మన్యచంద్రన్, ఐఎఎస్ కార్తీకేయమిశ్ర కుటుంబసభ్యులతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. వైకుంఠద్వార దర్శనంద్వారా శ్రీవారిని దర్శించుకుని కానుకలు సమర్పించారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దేశం అభివృద్ధిలో ప్రపంచంలోనే మూడవస్థానం: నటుడు సుమన్



**తిరుమల,జనవరి 2ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశ ఖ్యాతిని, అన్ని రంగాల్లో అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రపంచంలోనే ఒక గుర్తింపు తీసుకువచ్చిన ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వం ప్రజల్లో విశ్వాసం చూరగొందని సినీనటుడు సుమన్ తెలిపారు. రాజకీయంగా తాను మాట్లాడటం లేదని, అభివృద్ధి చేసే నాయకుల వైపే నిజాలు మాట్లాడుతున్నానన్నారు. దేశం అభివృద్ధిలో మూడవస్థానంలో ఉండటం దేశ ప్రజలు కూడా మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు కాదని, మంచిచేసే వారిని ప్రజలు గుర్తించుకుంటారన్నారు. ప్రజలు జరుగుతున్న మంచి ,అభివృద్ధికి గర్వపడాలన్నారు.అన్నమయ్యచిత్రంలో శ్రీవారి పాత్ర పోషించడం తన జన్మధన్యత అని, ప్రస్తుతం చేస్తున్న పాత్రలన్నీ టైంపాస్‌మాత్రమేనని అన్నారు. ప్రస్తుతం 11చిత్రాల్లో నటిస్తున్నా అది నామామాత్రంగా అన్నారు. వైకుంఠద్వారంలో ఏడుకొండలస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని సుమన్ తెలిపారు. శుక్రవారం ఉదయం సినీదర్శకులు గోపీచంద్, బాబి,కోన వెంకట్, మ్యూజిక్ దర్శకుడు థమన్, గాయకుడు చిన్నికృష్ణ శ్రీవారిని దర్శించుకున్నారు.

## రాష్ట్రంలో గణనీయంగా పెరిగిన జిఎస్టీ వసూళ్లు

### - జిఎస్టీ వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం

**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:**జీఎస్టీ వసూళ్లు గణనీయంగా పెరుగుతున్నాయి. గత ఏడాది డిసెంబరు(2025) నెలలో ఆంధ్రప్రదేశ్ అత్యధిక నికర వసూళ్లను సాధించింది. జీఎస్టీ విధానం ప్రారంభమైన తర్వాత గత నెలలో రూ.2,652 కోట్ల వసూళ్లతో రికార్డు సృష్టించింది. అంతే కాదు గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ప్రతి నెలా అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే అధిక వసూళ్లు సాధించింది. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు, వస్తు వినియోగం పెరిగిందనేందుకు ఇది సంకేతమని రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కమిషనర్ ఎ.బాబు పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో జీఎస్టీ వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలిచింది. తమిళనాడు 7.85 వృద్ధితో తొలిస్థానంలో ఉంది. కర్ణాటక (5.12 ), కేరళ (3.69 ), తెలంగాణ (2.45 )లను దాటి ఆంధ్రప్రదేశ్ వృద్ధి సాధించడం విశేషం. ఆటోమొబైల్, సిమెంట్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 23.69 వృద్ధి కనిపించింది. గత ఏడాది డిసెంబరులో ఎస్‌జీఎస్టీ వసూళ్లు రూ.1,102 కోట్లకు చేరుకున్నాయి. 2024 డిసెంబరుతో పోలిస్తే 2.46 వృద్ధి నమోదైంది. ఐజీఎస్టీ సర్దుబాట్లు కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచాయి. ఐజీఎస్టీ సర్దుబాట్ల రూపేణా రాష్ట్రం రూ.1,549 కోట్ల ఆదాయం రాబట్టింది. 2024 డిసెంబరు నెలతో పోలిస్తే ఇందులో 8.29 వృద్ధి ఉంది. పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా రూ.1,448 కోట్ల ఆదాయం వచ్చింది. అంతకుముందు ఏడాది డిసెంబరుతో నెలతో పోలిస్తే 3.89 వృద్ధి ఉంది. వృత్తి పన్ను వసూళ్లలోనూ 2025 డిసెంబరు చక్కని ఫలితాలు కనబరిచింది. అంతకుముందు ఏడాది డిసెంబరుతో పోలిస్తే 38.32 వృద్ధి నమోదైంది. జీఎస్టీ నికర, స్థూల వసూళ్లలో తొలి త్రైమాసికంలో తగ్గుదల కనిపించగా ఆ పరిస్థితులను తారుమారు చేసి వృద్ధిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు కారణమయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు.దిగుమతులను మినహాయించి పరిశీలిస్తే దేశంలో సగటున 5.61 వృద్ధి రేటు నమోదు కాగా ఆంధ్రప్రదేశ్‌లో అదికంగా 5.78 ఉన్నాయి. జాతీయ వృద్ధి రేటును దాటి రాష్ట్రంలో జీఎస్టీ నికర వసూళ్లు ఉన్నాయి. గత ఏడాది డిసెంబరు నెలాఖరు వరకు 9 నెలల కాలంలో మొత్తం రూ.39,517 కోట్ల జీఎస్టీ వసూళ్లు రాష్ట్రంలో సాధ్యమయ్యాయి. అందులో కేంద్రానికి, ఇతరత్రా వెళ్లే వాటిని మినహాయిస్తే రూ.25,926 కోట్ల నికర జీఎస్టీ ఖజానాకు చేరింది.

## 15 భారీ వృక్షాలను తిరిగి నాటే ప్రయత్నం

### వందల సంవత్సరాల నుండి ఉన్న చెట్లను పరిరక్షిస్తూ మిషన్ పునర్వ వనం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్..



**ఎలమంచిలి, జనవరి 02, ప్రభాతవార్త:** నియోజకవర్గంలో రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న వందల సంవత్సరాల వయసు కలిగిన చెట్లకు పునర్ జీవం కలిగించే మిషన్ పునర్వ వనం కార్యక్రమాలను భావితరాలకు తెలియజేయవలసిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ తెలిపారు. అచ్యుతాపురం నుండి అనకాపల్లి రోడ్డు విస్తరణలో తొలగిస్తున్న పురాతన చెట్లను వేరొక చోటకి తరలించి సంరక్షించే మిషన్ పునర్వ వనం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తూ రోడ్డు విస్తరణలో తొలగించాలని ఆలోచన వచ్చినప్పుడు చెట్లకు జీవం పోయాలని ఆలోచనతోనే రూపొందించిన మిషన్ పునర్వ వనం మంచి ఆలోచన అని కొనియాడారు. ఈ కార్యక్రమానికి రూపకల్పన, ఆలోచన చేసిన శాసనసభ్యులు సుందర విజయకుమార్ను ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. వందల సంవత్సరాల వయసు కలిగి, ప్రజలతో ఎంతో అనుబంధం కలిగిన చెట్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమం గూర్చి విద్యార్థులకు తెలియజేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ మానవ మనుగడకు సరైన జీవన విధానానికి ముఖ్యమైనవి గాలి నీరు ఆహారం చెబుతున్నామని కోటమే ప్రభుత్వంలో అభివృద్ధితో పాటుగా పకృతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడాన్ని మనం చూస్తూనే ఉంటున్నామన్నారు. జిల్లా కలెక్టర్ సహాయ సహకారాలతో ఇప్పటికే ఎమ్మెల్యేగా తన అధికారం చేపట్టినప్పుడు నుండి 30000 పైచిలుకు మొక్కలు నాటామన్నారు.

## పరకామణికేసు కోర్టు పరిధిలో ఉన్నందున పూర్తి సమాచారం చెప్పలేం

### - ఎసిబి డిజి అతుల్ సింగ్



**విజయవాడ,జనవరి2,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల పరకామణికేసు కోర్టు పరిధిలో ఉన్నందున పూర్తి సమాచారం చెప్పలేమని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ స్పష్టం చేసారు.ఈ కేసుపై ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తెలిపారు. కానీ.. కోర్టు డైరెక్షన్ ప్రకారమే కేసు విచారణ కొనసాగుతోందని స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కేసు బుక్ చేసిన తర్వాత విచారణ మొత్తం పూర్తి చేయడానికి 15 రోజులు పడుతుందని.. సిబ్బంది తక్కువగా ఉన్నందున అన్ని కేసులను దర్యాప్తు చేయడం సాధ్యం కావడం లేదని తెలిపారు. చిన్న ఎమోంట్ ఉన్న కేసులు ఉంటే.. ఆయా శాఖలకే చర్యలు తీసుకోవాలని రాస్తున్నామ్నారు. పెద్ద మొత్తం డిమాండ్ చేసే వారిపైనే తాము ఇప్పుడు దృష్టి పెట్టామని చెప్పారు. గత నాలుగైదు నెలలుగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇండియాలో క్రికెట్‌కు బాగా క్రేజ్ ఉందని.. టెండూల్కర్, విరాట్ వంటి వారు త్వరగా అవుట్ అయితే జోక్స్ చేస్తామని.. అదే విధంగా అవినీతి నిర్మూలనపై కూడా ఎవరిష్టం వచ్చినట్లు వారు అటువైపు నుంచి మాట్లాడతారని చెప్పారు. ఇటువైపు కూడా వచ్చి చూస్తే కన్విక్షన్ వరకు కేసు విచారణ ఎలా ఉంటుందో అందరికీ తెలుస్తుందని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఏసీబీకి ఏ విధంగా ఫిర్యాదు చేయాలనే దానిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లే ప్రజల నుంచి చిన్న మొత్తంలో లంచాలు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ప్రజలు దీనిపై తమకు ఫిర్యాదులు చేస్తే.. ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని ఏసీబీ డీజీ తెలిపారు. ఏసీబీ దృష్టికి వచ్చే ఫిర్యాదుల్లో తమ ప్రధాన కార్యాలయంలో చర్చించి.. ఆ తర్వాత ప్రాధాన్యతను బట్టి దాడులు చేస్తామని వివరించారు. ఏసీబీ టీం నుంచి సమాచారం ముందుగా లీక్ అవుతుందనేది వాస్తవం కాదన్నారు. ఏసీబీ కార్యాలయంలో ఎప్పుడూ ఇంటర్నల్ విజిలెన్స్ ఉంటుందని చెప్పారు. తాము అన్నీ ముందుగానే చర్చించలేమని.. దర్యాప్తులో అనేక అంశాలను తీసుకుని ముందుకు సాగుతామని ఏసీబీ డీజీ అతుల్ సింగ్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికనే ఏసీబీ కార్యాలయాలు పనిచేస్తున్నాయన్నారు. దీనివల్ల లంచం డిమాండ్ చేసే ఉద్యోగులపై ఏసీబీకి ఫిర్యాదు చేయాలన్నారు.

## ఎస్‌పిడిసిఎల్‌లో 46 మందికి పదోన్నతులు

### - చీఫ్ ఇంజనీర్లుగా కృష్ణారెడ్డి, సంపత్ కుమార్



**తిరుపతి, జనవరి 2 ప్రభాతవార్త:** ఎస్‌పిడిసిఎల్‌లో 46 మంది ఉద్యోగులకు పదోన్నతి కల్పిస్తూ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సూపరింటెండింగ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న ఎం. కృష్ణారెడ్డికి చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) గానూ, శ్రీసత్యసాయి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న కే. సంపత్ కుమార్ కు చీఫ్ జనరల్ మేనేజర్ (క్వాలిటీ కంట్రోల్ !! ప్లానింగ్) గానూ పదోన్నతి కల్పించారు. అదేవిధంగా తిరుపతి సర్కిల్ ఎంఆర్ టి విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న పి. రవికుమార్ కు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎంక్వైరీ !! అసెస్మెంట్) గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే నెల్లూరు సర్కిల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తున్న కె. వెంకట పవన్ కుమార్ కు తిరుపతి ఎంఆర్ టి విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పదోన్నతి కల్పించారు. వీరితోపాటు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా విధులు నిర్వహిస్తున్న సి. హరి ప్రసాద్, సి. విజయ వెంకటేష్ లకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గానూ, జూనియర్ ఇంజనీర్ స్థాయి నుంచి అసిస్టెంట్ ఇంజనీర్లుగా 28 మందికి, గ్రాడ్యుయేట్ జూనియర్ ఇంజనీర్ నుంచి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా 6 మందికి, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ నుంచి పర్సనల్ ఆఫీసర్లుగా నలుగురికి, జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్లుగా ఇద్దరికి పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే గంటెల సుమన కన్నుమూత



**విశాఖపట్నం, జనవరి 2 ప్రభాతవార్త:** పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నేత గంటెల సుమన (68) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, విశాఖపట్నంలోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆమె మృతితో పాయకరావుపేట నియోజకవర్గంలో విషాదఛాయలు అలుముకున్నాయి.విశాఖ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి1983లో టీడీపీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా విజయం ఆమె మృతి పట్ల పలువురు నేతలు, కార్యకర్తలు సంతాపం గంటెల సుమన 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో పాయకరావుపేట (ఎస్సీ రిజర్వ్డ్) నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తన పదవీకాలంలో 1984లో నక్కపల్లిలో బాలికల కోసం గురుకుల పాఠశాల ఏర్పాటు చేయడంలో కీలకపాత్ర పోషించారు. సుమన అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరి అదే స్థానం నుంచి రెండుసార్లు పోటీ చేసి ఓటమి చెందారు. అనంతరం రాజకీయాలకు దూరంగా ఉన్న ఆమె, ప్రస్తుతం టిడిపిలోనే కొనసాగుతున్నారు. సుమన మరణ వార్త తెలియగానే పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజల సందర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని విశాఖ అక్కయ్యపాలెంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో ఉంచారు. ఆమె స్వగ్రామంలో శనివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## వల్లభనేని వంశీకి హైకోర్టులో తాత్కాలిక ఊరట

**విజయవాడ,జనవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ కీలక నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఏపీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. బెజవాడ మాచవరం పోలీసులు నమోదు చేసిన హత్యాయత్నం కేసులో తనను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని వంశీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా వంశీని అరెస్టు చేయవద్దంటూ కోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను వెకేషన్ బెంచ్‌కు వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకుంది.నూతక్కి సునీల్ అనే వ్యక్తి ఈ నెల 17న మాచవరం పోలీస్ స్టేషన్‌లో వంశీపై ఫిర్యాదు చేశాడు. వల్లభనేని వంశీ అనుచరులు తనపై దాడికి పాల్పడ్డారని, తనను హత్య చేయడానికి ప్రయత్నించారని ఆరోపించాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వంశీతో పాటు మరో ఎనిమిది మందిపై హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన విషయం బయటకు రావడంతో వంశీ ఒక్కసారిగా అందుబాటులో లేకుండా పోయారు. ఆయన అజ్ఞాతంలోకి వెళ్లినట్టు పోలీసు వర్గాలు తెలిపాయి. వంశీతో పాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఇతరులు కూడా కనిపించకపోవడంతో, వారిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కొన్ని బృందాలు హైదరాబాద్ కేంద్రంగా గాలింపు చర్యలు చేపట్టినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో వంశీ హైకోర్టును ఆశ్రయించి ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. తనపై పెట్టిన కేసు రాజకీయ ప్రేరణతో కూడినదని, తప్పుడు ఆరోపణల ఆధారంగా కేసు నమోదు చేశారని వంశీ తన వాదనలో పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న హైకోర్టు, ప్రస్తుతం వంశీని అరెస్టు చేయవద్దంటూ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

## టోల్‌ప్లాజాలో వసూళ్లను నిలిపివేయండి

### - కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి టిడిపి ఎంపి సనా సతీష్ వినతి

**విజయవాడ,జనవరి 2,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్రాంతి సందర్భంగా టోల్‌ప్లాజాలో టోల్ వసూళ్లను నిలిపివేయాలంటూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని టీడీపీ ఎంపీ సనా సతీష్ కోరారు. సంక్రాంతికి హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి లక్షలాది మంది ఏపీలోని సొంత గ్రామాలకు వస్తారని.. ఫలితంగా హైదరాబాద్‌విజయవాడ రహదారిపై విపరీతమైన రద్దీ ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని టోల్ వసూళ్లు నిలిపివేయాలని కేంద్రాన్ని కోరారు. సంక్రాంతి పండుగ కారణంగా హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ వాసులు పెద్ద ఎత్తున తమ తమ స్వస్థలాలకు వెళ్తుంటారని.. ఫలితంగా హైదరాబాద్‌విజయవాడ రహదారిపై తీవ్రమైన ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుందన్నారు ఎంపీ సనా సతీష్. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పంతంగి, కొర్లపహడ్, చిల్లకల్లు, కీసర టోల్ ప్లాజాల వద్ద విపరీతమైన రద్దీ ఏర్పడి గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోతుందన్నారు. ఈ కారణంగా తెలుగు ప్రజలకు సమయం ఆదా అవ్వడం, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు టోల్‌ప్లాజాల వద్ద టోల్ వసూళ్లను మాఫీ చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు ఎంపీ సనా సతీష్.

దీని వలన ప్రయాణం సాఫీగా జరిగి ఇళ్లకు క్షేమంగా చేరుకుంటారని అన్నారు. సంక్రాంతి పండుగను అందరూ సాంప్రదాయ బద్ధంగా జరుపుకునేందుకు అవకాశం కలుగుతుందని.. తమ విజ్ఞప్తిని పరిశీలించాలంటూ కేంద్ర మంత్రిని కోరారు .

# రాష్ట్రంలో దట్టంగా అలుముకుంటున్న పొగమంచు

## పెరుగుతున్న చలి తీవ్రత

**విజయవాడ,జనవరి 2,ప్రభాత వార్తప్రతినిధి:**రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత పెరుగుతోంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి రావాలంటే వణికిపోతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే వ్యత్యాసం లేకుండా కనిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లోనైతే ఉష్ణోగ్రతలు మరీ దారుణంగా పడిపోతున్నాయి. రాష్ట్ర ప్రజలను చలి గజగజలాడిస్తోంది.

పొగ మంచు కమ్మేసి వాతావరణమంతా శ్వేతమయంగా మారింది. పొగ మంచు దట్టంగా ఆవరించటంతో ఎదురుగా వచ్చే వాహనానికి హెడ్

లైట్లు ఏమాత్రం కనిపించడం లేదు. దగ్గరగా వచ్చే వరకు ద్విచక్ర వాహనాలు కనపడకపోవటంతో భారీ వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణంలో ఉదయం 7 గంటల సమయంలోనూ మంచుపొరలు తొలగలేదు. అద్దంకి పట్టణం, గుండా నామ్ రహదారిపై విపరీతమైన పొగ మంచు ఉండటంతో వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కాదు. ఈ రహదారిపై నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. పొగ మంచు దట్టంగా ఆవరించటంతో ఎదురుగా వచ్చే వాహనానికి హెడ్

లైట్లు ఏమాత్రం కనిపించడం లేదు. దగ్గరగా వచ్చే వరకు ద్విచక్ర వాహనాలు కనపడకపోవటంతో భారీ వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. శీతల పదార్థాలకు దూరంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వేడిగా ఉండే ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. గోరు వెచ్చటి నీరు తాగితే మంచిది. మంచులో ఉదయం, రాత్రులు తిరగటం తగ్గించాలి. అవసరమైనపుడు ఉన్ని దుస్తులు, స్వెట్టర్లు, మాస్కులు ధరించాలి. చలికాలంలో తక్కువ మోతాదులో నీరు తీసుకోవడం మంచిది కాదు. దీని వల్ల పలు అనార్యోగ సమస్యలు వస్తాయి. ఎక్కువ నీరు తీసుకోవడం వల్ల లోపల పేరుకుపోయిన కఫం బయటకు వస్తుంది. న్యూమోనియా రాకుండా ఉండేందుకు చిన్నారులు, పెద్దలు టీకాలు వేయించుకోవాలి. శ్వాస సమస్యలు ఉన్నవారు ఉదయం సమయంలో చల్లటి గాలికి వాకింగ్ చేయడం కొద్ది రోజులు తగ్గించాలి అని వైద్యులు చెబుతున్నారు. రాష్ట్రంలో చలి బాగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో చిన్నారులు, వృద్ధులు మరింత అప్రమత్తంగా ఉండాలి. న్యూమోనియా వచ్చే ప్రమాదం ఉంది. దీనివల్ల జలుబు, దగ్గు, జ్వరం, శ్వాస తీసుకోవటంలో ఇబ్బందులు ఎదురవుతాయి. శీతాకాలంలో జాగ్రత్తలు పాటించకుంటే రక్తనాళాలు గడ్డ కట్టే ప్రమాదం పొంచి ఉంది. తద్వారా గుండె, బ్రెయిన్ స్ట్రోక్‌లు వంటివి వచ్చే అవకాశం ఉంది. అనారోగ్యానికి గురైతే వెంటనే ఆసుపత్రిలో వెళ్లాలి. సరైన చికిత్స చేయించుకోవాలి. ఎల్లప్పుడూ పోషకాహారాన్నే తీసుకోవాలని, ఈ సీజన్లో లభించే పండ్లు తినాలని వైద్యులు సూచిస్తున్నారు. మంచు ఎక్కువగా కురుస్తుండడంతో వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారులను మంచు దుప్పటి కప్పేసింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత అధికంగా ఉండడం వల్ల వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరూ చలి మంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దట్టమైన పొగ మంచు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాపట్లజిల్లా చీరాల, పర్చూరు నియోజకవర్గాలను మంచు దుప్పటి కప్పేసింది. దీంతో వాహనాలదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. చీరాల, వేటపాలెం, చినగంజాం, పర్చూరు, మార్టూరు ప్రాంతాల్లో పొగమంచు దట్టంగా అలుముకుంది. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు, చిన్నారులు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. ప్రయాణం సాగాలంటే వాహనాల హెడ్ లైట్లు వెల్లాల్సిందే, లేదంటే ప్రమాదమే. ఒంగోలు కత్తిపూడి జాతీయ రహదారిపై మంచు ఆవహించటంతో వాహనాలు నెమ్మదిగా వెళుతున్నాయి. రైళ్లు కూడా నిదానంగా వెళుతున్నాయి.

ప్రకాశం జిల్లా అద్దంకి పట్టణంలో ఉదయం 7 గంటల సమయంలోనూ మంచుపొరలు తొలగలేదు.

అద్దంకి పట్టణం, గుండా నామ్ రహదారిపై విపరీతమైన పొగ మంచు ఉండటంతో వాహనదారుల అవస్థలు అన్నీ ఇన్నీ కాదు.

ఈ రహదారిపై నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి.

VIJAYAWADA MUNICIPAL CORPORATION
'E' Procurement Notice No.41/VMC/CDB/2025-26, Dt.02-01-2026
Roads, Drain, Culvert, Water supply, repairs, maintenance works & Disposal of the Red Cloths(Box Tender) (Total 63 works)-Est. Amount Rs.1580.53 Lakhs.
All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen@www.tender.apeprocurement.gov.in.
S/d-
For COMMISSIONER

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివి తేటలు ఉండీ అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యశుద్ధి అవసరం.

-సి.డబ్ల్యు. వెండైట్

# 'సజీవహత్యలు' భావ్యమేనా?


ఇక ముందు రాబోయే రోజుల్లో మానవ సంబంధాలు ఎలా ఉంటాయో చెప్పలేని పరిస్థితుల్లో కన్నవారి, ప్రేమాభిమానాల నేపథ్యంలో కలిగిన ఆందోళనలు ఎంతటి కాఠిన్యానికి దారితీస్తాయో తాజా సంఘటనలు గుర్తుచేస్తున్నాయి. కడుపు తీపి చంపుకొని కన్న బిడ్డలను కాటికెలా పంపిస్తాయో జరిగిన, జరుగుతున్న సంఘటనలు వింటేనే, తెలుసుకుంటేనే మనసును కలచివేస్తాయి. తన పిల్లల ఆలనా పాలనా చూసేవారు లేక ఎవరి సాయం అందక ఒక తండ్రి తన ముగ్గురు బిడ్డలనూ పాలల్లో విషమిచ్చి చంపేశాడు. తనూ ఆత్మహత్య చేసుకున్నాడు. మరో తల్లి తన భర్త లేని జీవితాన్ని ఊహించుకోలేక తన ఇద్దరుపిల్లలనూ చంపి ఆత్మహత్య చేసుకొంది. ఈ రెండు సంఘటనలు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో మంది హృదయాలను కదిలిస్తున్నాయి. ఇక్కడా అక్కడా అనికాదు. తాము చనిపోయాక తమ పిల్లల భవిష్యత్ ఏమిటి? వారినెవరు సాకుతారు?వారి భవిష్యత్‌ను తానుతీర్చిదిద్దగలనా అనే సందేహాలతో ఒక చీటిరాసో, రాయకో తాము ఆత్మహత్యలు చేసుకోవడం గతంలో చూశాము. ఏమీ ఆలోచించకుండానే ఆవేశంతో ఇలాంటి అకృత్య దుష్కృత్యాలకు పాల్పడిన సంఘటనలు లెక్కకు మించి లెక్కల్లోకెక్కాయి. తదుపరి కాలంలో ఆర్థిక సమస్యలతో పరువు మర్యాదలు మంట కలసిపోతాయనే భయంతో తను తనతోపాటు తన బిడ్డలు, జీవిత భాగస్వామితో కలిసి విషాహారంతో చనిపోయిన సందర్భాలూ విన్నాం. తాజాగా మన తర్వాత మన బిడ్డల బతుకేమిటని ఆలోచించే పరిస్థితిలో వారిని కూడా 'హత్య' చేస్తున్నారు. 'ప్రేమతో చంపేస్తున్నారు' అనే మాట చిన్న మాట. మానవ సంబంధాల్లో ఇదొక కొత్త పరిణామంలా భావించాలి. భర్త మృతితో తీవ్ర ఆవేదనలో ఉన్న మహిళ ఇద్దరు పిల్లలనూ చంపి తాను ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించింది. పురుగులమందు కలిపిన అన్నాని పిల్లలకు తినిపించి తానూ తింది. నాగర్ కర్నూలు జిల్లా కల్వకుర్తిలో నూతన సంవత్సరం రోజున ఆ ఇల్లాలికిలాంటి దుర్బుద్ధి పుట్టింది. తానూ చనిపోవాలన్నదే నిర్ణయం కనుక ఆమె మనసు లోతుల్లోకి తొంగి చూడాలి. సాధారణంగా భర్త చనిపోయినా భార్య ఆ బాధను భరిస్తూనే భర్త జ్ఞాపకాలతో ఆలోచనలతో పిల్లల భవిష్యత్తే బంగారం కావాలని ఎలాగోలా బతికేస్తుంది. అదే భార్య చనిపోయిన ఏ మగాడైనా ఆమెతో గడిపిన మధుర క్షణాలను తలపుకొస్తే గుండెనిబ్బరాన్ని కోల్పోతాడు. మానసికంగా తోడు పోయిందని బలహీనుడౌతాడు. చెప్పాలంటే పిల్లల భవిష్యత్ చక్కగా తీర్చిదిద్దలేనేమో అనేటంత బీరువవుతాడు. కానీ మానసిక దుర్బలత్వం ఎవరికైనా ఒకటే అనుకున్నా సృష్టిలో ఇద్దరి మధ్యా ఈ తేడా ఉంది. కానీ ఇక్కడలా కాదు ఆమె తట్టుకోలేకపోయింది. వనపర్తి జిల్లా శ్రీరంగాపురానికి వాసి భీంశెట్టి ప్రకాశ్‌కు ప్రసన్న దంపతులకు కూతురు, కొడుకు. వారి ఆలనాపాలనా చదువులను చక్కగా చూసుకునేవారు. ఆర్థిక స్తోమత అంతమాత్రంగా ఉండే ఇంట్లో ప్రకాశ్ మరణించే సరికి ఇతరుల మీద బతకాల్సి వస్తుందన్న అభిమానంతో తాను ఆత్మహత్య చేసుకుంటే పిల్లలు అనాథలౌతారని బతికినా వారిని సాకగల ఆర్థిక శక్తిలేదని తలచింది. రోజులు మారాయి. కొన్నిసందర్భాల్లో భార్యలు కూడాభర్తలపై విసిగెత్తి, అకృత్యాలకు పాల్పడుతున్నారు. భర్తలని పరిమార్చాలని పన్నాగాలు పన్నుతున్నారు. వెనుకఎవరున్నా ఎవరి ప్రోద్బలమున్నా జరుగరాని ఘోరాలు జరిగిపోతున్నాయి. ఇటువంటి రోజుల్లో కూడా భర్త చనిపోయాడని, ఇక బతుకు బాటలో కష్టాలు భరించలేమని వగచి కుటుంబానికి మరణశాసనం రాసింది. తానూ ఈ భూమ్మీదనుంచి నిష్క్రమించింది. మరో సంఘటనలోనంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం తడుమలదిన్నె గ్రామవాసి వేములపాటి నరేంద్ర ముందు సంఘటనకు భిన్నంగా ప్రవర్తించాడు. భార్య మృతితో ముగ్గురు పిల్లలను పెంచలేక దుర్దశను భవించాడు. బంధువుల ఆదరణ లభించలేదని బెంబేలు పడ్డాడు. తన దారి తాను చూసుకోలేక పిల్లలు ముగ్గురికి పాలల్లో విషమిచ్చి తను ఉరిపోసుకుని తనువు చాలించాడు. ఉదంతాలు ఏవైనా, సంఘటనలెలా ఉన్నా జీవిత భాగస్వామి మాటతో తాము బతుకలేమని భావించడం మానసిక బలహీనత. ఇలాంటి వారి వారి సొంత మానసిక దౌర్బల్యానికి ఎవరూ కారణం కాదు. కానీ బిడ్డల జన్మకు కారకులయ్యే హక్కేకానీ మన ఆలోచనలకు వారిని బలిచేసే హక్కు ఏతండ్రికైనా, ఏ తల్లికైనా లేదు. ఓ శుభముహూర్తాన దంపతులై నూరేళ్ల జీవించాల్సిన జీవితాలు అర్థ మధ్యంతరంగా అంతమైపోవడం సమాజం క్షమించదు. ఇవన్నీ ఆ తండ్రి తీర్పో, ఆ తల్లి మానసిక ప్రవర్తనలో కలిగినమార్పో అని సరిపెట్టుకోవాలా? వారి అనాలోచిత నిర్ణయాలకు పిల్లలు బలయ్యే పరిస్థితి ఎవరికీ రానీయద్దు. తిన తిండి లేని బిచ్చగాళ్లు కూడా తమ బిడ్డలని భిక్షాటన చేసి మరీ పెంచి సమాజంలో ఉద్దండులుగా తీర్చిదిద్దిన వాళ్ల జీవితాలు ఇలాంటి వారికి ఆదర్శం కాకూడదా? పాచిపనులు చేసి జీవితం వెళ్లబుచ్చుతున్న మహిళల జీవితాలు మరొకరికి మార్గదర్శకాలు కావా! ఇలాంటి వాటిపై సమాజంలో ఉన్న వారందరికీ మార్గదర్శనం కావాలి. ఇతరులు సహకరించడం లేదనో, అసహ్యించు కుంటున్నారనో, లేనిపోని అపోహ లకు పోకమానవత్వంతో ప్రవర్తించే ఆలోచన భరోసా ఈనాటి తల్లిదండ్రులకురావాలి. అందుకోసం ప్రభుత్వానికీ బాధ్యత ఉంది. ప్రజలకు మంచి జీవన విధానం అలవాట్లు నేర్పడమేకాదు. వారిలో మనో వైకల్యాన్ని పోగొట్టి దుష్ప్రభావాలపై అవగాహన కల్పించే పాఠాలు చెప్పించడమూ చేయాలి. అప్పుడో మానసిక దౌర్బల్యపు కాఠిన్యాలు దరిచేరవు.

నిముషాన్ని సంపూర్ణత్వంతో నింపడమే సంతోషం. పశ్చాత్తాపానికి, ఆజ్ఞలకూ అతీతమైనదే అసలైన సంతోషం.



ఎమర్సన్

కొంత మంది గొప్పవారుగా పుడతారు. కొంతమంది గొప్పతనాన్ని సాధిస్తారు.



షేక్స్పియర్

# శుభాకాంక్షలన్నీ శుభప్రదంగా ఉండాలి

**మమ్మీ, డాడీ చదువులు ఉంటే ఉండనివ్వండి కానీ వాటితోపాటు మన సంస్కృతి సంప్రదాయాలు తెలిపే పాఠ్యాంశాలను కూడా ప్రాథమిక స్థాయి నుంచి పిల్లలు తెలుసుకునే విధంగా విద్యావిధానం రూపొందించాలి. అలాగే ఈ క్లబ్‌లు, పబ్‌లు, సైబర్ కేఫ్‌లలో నీలిచిత్రాలు, అంగాంగ ప్రదర్శనలపై ఉక్కుపాదం మోపాలి. శుభాకాంక్షలన్నీ శుభప్రదంగా ఉండాలి. ఈ విషయంలో ప్రభుత్వంతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు కల్పించుకోవాలి. మన సంస్కృతి సంప్రదాయాలను రక్షించేందుకు సంసిద్ధులు కావాలి. ప్రజల భాగస్వామ్యమే మన సంస్కృతి పరిరక్షణకు ఏకైక మార్గం.**

దామెర్ల సాయిబాబ

చదువు సంధ్యలు పెరిగే కొద్దీ మనుషుల ప్రవర్తనలో మార్పులు రావాలి. ఏది మంచో, ఏది చెడో గ్రహించాలి. విచక్షణ పెంపొందాలి. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందాం. అత్యంత ప్రతిభావంతులైన యువతీ యువకులు అహర్నిశలు కష్టపడి దేశ విదేశాల్లో గుర్తింపు తెస్తున్నారు. మరోవైపు దైవం పట్ల భక్తి శ్రద్ధలు పెరుగుతున్నాయి. దేవాలయాలు కిటకిట లాడి పోతున్నాయి. ఇంకో వైపు కొందరు పాశ్చాత్య మోజులో పడి మన సంస్కృతి, సంప్రదాయాలకు మంగళం పాడుతున్నారేమో ననిపిస్తున్నది. రానురాను భారతీయ సంస్కృతి అదృశ్యమైపోతుందేమోననే కలవరం కలుగకతప్పదు. మొన్న బుధవారం రాత్రి నూతన సంవత్సర ఆరంభం పేరుతో దేశవ్యాప్తంగా అనేక నగరాల్లో వెర్రిగంతులు వేయడం, కొన్ని పబ్బుల్లో, క్లబ్బుల్లో నృత్యాల పేరుతో చేసే వెకిలి చేష్టలు వెర్రితలలు వేస్తున్న విష సంస్కృతికి పరాకాష్ఠగా చెప్పొచ్చు. కొందరు యువతీ యువకులు కేరింతలు కొడుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పేరుతో నానా హంగామా చేశారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ అర్ధరాత్రి పన్నెండు గంటల తర్వాత నినాదాలు చేస్తూ రోడ్లపై వీరంగం సృష్టించారు. అసలు వారు ఎవరికి స్వాగతం చెప్తున్నారో వారికే తెలియకుండాపోయింది. అయితే ఈసారి హైదరాబాద్‌లో మాత్రం పోలీసులు తీసుకున్న జాగ్రత్తలు, హెచ్చరికలు, అన్నింటికంటే మించి పటిష్టమైన తనిఖీల కారణంగా చాలా వరకు ప్రమాదాలు, ఘర్షణలు తగ్గాయి. కానీ పొరుగునున్న కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ వికృత చేష్టలు పరాకాష్ఠకు చేరాయనే చెప్పొచ్చు. రోడ్లపైనే మద్యంసేవిస్తూ, వారు వేస్తున్న చిందులు, వెర్రికేకలు, అరుపులను అడ్డుకోవడం పోలీసులకు తలకుమించిన భారంగా మారింది. ఎంతో మంది గాయపడ్డారు. ఒకదశలో బెంగళూరు పోలీసులు లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఇక పబ్‌లు, క్లబ్బుల్లో ఈఆనంద కేళిలో అదుపు తప్పి ఎంతమంది గాయపడ్డారో తెలియదు. అర్ధరాత్రితో ముగించాలని పోలీసులు ఆరాటపడినా, ఆదేశాలు ఇచ్చినా, కొన్ని పబ్‌లు, హోటళ్లు, తెలవార్లూ పాశ్చాత్య సంగీతహోరు, అశ్లీల నృత్యాల పేరుతో మునిగిపోయాయి. ఇది హైదరాబాద్, బెంగళూరు, ముంబాయి లాంటి నగరాలకే పరిమితం కాలేదు. గ్రామాలకు కూడా విస్తరించింది. తెలుగు రాష్ట్రాల్లో అనేక పట్టణాల్లో, నగరాల్లో చివరకు కొన్నిగ్రామాల్లో కూడా విషసంస్కృతి వికృతరూపందాల్చింది. కొన్ని యూట్యూబ్‌లు, టీవీల్లో జుగుప్సాకరమైన నృత్యాల ప్రచారం జరిగింది. తండ్రి ముందు కొడుకు, తల్లి ముందు కూతురు ఇలా కుటుంబం అంతా కలిసి కూర్చొని టీవీ చూడలేని విధంగా కొన్ని కార్యక్రమాలు సాగాయి. ఇటువంటి కార్యక్రమాలు యువతీయువకులకు ఒకింత ఆనందం కలిగించినప్పటికీ ఆ క్షణానికే పరిమితం అవుతాయి. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం క్రమేణా నగరాలు దాటి కుగ్రామాలకు సైతం పాకిపోతున్నది. గ్రామీణ జనజీవన స్రవంతిలో లీనమై భాసిల్లుతున్నది. మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే కూచిపూడి, భరతనాట్యం, జానపద కళలు, పాశ్చాత్య నాగరికత వెల్లువ ఆధునిక ముసుగులో కనుమరుగైపోతున్నాయి. అనేక మతాలు, కులాల, అంతరాల దొంతర్లపై నిర్మితమైన మన కళాసంస్కృతిని భవిష్యత్‌లో కాపాడుకోలేమేమోననిపిస్తున్నది. గతంలో జాతరులు, తిరునాళ్లలో జరిగినా ఆయా ప్రాంతాలకు, ఆచారవ్యవహారాలకు అద్దంపట్టే జానపదకళలు, పురాణాలకు చెందిన హరికథలు, బుర్రకథలు, ఒగ్గుకథలు, నాటకాలు, పగటివేషాలతో ఎంతో ఆహ్లాదకరంగా ప్రదర్శించేవారు. పండుగ దినాల్లో ఇలాంటి కళలతో

## ఒక్క మాట

పాటు కోలాటాలు, భజనలు చేస్తుండేవారు. ప్రతికళారూపం మన సంస్కృతికి అద్దంపట్టడమే కాక, ధర్మాధర్మ వివేచన ఆలోచనల్లో ఉజ్జీవనం పెంపొందించేందుకు ఉపయుక్తంగా ఉండేవి. మనం వేసే ప్రతి అడుగులోనూ మన సంస్కృతి, నాగరికతల విశిష్టిత పరిమళాలు, గుబాళిస్తుండేవి. వేషభాషల్లోనూ సభ్యతాసంస్కారం తొణికిసలాడుతుండేవి. దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది, శ్రీరామనవమి లాంటి ఏపండుగలు తీసుకున్నా వాటికి ఒక విశిష్టత ఉండేది. ఇప్పుడు ఆ పండుగల జాబితాలో 'జనవరి ఫస్ట్' కూడా చేరిపోయింది. దాంతోపాటు కళారూపాల స్థానంలో డిస్కో, రికార్డుడాన్సులు ప్రత్యక్షమయ్యాయి. డిజెలు గ్రామగ్రామానికి చేరుకున్నాయి. వేలాది మంది ప్రజల ముందు అంగాంగ ప్రదర్శనలు చేస్తున్నారు. మద్యం మత్తు, సెక్స్ కేంద్రాలుగా గ్రామసీమలు మారిపోతున్నాయి. కొందరు బాధ్యత కల్గిన ప్రజాప్రతినిధులు ఈ రికార్డు డాన్సుల్లో పాల్గొంటున్నారు. అదే మన సంస్కృతి అన్నట్టుగా వ్యవరిస్తున్నారు. ఇక మద్యం గూర్చి ఎంత తక్కువ చర్చిస్తే అంతమంచిదేమో. మద్యం సేవించండి ప్రభుత్వానికి ఆదాయం పెంచండి అంటూ పాలకులే మద్యపానాన్ని ప్రోత్సహించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఏ సందర్భంలోనైనా పండుగ, పబ్బాలకే కాదు చావులాంటి విషాద సందర్భాల్లో కూడా మద్యం వాడకం విపరీతంగా పెరిగిపోతున్నది. ఒక్క తెలంగాణలోనే మొన్న డిసెంబరు నెలలో రికార్డుస్థాయిలో ఐదువేల కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరిగాయి. జనవరి ఫస్ట్‌న హైద రాబాద్ నగరంలో మూడువందల పద్నాలుగు కోట్లకు పైగా మద్యం అమ్ముడుపోయింది. దీనికితోడు డ్రగ్స్ కూడా పెద్ద ఎత్తున దేశవ్యాప్తంగా వినియోగం అవుతున్నది. దేశవ్యాప్తంగా జనవరి ఫస్ట్‌న కనీసం ఏడెనిమిది వేలకోట్ల రూపాయల విలువైన మాదక ద్రవ్యాలు అమ్మకాలు జరిగి ఉండవచ్చు నని అనధికార అంచనా. అయితే ఈ మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ గతంలో ప్రమాదాలు జరిగి ఎందరో యువకులు ప్రాణాలు కోల్పోయారు. కానీ ఈసారి అలాంటి వాటికి అవకాశాలు లేకుండా తెలంగాణ పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకున్నారని చెప్పొచ్చు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో భారీఎత్తునే పట్టుబడారు. మూడు కమిషనరేట్ పరిధి. లో రెండువేల ఏడువందల ముప్పైఒక కేసులు నమోదు అయ్యాయి. మరొకచోట జనవరి ఫస్ట్ పండుగ చేసుకొంటూ మద్యం సేవించి, బిర్యాని తిన్న వారిలో పదమూడు మంది అస్వస్థతకు గురికాగా, ఒకరు మరణించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లా అంతర్వేది వద్ద అర్ధరాత్రి నేరుగా జీపునే సముద్రంలోకి నడిపి ఒక యువకుడు ప్రాణాలు పోగొట్టుకొన్నాడు. మన సంస్కృతిని కాపాడేందుకు ప్రభుత్వపరంగా కూడా పెద్దఎత్తున చర్యలు తీసుకున్నట్లు కనపడడం లేదు. ఈ విషసంస్కృతి గతంలో మగవారికే పరిమితమై ఉండేది. కానీ అది క్రమేణా యువ తులు కూడా అందులో భాగస్వామ్యం కావడం ఆందోళన కలిగించే అంశం. మధ్యతరగతికి చెందిన యువతీ యువ కులు ఏదో విధంగా ఈ క్లబ్బులో ప్రవేశానికి ఆరాటపడుతున్నారు. ఇది ఒక స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. కొందరు యువతీయువకులు కేవలం తమ విలాస జీవితాల కోసం డ్రగ్స్ సరఫరాతోపాటు దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇటీవల డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ తాను చేసిన అప్పులు తీర్చేందుకు ఈ డ్రగ్స్ రవాణా చేస్తున్నట్లు పోలీసుల ముందు అంగీకరించాడు. మరొకపక్క మిగిలిన నేరాలు తగ్గుతున్నా ఈ విషసంస్కృతి కారణంగా లైంగిక నేరాలు పెరిగిపోతున్నాయి. మన సంస్కృతీ, సంప్రదాయాలు తెలిపే పురాణ కాలక్షేపాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అతికొద్ది ప్రాంతాలకు మాత్రమే పరిమితమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా తయారవుతున్నది. మఠాధిపతులు చేసే ఆసక్తికరమైన ఆధ్యాత్మిక ప్రసంగాలు, ఇతిహాస పురాణ గాథలు, నిరుపేద, మధ్యతరగతి, గ్రామీణులకు అందాల్సిన అవసరం ఉంది. సమాజంలో విపరీత ధోరణులు చూపుతున్న ఈ విషసంస్కృతిని రూపుమాపేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం నడుం కట్టాలి. మమ్మీ, డాడీ చదువులు ఉంటే ఉండనివ్వండి కానీ వాటితోపాటు మన సంస్కృతీ సంప్రదాయాలు తెలిపే పాఠ్యాంశాలను కూడా ప్రాథమికస్థాయి నుంచి పిల్లలు తెలుసుకునే విధంగా విద్యావిధానం రూపొందించాలి. అలాగే ఈ క్లబ్‌లు, పబ్‌లు, సైబర్ కేఫ్‌లలో నీలిచిత్రాలు, అంగాంగ ప్రదర్శనలపై ఉక్కుపాదం మోపాలి. శుభాకాంక్షలన్నీ శుభప్రదంగా ఉండాలి. ఈ విషయంలో ప్రభుత్వంతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు కల్పించుకోవాలి. మన సంస్కృతి సంప్రదాయాలను రక్షించేందుకు సంసిద్ధులుకావాలి. ప్రజల భాగస్వామ్యమే మన సంస్కృతి పరిరక్షణకు ఏకైక మార్గం. ●

# భారత్ స్నేహాన్ని వదులుకోలేని బంగ్లాదేశ్

కనుమ ఎల్లారెడ్డి

బంగ్లాదేశ్ రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. బంగ్లా మాజీ ప్రధాని ఖలీదా మరణంతో, ఇప్పుడుప్రజలలో ఆమె పార్టీ బంగ్లా నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) వైపు ప్రజలు చూస్తున్నారు. బంగ్లాకు దిక్కు ఆ పార్టీయే కనపడుతోంది. ఖలీదా కుమారుడు పదిహేడేళ్ల ప్రవాసం తరువాత స్వదేశానికి వచ్చారు. దురదృష్టం ఆయన బంగ్లాకు వచ్చిన కొద్ది రోజులలోనే తల్లి మరణించడం తీరనిలోటు. ఆమె మరణం బంగ్లా ప్రజలకు కూడా గట్టి దెబ్బే. ఫిబ్రవరిలో జరిగే ఎన్నికలలో అవామీ లీగ్ అధినేత హసీనా పార్టీ పోటీ చేయకుండా నిషేధానికి గురి అయింది. ఇప్పుడు ప్రజలలో ఒక బలమైన నాయకుడిగా తారీక్ కనపడుతున్నాడు. ఆయన మాటలలోనే స్పష్టంగా బంగ్లా అందరిది అని, బంగ్లాలో నివసిస్తున్న హిందువులు, ముస్లిమ్స్, క్రిస్టియన్స్, బౌద్ధులు ఒకటే అని తన ప్రసంగంలో చెప్పడం విశ్వంలోని ప్రజల దృష్టిని ఆకర్షించారు. భారత్, బంగ్లాదేశ్‌ల మధ్య కొన్ని పొరపొచ్చాలు ఉన్నా, భారత్ స్నేహాన్ని వదులుకోలేదు. ఒకవేళ తారీక్ ఎన్నికలలో నెగ్గితే ప్రధాని కావడం ఖాయం. ఆయన హయాంలోనైనా రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగు అవుతాయని విశ్లేషకుల అభిప్రాయం. భారత్‌నుంచి అత్యధికంగా లాభపడిన బంగ్లాదేశ్ వైఖరిలో మార్పు రావొచ్చు. అయితే అక్కడ హిందువులపై దాడి చేయడం హేయం. ఇటీవల బజేంద్ర బిశ్వన్ హత్యకు గురి కావడం సహించరానిది. ఇది తారీక్‌ను కలచి వేసి ఉండవచ్చు. అందుకే తన ప్రసంగంలో బంగ్లా సమైక్యత కోరుకుంటుంది అని చెప్పడం గమనార్హం. బీ.ఎన్.పి పార్టీ రెండు పర్యాయాలు మాత్రమే గద్దె నెక్కింది. అప్పుడు ఖలీదా ప్రధానిగా బాధ్యతలు చేపట్టి భారత్‌తో కొంత ఘర్షణాత్మక వైఖరి అవలంభించారు. హసీనా కూడా భారత్‌తో సయోధ్య ఉన్న నదీ జలాల వివాదంతో ఇద్దరు చేయి కలిపారు. భారత్ నుంచి ప్రవహిస్తున్న గంగానది అక్కడ పద్మానది అని పిలుస్తారు. నదీ జలాలు వినియోగంలో ఎక్కువ భాగం భారత్ పంచుకుంటుందని బంగ్లా ఆరోపణ. ఈ నదీ జలాల వివాదం బంగ్లాను పాలించిన జియా ఉర్ రెహమాన్ (ఖలీదా భర్త) కలం నుంచి ఉంది. ఆది నుంచి భారత్‌కు వ్యతిరేకంగా జమాతే ఇస్లామి పాక్‌కు అనుకూలంగా వ్యవహరించింది. తన తల్లి, తండ్రి భారత్‌కు వ్యతిరేకం అయినా తారీక్ మాత్రం ఆ బాటలో పయనించడం లేదు. భారత్‌తో ఏ సమస్య అయినా చర్చలద్వారా పరిష్కరించు కుంటామని ఆయన మాటలలో ధ్వనించింది. ఎన్నికలలో ఆయన ప్రత్యర్థులు ఎవరూ బలంగా కనపడటం లేదు. హసీనా పోటీలో ఉండి ఉంటే ఒకింత పోటీ ఉండేది. కాని హసీనా పార్టీలో అవినీతి పెరిగిపోవడం, హసీనా తీసుకున్న నిర్ణయాలు బంగ్లా ప్రజలలో తీవ్ర అసంతృప్తి కలిగించింది. ఫలితంగా ఆమె భారత్‌లో తల దాచుకుని బంగ్లా రాజకీయాలను గమనిస్తోంది. ఏతావాతా ఇప్పుడు బంగ్లా రాజకీయాలలో తారీక్ ఒక ధ్రువతారగా కనపడుతున్నారు. ఏది ఏమైనా నూతన సంవత్సరం బంగ్లాదేశ్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటులో, భారత్‌తో సంబంధాలు ఏ మేరకు వుంటాయో తేలిపోతుంది. మొత్తానికి తారీక్ అధికారంలోకి వస్తే మాత్రం లౌకికత్వం బలంగా ఉంటుంది. అదే ఆయన పార్టీకి, ఆయనకు శ్రీరామ రక్ష. ●



## ప్రజావాక్కు



### నైతిక బాధ్యత

ప్రజాస్వామ్య సమాజంలోప్రజాదరణ ఒకవరమే కాకుండా గొప్ప సామాజిక బాధ్యత కూడా. ముఖ్యంగా సినిమా రంగంలోని అగ్రనటులకు ప్రజలను ప్రభావితం చేసే అపార శక్తి ఉంటుంది. వారి ఒక హాజరు కోసం వేలాది మంది ప్రాణాలకుతెగించి తరలివస్తారు. అయితే సరైన ప్రణాళిక, క్రమశిక్షణ, నియంత్రణ లేకపోతే ఈప్రజాదరణ వినోదాన్ని విషాదంగా మారుస్తుంది. హైదరాబాద్‌లోని సంధ్యా థియేటర్‌వద్ద పుష్ప-2ప్రీమియర్ సందర్భంగా జరిగిన తొక్కిసలాటదీనికి తాజానిదర్శనం. థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం, నిర్వాహకుల అంచనాల లోపం, భద్రతా సిబ్బంది అప్రమత్తతం, పోలీసు సమన్వయం లేకపోవడం కలిసి ప్రాణనష్టానికి కారణమయ్యాయి. భారీ సినిమా విడుదల సమయంలోజనసందోహాన్నినియంత్రించేభద్రతా ఏర్పాట్లు తప్పనిసరి అయినప్పటికీ అవి పాటించబడలేదు. వేలాది మందిని ఆకర్షించే వ్యక్తిగా, జనసందోహం అదుపు తప్పే పరిస్థితుల్లో అప్రమత్తం చేయడం ఒక నైతిక బాధ్యత.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### మనిషిలో మార్పు రావాలి

జనవరి1వ తేదీ అనేది కేవలం క్యాలెండర్‌లోని తేదీ మార్పు మాత్రమేకాదు. అదికాలానికి మనిషి ఇచ్చేఒక శుభావందనం. ఆధునిక సమాజంలో ఈ తాత్వికత వక్రీకృతమైపోతోంది. ప్రతి మతంలోనూ దేవుడు, మనిషి మధ్య ఒక మధ్యవర్తి పూజారి, పాస్టర్ లేదా పండితుడు నిలబడి మతాన్ని వ్యాపారంగా మార్చేశాడు. భక్తిని లావాదేవీగా, ఆధ్యాత్మికతను ప్రదర్శనగా మార్చేశాడు. ఫలితంగా మనిషి తనలోని దైవత్వాన్ని మరచిపోయాడు. నిజమైన నూతన సంవత్సరం అంటే పటాకులులేదా ఉత్సవాలుకాదు మెలుకువ. మనిషి అర్థం చేసుకుంటూ, పంచుకుంటూ, ఎదుగుతూ ఉంటే అదే కాలానికి నిజమైన వేడుక.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### చర్యలు తీసుకోవాలి

చాలాస్కూళ్లలో విద్యార్థులు లేకపోయినా, తక్కువ సంఖ్యలో ఉన్నా , ఉపాధ్యాయులు మాత్రం అధిక సంఖ్యలో పనిచేస్తున్నారని, కేంద్రవిద్యాశాఖ ఇటీవల పార్లమెంటుకు సమర్పించిన ఓ నివేదికలో పేర్కొంది. వెంటనే ప్రభుత్వం సరిగ్గా సర్దుబాటు చేయాలి. విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలి .

-మా. శ్రీ. రాజు, పాల్వంచ

### వృద్ధికి రహదారి

దేశఆర్థికాభివృద్ధికి మౌలికసదుపాయాలే మూలస్తంభమని మరోసారి ప్రధానమంత్రి నరేంద్రమోడీ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. వృద్ధికి దోహదపడే తదుపరి తరం మౌలిక సదుపాయాల నిర్మాణం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు దేశవ్యాప్తంగా అభివృద్ధికి బాటలువేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రానికి ఈ విధానాల ద్వారా కలిగే ప్రయోజనాలను గమనించడం అవసరం. తెలంగాణరాష్ట్రం భౌగోళికంగా దేశమధ్యభాగంలో ఉండటంవల్ల రహదారి, రైల్వే, లాజిస్టిక్స్ రంగాల్లో కీలక స్థానం దక్కించుకునే అవకాశం ఉంది. ఇప్పటికే హైదరాబాద్ఒక అంతర్జాతీయ ఐటీ, ఫార్మాకేంద్రంగా ఎదిగింది. అయితే ఈ వృద్ధి ఫలాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చేరాలంటే సమర్థవంతమైన రహదారి అనుసంధానం అత్యవసరం. జాతీయ రహదారుల విస్తరణ, కొత్త కారిడార్‌ల నిర్మాణం తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలను ప్రధాన మార్కెట్లతో కలుపుతాయి. ప్రత్యేకించి ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఈ మౌలిక సదుపాయాల అభివృద్ధి ఎంతో దోహదపడుతుంది.

-తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### పాలకుల వైఫల్యం

తెలంగాణ ఉద్యమంలో ఒక ప్రధాన అంశంగా ఉన్న విషయం మనందరికీ తెలుసు. 300 కిలోమీటర్ల మేర కృష్ణానది ఆ జిల్లాలో పారినపాలమూరు కరువు చాలా హృదయ విదారకమైనది. పిల్లలను అమ్ముకునేంత కరవు ఆ జిల్లాలో ఉండేది. అయితే కృష్ణానది మీద వేసిన వివిధ కమిషన్లు అలాగే వాళ్ళు ఇచ్చిన ఆర్డర్లు అమలు చేయడంలో వచ్చిన ఇబ్బందితోనే పాలమూరు వలసల జిల్లాగా మారింది అనడంలో సందేహం లేదు. ముఖ్యమంత్రులు దత్తత తీసుకున్న ఇసుమంత అయిన వారి కరవు పోలేదు సరికదా ఇప్పుడు కృష్ణానది నీళ్ల విషయం ఒక రాజకీయ అస్త్రంగా మారింది.

-భారత అవినాష్, జనగామ

### గురుకులాల్లో ఆర్ట్స్ గ్రూప్స్

రాష్ట్రంలో ఉన్న గురుకులాలలో సైన్సు గ్రూపులతోపాటుగా ఆర్ట్స్ గ్రూపులు కూడా పెట్టాలి. 2026-2027 విద్యా సంవత్సరం నుండి ఆర్ట్స్ గ్రూపులో ప్రవేశపెట్టడానికి గాను గురుకుల ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ కార్యదర్శులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి ఆర్ట్స్ గ్రూపులో అయినా సామాజిక శాస్త్రాలను ప్రవేశపెట్టాలి..

-రాపాక రవీందర్, జనగాం

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గ్రామసభల బాధ్యతలు పెరగాలి

మేకిరి దామోదర్

తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలలో గ్రామపంచాయతీ ఎన్నికలు ముగిసి, నూతన పాలకవర్గాలు బాధ్యతలు స్వీకరించాయి. పల్లె భవిష్యత్తు తమ చేతుల్లో ఉందనే ఆశతో గ్రామవాసులు వీరిని ఆశగా చూస్తున్నారు. గత రెండేళ్లుగా పాలకవర్గాలు లేక, ప్రత్యేక పాలనలో అభివృద్ధి కుంటుపడి గ్రామాలు కునారిల్లిన పరిస్థితిఅందరికీ తెలిసిందే. రహదారులు, పారిశుద్ధం, మౌలిక సదుపాయాలు నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఇలాంటి నేపథ్యంలో, కొత్తగా ఎన్నికైన సర్పంచులు-పాలకవర్గ సభ్యులు గ్రామాభివృద్ధి బాట పట్టిస్తారనే విశ్వాసం ప్రజల్లో నెలకొంది. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 ఆధారంగా, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ రూపొందించిన కరదీపిక సర్పంచులు, ఉపసర్పంచులు, పౌరుల విధులు- బాధ్యతలను స్పష్టంగా గుర్తుచేస్తోంది. ఈ కరదీపికను అధికారులు ప్రజాప్రతినిధులకు అందజేసి, చైతన్యపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సర్పంచి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామంలోనే నివసించాలి. అప్పుడే గ్రామపంచాయతీ కార్యకలాపాలు సమర్థంగా పర్యవేక్షించగలుగుతాడు. గ్రామపంచాయతీ తీర్మానాలకు లోబడి విధులు నిర్వహించాలి. గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించి, వాటికి అనుగుణంగా పనులు అమలు చేయాలి. నిర్దేశిత కాలవ్యవధిలో గ్రామసభలు నిర్వహించడం, పారిశుద్ధం సక్రమంగా ఉండేలా చూడటం, పంచాయతీ కార్యదర్శి విధులను పర్యవేక్షించడం సర్పంచి ముఖ్య బాధ్యతలు. ప్రభుత్వం నిర్దేశించిన పరిమితిలో సంచిత కాంటిజెన్సీ నిధుల నుంచి ఖర్చులకు అనుమతులు ఇవ్వాలి. ప్రతి ఏటా నాటిన మొక్కల్లో కనీసం 85 శాతం జీవించి ఉండేలా చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగం, ప్రభుత్వ ఆదేశాల ఉల్లంఘన, గ్రామసభలు నిర్వహించకపోవడం, ఖాతాల ఆడిట్ చేయించడంలోవిఫలం కావడం, అసమర్థతతో గ్రామాభివృద్ధిని అడ్డుకోవడం వంటి సందర్భాల్లో సర్పంచిని తొలగించే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుంది. తొలగించే ముందు నోటీసు ఇవ్వబడుతుంది. తొలగింపునకు గురైన సర్పంచి ఆరేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హుడు. నెలరోజుల్లో గ్రామపంచాయతీ ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. గ్రామ పంచాయతీ విధులు సర్పంచి 15 రోజులకుపైగా గ్రామపంచాయతీ పరిధి దాటి వెళ్లినప్పుడు లేదా సస్పెన్షన్‌లో ఉన్నప్పుడు, ఉపసర్పంచ్ బాధ్యతలు నిర్వర్తిస్తారు. సర్పంచ్‌పదవి ఖాళీ అయినప్పుడు, మళ్లీ ఎన్నికలు జరిగే వరకు తాత్కాలిక సర్పంచిగా వ్యవహరిస్తారు. పంచాయతీ నిధుల వినియోగానికి సంబంధించిన చెక్కులపై సర్పంచితో కలిసి ఉపసర్పంచ్ ఉమ్మడిగా సంతకం చేస్తారు. వార్డు సభ్యులకు



పంచాయతీ సమావేశాల్లో తీర్మానాలు ప్రవేశపెట్టే అధికారం ఉంది. పంచాయతీ రికార్డులను పరిశీలించే హక్కు వారికి ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే లేదా హోదాను దుర్వినియోగం చేస్తే, కలెక్టర్ వార్డు సభ్యులను ఆరు నెలలపాటు సస్పెండ్ చేయవచ్చు. అవసరమైతే కమిషనర్ మరో ఆరు నెలలు పొడిగించవచ్చు. సర్పంచ్, ఉపసర్పంచ్ఇద్దరూ 15 రోజులకుపైగా అందుబాటులో లేని పరిస్థితుల్లో, ఒక వార్డు సభ్యుడికి సర్పంచి అధికారాలను జిల్లా కలెక్టర్ అప్పగించవచ్చు. పంచాయతీ కార్యదర్శులు గ్రామసభల నిర్వహణ, పారిశుద్ధం, మొక్కల పెంపకం, రికార్డుల నిర్వహణ, ఖాతాల నిర్వహణ, తీర్మానాల అమలు వంటి బాధ్యతలు నిర్వర్తించాలి. చట్టంలోని సెక్షన్ 52(1) ప్రకారం, 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువలు, చెత్త నిర్వహణ, ప్రతి ఇంటి ప్రాంగణంలో కనీసం ఆరు మొక్కల నాటడం, వీధిదీపాల నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపు, ఆస్తిపన్నుల వసూలు, జనన-మరణ-వివాహాల నమోదు వంటి విధులు పంచాయతీల ప్రధాన బాధ్యతలు. గ్రామ లేఅవుట్లు, నిర్మాణ అనుమతులు, సామూహిక మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, పునరుత్పాదక ఇంధన వ్యవస్థలు, వ్యాధుల నివారణ, బాల్యవివాహాలు, వరకట్నం వంటి సామాజిక దురాచారాల నివారణ, వృద్ధులు, దివ్యాంగులు, అనాథల సంక్షేమం కూడా పంచాయతీల పరిధిలోనే ఉన్నాయి. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వయోవృద్ధులు, దాతలు, గ్రామ సంఘాల అధ్యక్షు లు కోఆప్షన్ సభ్యులుగా ఉండవచ్చు. గ్రామసభలు స్థాయి సంఘాలు గ్రామంలో ఓటుహక్కు గల ప్రతిఒక్కరూ గ్రామ సభ సభ్యులే. రెండు నెలలకు ఒకసారి చొప్పున ఏడాదిలో ఆరుసార్లు గ్రామసభలు నిర్వహించాలి. వార్షిక ఆడిట్ నివేదికలు, గ్రామ నిర్వహణ నివేదికలు గ్రామసభకు సమర్పిం చాలి. గ్రామపంచాయతీలో నాలుగు స్థాయి సంఘాలు (స్టాండింగ్ కమిటీలు) ఉంటాయి. పారిశుద్ధం, వీధిదీపాలు, మొక్కల పెంపకం తదితర అంశాలను ఇవి సమీక్షిస్తాయి. అవసరమైతే ఆయా రంగాల నిపుణులను సభ్యులుగా చేర్చుకోవచ్చు. ఆశల్ని అభివృద్ధిగా మలచే పరీక్ష రెండేళ్లుగా పాలకవర్గాలు లేకపోవడం వల్ల గ్రామపంచాయతీ పాలనలో జవాబుదారీతనం కొరవడింది. అభివృద్ధికుంటుపడి, గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రత్యేక అధికారులు ప్రజాసమ స్యలను పట్టించుకోని పరిస్థితి కూడా ఎదురైంది. ఇలాంటి పరిస్థితుల నుంచి గ్రామాలను బయటకు తీసుకురావడం నూతన సర్పంచు లు-పాలకవర్గ సభ్యుల ముందున్న అసలైన సవాల్. శత కోటి ఆశలతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవ డం వారి ప్రధాన బాధ్యత. పరిపాలనా సామర్థ్యాన్ని, ప్రజాప్రతినిధుల ఐక్యతను చూపుతూ పల్లెల అభివృద్ధిని గాడిలో పెట్టగలిగితేనే సర్పంచి పదవికి అర్థం ఉంటుంది. ప్రతి పల్లె ప్రగతి పథంలో పయనించేలా నిజాయితీతో, పారదర్శకతతో, ప్రజాస్వామ్య విలువలతో పాలన అందించిన ప్పుడే గ్రామపంచాయతీలు ఆదర్శంగా నిలుస్తాయి. అదే నిజమైన ప్రజాసేవ, అదే సర్పంచుల విజయానికి కొలమానం. ●

# రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన

## మంత్రి అనగాని సత్యప్రసాద్

నిజాంపట్నం, జనవరి 2, ప్రభాతవార్త: రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని రాష్ట్ర రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్‌ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని బొర్రావారి పాలెంలో రూ.40లక్షలు ఎంజిఎన్ఆర్ఇజిఎస్



నిధులతో నిర్మించనున్న సిసి రోడ్ నిర్మాణానికి ఆయన శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులు అభివృద్ధి చేస్తే ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్ళేందుకు ప్రజలకు సౌకర్యంగా ఉండి సత్వర అభివృద్ధి జరుగుతుందన్నారు. రాష్ట్రంలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నా గత పాలకులు పట్టించుకోలదన్నారు. ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి ప్రజలు వెళ్ళాలంటే భయపడే పరిస్థితిలో గత ప్రభుత్వ హయాంలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. పేద బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. జలజీవన్‌మిషన్ ద్వారా రూ.13లక్షలతో మంచినీటి పథకం, రూ12లక్షలు మండల పరిషత్ నిధులతో సైడ్ డ్రెయిన్ నిర్మాణానికి ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి సభ్యుడు నర్రా సుబ్బయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ ఓగిబోయిన వెంకట్, పిఎసిఎస్ అధ్యక్షులు డివిఆర్, మైలా నరేష్, అగ్నికుల క్షత్రియ కార్పోరేషన్ డైరెక్టర్, బొమ్మిడి రామకృష్ణ, సర్పంచ్, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాదర్బార్‌లో అర్జీలను స్వీకరించిన ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి మున్సిపాలిటీ జనవరి2(ప్రభాతవార్త): పట్టణంలోని రామలింగేశ్వరపేటలో గల తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో, శుక్రవారం శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రజా దర్బార్ (గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్సీ ఆలపాటికి అర్జీలు అందించారు. ఈ సందర్భంగా పట్టణం మరియు రూరల్ గ్రామాల నుండి అలాగే కొల్లిపర మండలం



నుండి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని తమ సమస్యలను ఆలపాటికి వివరించారు. వచ్చిన అర్జీలను సంబంధిత శాఖలకు పంపి సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఆలపాటి ప్రజలకు భరోసా కల్పించారు. అనంతరం పట్టణంలోని వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి నూతన ఆంగ్ల సంవత్సరశుభాకాంక్షలు తెలుపుతూ, విద్యార్థిని విద్యార్థులు పోస్ట్ కార్డులు పంపించగా, వాటిని ఆసక్తిగా తిలకించి మంచి ఆలోచన చేశారు అంటూ విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మహమ్మద్ కుదూస్, ప్రధాన కార్యదర్శి వసంతం అశోక్ వర్ధన్, రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నాదుల మహేష్, పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్న క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలి


### నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్, జనవరి 2 ప్రభాతవార్త** : గుంటూరు కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్నా క్యాంటీన్లలో పరిశుభ్రత పాటించాలని, ఆహార సరఫరా అనంతరం క్యాంటీనంత శుభ్రం చేయించాలని నగర



కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం బస్టాండ్ సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఆయన అక్కడ ఆహారం తీసుకుంటున్న వారితో చర్చించి వారి అభిప్రాయాలను సేకరించారు. ఈ క్యాంటీన్లలో ఆహారం తీసుకునే వారి సంఖ్య రోజు రోజుకి పెరిగిపోతుందని, క్యాంటీన్లలో ప్లేసు చాలక బయట కాంపౌండ్ వాల్ కూర్చుని ఆహారం భుజిస్తున్నారని దీనిని దృష్టిలో పెట్టుకుని అన్నా క్యాంటీన్ల లోపల, పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. లైటింగ్, ఫ్యాన్లు ఏర్పాటు, ఏవైనా మరమ్మతులు ఉంటే తక్షణమే చేయించాలని సూచించారు. క్యాంటీన్లు ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక టీములు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్పష్టం చేశారు.

## విఆర్‌ఏతో కారు కడిగించిన డిప్యూటీ తహశీల్దార్



**కర్లపాలెం,జనవరి02,ప్రభాతవార్త:** తమ కింద పని చేసే చిన్న స్థాయి ఉద్యోగులతో వారి సొంత పనులు చేయించుకుంటున్న వైనం కర్లపాలెం రెవిన్యూ కార్యాలయంలో చోటుచేసుకుంది. శుక్రవారం కర్లపాలెం రెవెన్యూ కార్యాలయంలో ఉన్న కారును క్యావీఆర్ఏ గా పనిచేస్తున్న నరేందర్ రెడ్డి తో తుడిపించటం పై మండల ప్రజానీకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నరేందర్ రెడ్డి తాత పెదపులుగువారి పాలెం వీఆర్ఏగా పనిచేస్తున్నారు. ఆయన వృద్ధాప్యంలో ఉండటంతో ఆ విధులను తన మనవడు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రెవెన్యూ అధికారుల కారును నరేందర్ రెడ్డితో తుడిపించే వీడియో స్థానికంగా వైరల్ కావడంతో మండల ప్రజానీకం ప్రశ్నించడం మొదలుపెట్టారు. అంతేకాకుండా చిన్న స్థాయి ఉద్యోగులను పై అధికారులు ఈ విధంగా వేధిస్తున్నారు అనటానికి ఇదే నిదర్శనమని మండలంలోని విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఇలాంటి పనులు చేసే వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మరల ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని మండల ప్రజానీకం కోరుతున్నారు.

## నైపుణ్యాలతోనే ఉద్యోగాలు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,జనవరి2, ప్రభాతవార్త: విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు నేర్చుకుంటే మంచి ఉద్యోగాలు వస్తాయని విజయ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సిఇఓ విజయ్ భార్గవ అన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాల సిఎస్ఇ, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, ఏఐఎంఎల్, ఇసిఇ విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ శుక్రవారం నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో 150మంది పాల్గొనగా ఇందులో క్వాలిఫై అయిన విద్యార్థులకు శనివారం టెక్నికల్ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు వర్సిటీ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ యం.డి తౌసిఫ్ అహ్మద్‌తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్.లింగరాజు, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ యం.గోపీకృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళిలు విజయ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ హెచ్‌ఆర్ మేనేజర్ తేజస్విని, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.



# గుంటూరు వార్త



## పట్టాదారు పుస్తకాలు పంపిణీ


### జనవరి 2 వ తేది నుండి 9 వరకు గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించి పంపిణీ

**గుంటూరు వెస్ట్ , జనవరి 2, ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా భూ రికార్డులను డిజిటలైజ్ చేసి, కేంద్ర ప్రభుత్వ రిపాజిటరీలో భద్రపరచే విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పట్టా పాస్‌బుక్స్ అనేది దశాబ్దాలుగా కొనసాగుతున్న కార్యక్రమమని, ఈ కార్యక్రమం నిర్వహించడానికి ప్రధాన కారణం భూ రికార్డుల వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణలేనని తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఎస్.ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో ఆంధ్ర ప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ క్రింద జరిగిన పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్ , ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు , సర్వే సెటిల్ మెంట్ అండ్ ల్యాండ్ రెవెన్యు డైరెక్టర్ కూర్మనాధం , జియంసీ మేయర్ కోవెలమూడి రవీంద్ర బాబు, కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మక్కేన మల్లిఖార్జున రావు, హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాష , సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ లతో కలసి పాల్గొన్నారు. గతంలో వ్యక్తుల బొమ్మల కోసం పట్టాదారు పాస్‌బుక్స్ మార్పిడిపై వందల కోట్ల ప్రజాధనం ఖర్చు చేశారని, అదే నిధులతో అభివృద్ధి పనులు చేయవచ్చని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు "వ్యక్తులు శాశ్వతం కాదు - రైతులు, భూమి శాశ్వతం" అనే ఆలోచనతో రైతుల మనశ్శాంతి కోసం పట్టా పాస్‌బుక్స్‌ను మళ్లీ అందిస్తున్నారని తెలిపారు. ల్యాండ్ రికార్డ్స్ శాఖ తన పరిధిలో ఉండటంతో, భూమి సర్వే-రీసర్వే ప్రక్రియలో ఆధునిక సాంకేతికతను విస్తృతంగా ఉపయోగిస్తున్నామని చెప్పారు. డ్రోన్లు, రోవర్స్ ద్వారా అత్యంత కచ్చితంగా భూ హద్దులు నిర్ణయించి, రెండు నుంచి మూడు సెంటీమీటర్ల లోపే కొలతలు నమోదు చేస్తున్నామని వివరించారు. ఈ సంస్కరణల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇన్సెంటివ్ ప్రోగ్రామ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచి, ఇప్పటివరకు రూ.490 కోట్ల ఇన్సెంటివ్స్ పొందిందని చెప్పారు. పట్టణాల్లో పైలట్ ప్రోగ్రామ్‌గా భూ సర్వేలు జరుగుతున్నాయని, గుంటూరు, మంగళగిరి నగరాలు ఇందులో భాగమని, దీని ద్వారా రాష్ట్రానికి మరిన్ని వందల కోట్ల నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు.









ప్రస్తుతం ల్యాండ్ రికార్డ్స్ కు సంబంధించిన ఫిర్యాదులు అత్యధికంగా ఉన్నాయని, అన్నదమ్ముల మధ్య, పొరుగువారితో వివాదాలు శాశ్వతంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గుంటూరు జిల్లాలో ఇప్పటికే 30 గ్రామాల్లో ఈ కార్యక్రమం పూర్తయిందని, మిగిలిన గ్రామాల్లో కూడా మూడు నుంచి నాలుగు నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. రైతులకు మనశ్శాంతి, భూమిపై పూర్తి భరోసా కల్పించడమే ఈ సంస్కరణల ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రత్తిపాడు శాసన సభ్యులు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ గుంటూరు జిల్లా అభివృద్దే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్న మంత్రి డా. పెమ్మసాని చంద్ర శేఖర్ చేతుల మీదుగా రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు అందించడం సంతోషంగా వుందన్నారు. పూర్వీకుల నుండి అందిన భూములపై గత ప్రభుత్వం ముఖ్యమంత్రి ఫోటోను ముద్రించి పట్టాదారు పాసు పుస్తకాలను అందించడంపై రైతులు ఆందోళన చెందారన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి గత ప్రభుత్వం రైతులను భయాందోళనలకు గురిచేసిందని , 2024 ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు కూటమి ప్రభుత్వం రైతులకు రాజ ముద్ర తో పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేస్తున్నదని తెలిపారు.

సర్వే సెటిల్ మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్ మాట్లాడుతూ రీ సర్వేకి సంబంధించి జరిగిన తప్పిదాలను గుర్తించి రీ సర్వే ద్వారా నిజమైన హక్కుదారుకు వారి పేరున పట్టాదారు పాసు పుస్తకాలను అందించడం జరుగుతుందన్నారు. ఏపి లోని 16, 800 గ్రామాలు వుంటే వాటిలో 6,700 గ్రామాల్లో రీ సర్వే చేయడం జరిగిందన్నారు. ఈ 6,700 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించగా 7.50 లక్షలు అర్జీలు వచ్చాయన్నారు. వాటిని గుర్తించి పాసు పుస్తకాలు జారీ చేయడం జరిగిందన్నారు. జనవరి 2 నుండి జిల్లాలోని 35 గ్రామాల్లో రీ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. జియంసీ మేయర్ కోవెలమూడి రవీంద్ర బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టిన నేపధ్యంలో భూములు కూడా తనఖా పెడుతుందేమో ననే భయంతో రైతులు ఉండేవారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల రీ సర్వే నిర్వహించి రాజ ముద్రతో కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను అందిస్తున్నారన్నారు. సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ మాట్లాడుతూ దేశంలో ఆంధ్ర ప్రదేశ్ ఒక రోల్ మోడల్ గా రీ సర్వే ప్రాజెక్ట్ ను తీసుకువచ్చిందని , సైంటిఫిక్ గా డ్రోన్ , రూటర్లతో రీ సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి , ఆర్థిక శాఖ మంత్రి , జిల్లా కలెక్టర్ , ఆర్ డి ఓ లు గ్రామ సభలు నిర్వహించి గత ప్రభుత్వం చేసిన అవకతవకలను సరి చేసి జిల్లాలో 35690 పాసు పుస్తకాలను జనవరి 2 నుండి 9 వరకు గ్రామ సభలు నిర్వహించి రైతులకు అందించడం జరుగుతుంద న్నారు. ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ ఎస్ లో భూ సమస్యలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నందున రెవెన్యు క్లినిక్స్ ఏర్పాటు చేసి భూ సమస్యలను సత్వరమే పరిష్కరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డి ఆర్ ఓ ఎం ఎస్ కే ఖాజావలి , ఆర్ డి ఓ శ్రీనివాస రావు, మండల తహశీల్దార్లు , సర్వేయర్లు , విఆర్‌ఓలు , రైతులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం చర్యలు

### మంత్రి అనగాని

**రేపల్లె, జనవరి 2, ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.71 లక్షల 6,035 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రా ష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య ఖర్చుల విషయంలో ఎటువంటి ఇబ్బంది పడకుండా సకాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందేలా చూస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మానవీయ పాలనలో ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్నదని అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.

## పెద్దవడ్లపూడి గ్రామంలో ఎల్‌ఓసి చెక్కు పంపిణీ

**మంగళగిరి, జనవరి 2, ప్రభాతవార్త :** మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామంలో మంత్రి నారా లోకేష్ చొరవతో ఎల్ ఓ సి



చెక్కును టిడిపి నాయకులు అందజేశారు. పెదవడ్లపూడి గ్రామానికి చెందిన తాత సుధా పద్మశ్రీకి ఎల్‌ఓసి రూ1,75,000 వేల రూపాయల చెక్కును, టిడిపి నాయకులు అందజేశారు. ఎల్‌ఓసి చెక్కు అందుకున్న లబ్ధిదారులు మంత్రి స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ కి ధన్యవాదాలు తెలియజేశారు. చెక్కు అందజేసిన వారి లో మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, గ్రామ పార్టీ అధ్యక్షులు యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ బాబు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరావు, కనపాల సాగర్, కంచర్ల బద్రి, జాలాది సందీప్, తదితరులు పాల్గొన్నారు..

## బస్సులు ఢీకొని విద్యార్థులకు స్వల్ప గాయాలు


**అమరావతి: జనవరి 2 ప్రభాతవార్త :** మండల పరిధిలోని దిడుగు గ్రామ సమీపంలో రెండు ప్రైవేటు స్కూల్ బస్సులు ఢీకొని విద్యార్థులకు స్వల్ప గాయాలైన సంఘటన శుక్రవారం సాయంకాలం నెలకొంది. అధికారులు తూతూ మంత్రంగా ఫిట్నెస్ పరిశీలన చేసి విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని



తల్లిదండ్రులు ఆవేదన చెందారు. పెను ప్రమాదం తప్పిందని లేకుంటే కుంటలోకి దూసుకుపోయేదేనని స్థానిక ప్రజలు అన్నారు. అమరావతి ధరణికోటకు చెందిన ధాన్యకటక కాలేజీ బస్సు, చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ కు చెందిన బస్సు ఢీకొట్టుకోవడంతో ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. బ్రేక్ ఫెయిల్ అవ్వటమే ప్రమాదానికి గల కారణమని డ్రైవర్ తెలిపారు. ఫిట్నెస్ లేని ఓవర్ లోడ్ తో ప్రయాణం చేసే బస్సులపై ఆర్టీవో అధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని విద్యార్థి తల్లిదండ్రులు ఉన్నారు. ప్రైవేటు స్కూలు బస్సుల పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి డ్రైవర్ లైసెన్స్ లోను పరిశీలించి ఫిట్నెస్ వివరాలు తెలుసుకుని సీటింగు లోడింగ్ వివరాలు క్షుణ్ణంగా పరిశించాలని ప్రతి బస్సులో క్లీన్ అన్న కూడా ఏర్పాటు చేయాలని అధిక లోడులో పిల్లలను ఎక్కించకుండా చర్యలు తీసుకునేలా యంత్రాంగం పనిచేయాలని విద్యార్థి తల్లిదండ్రులు కోరారు.

## ప్రమాదవశాత్తు నదిలో పడి బాలుని గల్లంతు

**అమరావతి జనవరి2 ప్రభాతవార్త :** మండలం వైకుంఠపురానికి చెందిన దివ్యాంగుడు నండూరి దేవా (17)



నదిలో పడి గల్లంతయ్యాడు. శుక్రవారం తల్లితో పాటు బట్టలు శుభ్రం చేసుకునేందుకు పుష్కర్ ఘాట్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతైనట్లు బంధువులు తెలిపారు. గ్రామస్థులు గాలింపు చర్యలు చేపట్టినట్లు వివరించారు. రెవెన్యూ అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సంఘన్నా స్థలానికి ఎస్సై రాజశేఖర్ టీం తో చేరుకుని పర్యవేక్షించారు. మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి

**గుంటూరు విద్య జనవరి 2 ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం బాషా పెద కాకాని మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనిగండ్ల మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నంబూరు లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నంబూరులోని ఉన్నతపాఠశాలలో జరుగుతున్న ఒకటి



నుండి పది తరగ తుల విద్యార్థులను పరిశీలించారు ప్రతి తరగతిలో విద్యార్థుల నోటుబుక్స్, విద్యార్థుల సామర్థ్యాలు, మూడు,నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు జి ఎఫ్ ఎల్ ఎన్ పరిశీలించారు పదవ తరగతి విద్యార్థులకు ప్రతిరోజు జరుగుతున్న 100 రోజుల ప్రణాళిక అమలు తీరును పరిశీలించి విద్యార్థులు మరియు ఉపాధ్యాయ సమావేశం ఏర్పాటు చేశారు. 10వ తరగతి విద్యార్థులు ఒక్కరు కూడా గైర్హాజరు కాకుండా తరగతులకు హాజరయ్యే విధంగా ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థులకు స్లిప్ టెస్ట్ లు నిర్వహించిన రోజునే మార్కులు వారికి తెలియజేసి వెంటనే ఆన్లైన్లో నమోదు చేయాలని అన్నారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్ వారి ఆదేశాలతో జిల్లాలోని అన్ని ప్రభుత్వపాఠశాలలో నేటి నుండి 10వ తరగతి విద్యార్థులకు అల్పాహారమును అందించాలని, ఈ విద్యా సంవత్సరం గతానికి భిన్నంగా జనవరి నుండిఅల్పాహారం అందించడం పట్ల జిల్లా కలెక్టర్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా 10వ తరగతి విద్యార్థులకు విద్యాజ్యోతి పుస్తకాలు కూడా వచ్చి ఉన్నాయని వాటిని కూడా ఆయా పాఠశాలకు పంపించనున్నామని అన్నారు. పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నంబూరి తిరుపతిరావు, నంబూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గట్టు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు గుంటూరు పాత బస్టాండ్ లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారి పదో తరగతి విద్యార్థులకు నేటి నుంచి అమలు అవుతున్న అల్పాహారమును లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎస్ ఎం ఎం ఏ ఖుద్దుస్ మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హావీలా పాల్గొన్నారు

## మారిషన్ దేశ అధ్యక్షుని పర్యటన నేపథ్యంలో జిల్లాలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపడుతున్నాం : జిల్లా ఎస్పీ

**గుంటూరు క్రైమ్,జనవరి2,ప్రభాతవార్త :** లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని, సాయి బొమ్మిడాల నగర్, శ్రీ సత్యసాయి స్పిరిచువల్ సిటీలో జనవరి 3,4,5వ తేదీల్లో "ఆంధ్ర సారస్వత పరిషత్తు" వారి ఆధ్వర్యంలో 3వ



ప్రపంచ తెలుగు మహా సభలు 2026 నిర్వహించనున్నారు. ఈ సభల నిర్వహణ అధ్యక్షులుగా ప్రముఖ గజల్ కళాకారుడు డా.గజల్ శ్రీనివాస్ వ్యవహరించనున్నారు. ఈ సభల్లో పాల్గొనడానికి మారిషన్ దేశాధ్యక్షులైన శ్రీ ధరమ్ బీర్ గోకుల్ గారు, ఒడిస్సా గవర్నర్ శ్రీ కంభంపాటి.హరిబాబు గారు, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా. చంద్రబాబు నాయుడు గారు హాజరుకానున్నారు. మారిషన్ దేశాధ్యక్షులైన శ్రీ ధరమ్ బీర్ గోకుల్ గారు 3వ తేదీ సాయంత్రం గుంటూరులోని ప్రముఖ ।గిది వెల్కమ్ హోటల్ కు రానున్నారు. అక్కడ నుండి ప్రపంచ తెలుగు మహా సభలకు హాజరై, తర్వాత మంగళగిరిలోని ప్రముఖ దేవాలయం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకోనున్నారు.

రానున్న మూడు రోజుల్లో జిల్లాలో పర్యటించనున్న ప్రముఖుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ।గిది హోటల్ నందు, శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీ ప్రాంగణంలో, మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా ఎస్పీ శ్రీ వకుల్ జిందల్ ఐపీఎస్ గారు, ఇంటెలిజెన్స్ ఎస్పీ శ్రీ ఆరిఫ్ హాఫీజ్ ఐపీఎస్ గారు, జిల్లా అదనపు ఎస్పీలు శ్రీ తిగిజు రవికుమార్ గారు(లి వీ), ఏ.హనుమంతు గారు(ఏఆర్), ఇతర పోలీస్ అధికారులు పరిశీలించారు.





## 'ఆసిస్ట్'లో ఉచిత కోర్సులు

చిలకలూరిపేట, జనవరి 2, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా చిలకలూరిపేట లోని అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ నందు 18 35 సంవత్సరాల వయసు గల యువతులకు ఖ్మీ ద్వీ త్మీ (నర్సింగ్) కోర్స్ మరియు కంప్యూటర్ కోర్స్ లు 4 నెలలపాటు ఉచితంగా నేర్పబడును, దీనితో పాటు అదనంగా స్పోకెన్ ఇంగ్లీషు కూడా నేర్పబడును. రెసిడెన్షియల్ మరియు నాన్ రెసిడెన్షియల్ సౌకర్యం కలదు. శిక్షణ అనంతరం అర్హులకు ఉద్యోగ అవకాశాలు లు కల్పించబడును. అర్హత మరియు ఆసక్తి ఉన్న వారు వెంటనే 10వ క్లాస్ పాస్ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు ల జిరాక్స్ కాపీ లు మరియు రెండు పాస్ పోర్ట్ ఫోటో లతో చిలకలూరిపేట లోని అడ్డరోడ్డు వద్ద గల అసిస్ట్ ఆఫీస్ ను సంప్రదించ గలరు. ఫోన్ నెంబర్ 9182634233 , 8978820317 లను సంప్రదించాలని కోరారు.

## 'ప్రత్తిపాటి'ని కలిసిన నేతలు

చిలకలూరిపేట, జనవరి 2, ప్రభాతవార్త: చిలకలూరిపేట నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి మరియు ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కరిస్తున్న ఎమ్మెల్యేను పత్యేకంగా అభినందిస్తూ, 2026 లో కూటమి ప్రభుత్వంలో ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షిస్తూ, బిజెపి అసెంబ్లీ కన్వీనర్ తాటిపర్తి జయరామిరెడ్డి , జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఆదిమూలం



గురుస్వామి ,, మాజీ పట్టణ అధ్యక్షులు పొత్తూరి బ్రహ్మానందం , నాదెండ్ల మండల మాజీ అధ్యక్షులు ఆల శివకోటి రెడ్డి తదితర జిల్లా నాయకులు, మండల నాయకులు పాల్గొన్నారు.

## కంపోస్ట్ యార్డును ఆకస్మికంగా తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్

చిలకలూరిపేట, జనవరి 2, ప్రభాతవార్త: పట్టణ పరిధిలోని మానుకొండవారి పాలెంలో ఉన్న మున్సిపల్ కంపోస్ట్ యార్డును మున్సిపల్ కమిషనర్ పి. శ్రీహరి బాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన యార్డులోని చెత్త సేకరణ, విభజన ప్రక్రియను మరియు విధానాన్ని క్షుణ్ణంగా



పరిశీలిం చారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో కంపోస్ట్ యార్డుల పాత్ర కీలకమని, ఎప్పటికప్పుడు సేకరించిన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో అలసత్వం వహించకుండా, పారిశుధ్య నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో కమిషనర్ వెంట డివిజన్1 ఇన్చార్జి శానిటేషన్ ఇన్స్పెక్టర్ షేక్ అబ్దుల్ ఖాదర్, డివిజన్2 శానిటేషన్ ఇన్స్పెక్టర్ సునీత ,మున్సిపల్ ఏ.ఈ ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'గుడ్ మార్నింగ్ చిలకలూరిపేట'

చిలకలూరిపేట, జనవరి 2, ప్రభాతవార్త:స్థానిక ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు టీడీపీ పట్టణ అధ్యక్ష,కార్యదర్సులు "గుడ్ మార్నింగ్ చిలకలూరిపేట" కార్యక్రమం నిర్వహించారు. ఈరోజు ఉదయం 630 గంటల నుంచి 800 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్,ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, 32వ వార్డులో క్లస్టర్,యూనిట్, అధ్యక్ష,కార్య దర్సులు,బూత్ కన్వీనర్లు మరియు ముఖ్య నాయకులను కలుపుకొని పర్యటిస్తూ స్థానికంగా ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. వార్డులో కావలసిన రోడ్లు,డ్రైన్లు నోట్ చేసుకొని గౌరవ శాసనసభ్యులు ప్రత్తిపాటి



పుల్లారావు దృష్టికి తీసుకువెళ్తామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జీ మద్దిబోయిన శివ ,, కో క్లస్టర్ సాంబశివ నాయక్ , యూనిట్ ఇంచార్జీ ఇనగంటి జగదీష్ , వడితే అంజి నాయక్ ,32 వార్డు పార్టీ అధ్యక్షులు రాములు నాయక్ , ప్రధాన కార్యదర్శి అనంత వీరకుమారి, దావర్ల చిరంజీవి,జంజనం వెంకటేశ్వర్లు , బిట్రా శ్రీదేవి , నాగూర్ వలి , పిల్లలమర్రి వెంకటసుబ్బారావు , ఉట్ల సాంబమూర్తి , బండారు నాగరాజు , శిఖ నాగరాజు, శ్రీకాంత్ , అబ్బుల్లా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు అవగాహన

చిలకలూరిపేట, జనవరి 2, ప్రభాతవార్త: రాష్ట్ర న్యాయ అధికార సేవా సంస్థ అమరావతి జిల్లా న్యాయ అధికారి సమస్త గుంటూరు ఆదేశానుసారం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ జడ్జి కే నరేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో సుగాలి కాలనీలో మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులకు రక్షించు రేపు సురక్షితం (ప్రొటెక్ట్ టుడే సెక్యూర్ టుమారో ) అనే అంశం మీద న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయడం జరిగినది. న్యాయ విజ్ఞాన సదస్సులో ఆర్టికల్ 21 జీవించే హక్కులో భాగంగా కాలుష్యాన్ని నివారించి కాలుష్య రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలి. ఇండస్ట్రియల్



ఏరియాలో ఎటువంటి కాలుష్యం కలకుండా ఇండస్ట్రియల్ బాధ్యత వహిస్తే మెరుగైన సమాజం నిర్మించుకోవచ్చని ఈరోజు మన బాధ్యతగా ఉంటే రేపటి పౌరులకు ఫలాలు అద్భుతాయని జడ్జి గారు వివరించారు. న్యాయ సదస్సులో పి వెంకటేశ్వరరావు సీనియర్ న్యాయవాది, ప్రసాద్, భాను ప్రకాష్, పలువురు న్యాయవాదులు పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## శ్రీనివాసరావుకు నివాళులు అర్పించిన మర్రి

యడ్లపాడు, జనవరి 2,ప్రభాతవార్త : మండలం లింగారావుపాలెం గ్రామానికి మునసబు గా పనిచేసిన నంబూరు శ్రీనివాసరావు గత నెల 19 న స్వర్గస్తులైనారు. ఈరోజు వారి పెద్దకర్మ ఈ సందర్భంగా వారి స్వగృహం వద్ద ఏర్పాటుచేసిన వారి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ఈ కార్యక్రమంలో వారి వెంట నంబూరు శివరామకృష్ణ , మండెపూడి శ్రీను , ఆలోకం శ్రీను, కొల్లా



పేరయ్య ,గోపాలం నగేష్, కనపర్తి పెద్ద సుబ్బారావు తదితరులు ఉన్నారు.

## ద్విచక్రవాహనాలు ఢీకొని యువకుడు మృతి

యడ్లపాడు, జనవరి 2, ప్రభాతవార్త : ఎడ్లపాడు గ్రామ సమీపంలోని జగ్గాపురం రోడ్డు వైపు ఉన్న జగనన్న కాలనీ కి చెందిన షేక్ ఖాజావలి (మృతుడు) ఎడ్లపాడులోని బేకరి నుండి స్వీట్లు కొనుగోలు చేసి, తన మోటార్ సైకిల్ పై ఇంటికి వెళ్తుండగా హెచ్పీ గ్యాస్ గోడౌన్ సమీపం వద్దకు రాగానే , ఎదురుగా జగ్గాపురం గ్రామం వైపు నుండి వచ్చిన మరో మోటార్ సైకిల్ అత్యంత వేగంగా, నిర్లక్ష్యంగా, హారన్ ఇవ్వకుండా నడుపుతూ అతని వాహనాన్ని ఢీకొట్టాడు అని దాంతో షేక్ ఖాజావలి రోడ్డుపై పడిపోయి తీవ్ర రక్తస్రావ గాయాలు అయిన విషయం తెలిసిన వెంటనే మృతుని భార్య నాగూర్ బి సంఘటనా స్థలానికి చేరుకొని, అతడిని ఆటోలో స్థానిక హాస్పిటల్ తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు అతడు మృతి చెందినట్టు చెప్పినట్లు తెలిపారన్నారు. భార్య ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేయటం జరిగిందని ఎస్సై టి శివరామకృష్ణ తెలిపారు.



## స్వర్ణ, కాంశ్య పతకాలను సాధించిన ఎస్ఎస్ఎన్ విద్యార్థులు

నరసరావుపేట, జనవరి 2 ప్రభాతవార్త : 2వ ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ కప్ 2025 లో స్థానిక శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల (ఎస్ఎస్ఎన్) విద్యార్థులు బంగారు, కాంశ్య పతకాలను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.ఎస్. సుధీర్ శుక్రవారం తెలిపారు. 2025 డిసెంబర్ 27 28 వరకు తెనాలిలోని శ్రీ లక్ష్మి నరసింహ సోమయాజి వైశ్య వ్యాయామ మందిర్ లో జరిగిన 2వ ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ కప్ 2025 జరిగిందన్నారు. అందర్ 68 కేజీల వెయిట్ కేటగిరి క్యోరుగి ఈవెంట్ లో తమ కళాశాల విద్యార్థి ఎం. శివ సాయి శ్రీకర్ బంగారు పతకం సాధించగా, 63 కేజీల వెయిట్ కేటగిరి క్యోరుగి ఈవెంట్ లో బి. తేజ నాయక్ కాంశ్య పతకం సాధించినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలలో బంగారు, కాంశ్య, పతకాలు సాధించిన కళాశాల విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ మరియు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, జాయింట్ సెక్రెటరీ మీనిగ వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శ్రీనివాస సాయి, వ్యాయామ అధ్యాపకుల డాక్టర్ యక్కల మధుసూదనరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

# పల్నాడు జిల్లా వార్త



## జడ్పీ సీఈవోను కలిసిన ఎమ్మెల్యే

నరసరావుపేట, జనవరి 2 ప్రభాతవార్త : : పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల కార్యాలయంలో పిఎంఏజీవై సమీక్ష సమావేశానికి శుక్రవారం జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతిబసు హాజరయ్యారు. అనంతరం జెడ్పి సీఈఓ జ్యోతిబసు స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఎంపీడీవో కార్యాలయంలో జ్యోతి బసును మర్యాద పూర్వకంగా కలిసి, మాట్లాడారు. నియోజకవర్గానికి సంబంధించిన జడ్పీ పెండింగ్ లో ఉన్న నిధులను మంజూరు చేయాలని, అలాగే రానున్న రోజుల్లో నియోజకవర్గానికి జడ్పీ నిధులు కేటాయించాలని, రైతులు పొలాలకు వెళ్ళే రోడ్లకు సంబంధించిన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. జడ్పీ సీఈఓ స్పందిస్తూ, మార్చి కల్లా నిధులు మంజూరు



చేస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టీవీ. కృష్ణకుమారి, మండల పార్టీ ప్రెసిడెంట్ బండారుపల్లి విశ్వేశ్వరరావు, జి. సురేష్, అధికారులు పాల్గొన్నారు. ..ప్రజాదర్బార్ లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే... నరసరావుపేట నియోజకవర్గం టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజా దర్బార్) నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాలు, పట్టణంలోని పలు వార్డుల ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూఎమ్మెల్యే అరవింద బాబుకు వినతి పత్రాలు అందజేశారు. ప్రజలు ఇచ్చిన అర్జీలపై స్పందించిన ఎమ్మెల్యే అరవింద్ బాబు వెంటనే సంబందించి శాఖ అధికారులకు ఫోన్ చేసి ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కూటమి కట్టుబడి ఉంది:

### ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట, డిసెంబర్ 2 ప్రభాతవార్త : : రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు పేర్కొన్నారు. స్థానిక అంజు మాన్ కాంప్లెక్స్ లో శుక్రవారం నూతన భవణానికై నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన అంజుమాన్ కాంప్లెక్స్ ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి పనులు వేగవంతం చేయడం జరిగిందన్నారు. అంజు మాన్ కాంప్లెక్స్ నిర్మాణానికి నూతన కమిటీని నియమించామన్నారు. వారి ఆధ్వర్యంలో ఎప్పటికే 30 షాపులు పూర్తి చేశామని, 28 షాపులకు స్లాబ్ వేసినట్లు తెలిపారు.



మిగతా 14 షాపులకు భూమి పూజ చేయడం జరిగిందన్నారు. ఈ సంవత్సరం మార్చి కల్లా పూర్తి చేసి పూర్తిస్థాయిలో లబ్ధిదారులకి అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే అరవింద్ బాబు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి ముస్లిం మైనారిటీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగ్గిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాపు నాయకుల డిమాండ్

రొంపిచర్ల, జనవరి 2 ప్రభాతవార్త : : ఉమ్మడి గోదావరి జిల్లాలోని రావులపాలెంలో శ్రీకృష్ణదేవరాయ చిత్రపటాన్ని చింపి అవమానించిన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం మరియు రాధా రంగా మిత్రమండలి నాయకులు శుక్రవారం డిమాండ్ చేశారు. కులాలు మతాల మధ్య గొడవలు సృష్టించి, ప్రశాంతంగా ఉన్న గోదావరి జిల్లాల్లో ప్రజలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందటానికి జగ్గిరెడ్డి ప్రయత్నాలను చేస్తున్నారని విమర్శించారు. శ్రీకృష్ణదేవరా యలను అవమానించిన వ్యక్తిని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాపు సంఘ అధ్యక్షులు పోతుల శంకర్, ప్రధాన కార్యదర్శి మంచాల తిరుపతిరావు, యతిరాజు రామ్మోహన్ రావు, రాయల శ్రీనివాసరావు, రామిశెట్టి సుబ్బారావు, అల్లంశెట్టి మోహన్ రావు, అద్దేపల్లి ఆనంద్, కృష్టంశెట్టి గోవిందరావు, శ్రీకాంత్ గుప్తా, రాధా రంగ మిత్రమండలి అధ్యక్షులు పోతంశెట్టి రాము, సంక నాగరాజు తదితరులు కోరారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ధ్యేయం

### రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాలను అందజేసిన ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, జనవరి 2 ప్రభాతవార్త: : రాష్ట్రంలో వ్యవసాయం లాభసాటిగా మారి అన్నదాతల బతుకులు మారాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. మండలంలోని ఇస్సా పాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలోఎమ్మెల్యే అరవింద బాబు పాల్గొన్నారు. రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి రైతులుకి ప్రభుత్వ రాజముద్రతో కూడిన రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనతో రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ఎన్నో భూకబ్జాలు చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో అందరి ఆస్తుల



హక్కులు తనవేనని భావించిన జగన్ దేశంలో ఎక్కడా లేనివిధంగా పాట్టదారు పాసు పుస్తకాలపైన, అలాగే సరిహద్దు రాళ్లపై కూడా జగన్ రూ.700 కోట్ల ప్రజాధనంతో తన ఫోటో వేసుకున్నారని తెలిపారు. తమ సొంత భూముల పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ ఫోటో వద్దని కోరిన రైతుల కోరిక మేరకు, రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసు పుస్తకాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిణీ చేస్తోందని అన్నారు. ముందుగా గ్రామంలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే వినతి పత్రాలు అందుకున్నారు. ఫిర్యాదులను స్వీకరించి, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కల్చరల్ డైరెక్టర్ బండారుపల్లి విశ్వేశ్వరరావు, నరసరావుపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనాటి శ్రీనివాసరావు, ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కృష్ణవేణిలో ముగిసిన ఎం.ఎస్ఎం.ఈ శిక్షణా కార్యక్రమం

నరసరావుపేట టౌన్, జనవరి 2 ప్రభాతవార్త : : స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం భారత కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఎం.ఎస్ఎం.ఈ (మైక్రో, స్మాల్ మీడియం ఎంటర్ ప్రైజస్) శిక్షణా కార్యక్రమం శుక్రవారం విజయవంతంగా ముగిసింది. మొత్తం 20 రోజుల పాటు సాగిన ఈ శిక్షణా కార్యక్రమంలో 10 రోజులు పైతాన్ ప్రోగ్రామింగ్, 10 రోజులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మెషిన్ లెర్నింగ్ పై అధునాతన సాంకేతిక అంశాలపై విద్యార్థులకు నిపుణులు



శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం అకడమిక్ చదువులకే పరిమితం కాకుండా, సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అప్పుడే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ యోగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాలకోటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల ఆస్తుల జోలికి వెళ్లడమే జగన్ చేసిన అతి పెద్దతప్పు : ప్రత్తిపాటి

యడ్లపాడు, జనవరి 2, ప్రభాతవార్త: రాష్ట్రమే తన జాగీర్ అన్నట్టు తలతిక్క నిర్ణయాలు తీసుకున్న జగన్ వైఖరిని, వారసత్వంగా తమకు సంక్రమించిన భూముల పాసుపుస్తకాలు, సర్వేరాళ్లపై తన బొమ్మలు వేసుకోవాలన్నఆయన ప్రచారపిచ్చిని ప్రజలు భరించలేకపోయారని, అందుకే సమయం చూసి వైసీపీని సాగనంపారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు.ప్రభుత్వ రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పుస్తకాల పంపిణీలో కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి.. చిలకలూరిపేట మండలం గొట్టిపాడు, యడ్లపాడు మండలం ఉన్నవ, నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామాల రైతాంగానికి, కూటమినాయకులతో కలిసి కొత్త పాసుపుస్తకాలు అందచేశారు. ఈ సందర్భంగా గ్రామస్తుల్ని ఉద్దేశించి, కార్యక్రమానంతరం విలేకరులతో ప్రత్తిపాటి మాట్లాడారు. భూ హద్దుల వివరాలు..ఇతరత్రా పూర్తి సమాచారంతో ప్రభుత్వ రాజముద్రతో నూతన పాసు పుస్తకాలు భూముల హద్దులకు సంబంధించిన పూర్తి సమాచారంతో పాటు, మ్యాప్ తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల్ని ప్రభుత్వ రాజముద్రతో రైతాంగానికి అందించాలన్న చంద్రబాబు నిర్ణయం తిరుగులేనిదని ప్రత్తిపాటి పేర్కొన్నారు. భవిష్యత్ లో కూడా భూ యజమానులకు ఎలాంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించిందన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో అధికారులు అన్ని వివరాలు, భూమి హద్దుల్ని తెలిపే మ్యాప్ తో కూడిన పట్టాదారు పాసుపుస్తకాల్ని అందచేస్తున్నారని, గతంలో ఉన్న రెండు పాసు పుస్తకాల స్థానంలో ఒక్కటే అందచేస్తున్నారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ఎవరైనా కొత్త పాసుపుస్తకం పోగొట్టుకుంటే స్థానిక సచివాలయం ద్వారా మరలా నకలు



పాసుపుస్తకం పొందవచ్చన్నారు. తన ఫోటోలు.. తన పార్టీ రంగులుండాలన్న పిచ్చి నిర్ణయాలే జగన్ కు చేటు చేశాయి. జగన్ ప్రచారపిచ్చి.. ల్యాండ్ టైటిల్ యాక్ట్ పై ఆయన మోజే. వైసీపీని వాస్తవాలకు (ఫ్యాక్ట్స్) కు దూరం చేసి, 11 స్థానాకలు పరిమితం చేసిందని ప్రత్తిపాటి తెలిపారు. ప్రతి పథకం. ప్రతి కార్యక్రమంలో తన ఫోటోలే ఉండాలనే పిచ్చితో పాటు. భవనాలకు పార్టీ రంగులు వేయాలనే మరో నిర్ణయమే జగన్ కు చేటుచేసి, ఇప్పుడు ప్యాలెస్ లకు పరిమితం చేసిందని ప్రత్తిపాటి ఎద్దేవాచేశారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా సంక్రమించిన భూముల్లో వేలు పెట్టి, ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూముల్ని కాజేయాలని చూసినందుకే వైసీపీ భారీ మూల్యం చెల్లించుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ బొమ్మతో సర్వే రాళ్ల తయారుచేసినవారు, అన్నివిధాల నష్టపోయి, రోడ్ల పాలు అయ్యారని ప్రత్తిపాటి చెప్పారు. జగన్ మాదిరిగా ఎన్టీఆర్, చంద్రబాబు ఫోటోలు ఉండాలనే ఆలోచన చేయకుండా కూటమిప్రభుత్వం సర్కార్ రాజముద్రతో పాసు పుస్తకాల పంపిణీ చేపట్టడం నిజంగా ప్రజలు గర్వించే విషయమన్నారు. అడగకుండానే తమకు మంచి చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని, అప్పుడే వారికి, రాష్ట్రానికి శ్రేయస్కరమని ప్రత్తిపాటి అభిప్రాయపడ్డారు. ప్రతి రోజూ పండగనేలా చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజలకోసం పనిచేస్తోందని ప్రత్తిపాటి తెలిపారు. నిన్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికితే, నేటి నుంచి 9వ తేదీవరకు కొత్త పాసు పుస్తకాల పంపిణీతో రైతు కుటుంబాల్లో సంతోషం నింపిందన్నారు. ఇది ముగేసేలోపు ప్రజల ముంగిటకు ప్రభుత్వం సంక్రాంతి సంతోషాల్ని తీసుకెళుతుందన్నారు. అనంతరం గుంటూరు మిర్చి మార్కెట్ యార్డ్ చైర్మన్ మాట్లాడుతూ నాకు పదవి రావటానికి కారణం మా ప్రియతమా నాయకులు ప్రత్తిపాటి పుల్లారావుకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపి, ముఖ్యమంత్రి చంద్రబాబు , మంత్రి నారా లోకేష్ ఆసియా ఖండంలోనే అతిపెద్ద మిర్చి యార్డ్ బాధ్యతను తనపై నమ్మకం ఉంచి అప్పగించినందుకు అదే విధంగా కట్టుబడి పనిచేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట మిర్చి యార్డ్ చైర్మన్ కుర్రా అప్పారావు, జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, బండారుపల్లి సత్యనారాయణ, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, కుర్రా రత్తయ్య, పావులూరి శ్రీనివాసరావు, ధూళిపాళ్ల పద్మ, నాగబైరు ఆంజనేయులు, దండ శ్రీను, కొత్త మోహన్, తాళ్లూరి సాంబశివరావు, పోపూరి వెంకయ్య, నాగళ్ల రాంబాబు, మద్దూరి శ్రీనివాస రెడ్డి, నల్లమోతు హరిబాబు,గుర్రం నాగ పూర్ణచంద్రరావు,నల్లూరి హరిబాబు, మస్తాన్ వలి ఎమర్వోలు, సర్వేయర్లు, ఆర్.ఐ లు అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెప్పినట్టే రేషన్ దుకాణం ఏర్పాటు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 2, ప్రభాతవార్త: పట్టణానికి కాస్త దూరంగా ఉన్నందున, సకాలంలో తమకు రేషన్ ఇతర ప్రభుత్వ సేవలు అందడం లేదన్న టిడ్కో గృహ లబ్ధిదారుల విజ్ఞప్తి దృష్ట్యా, వారుండే చోటనే రేషన్ పంపిణీ జరిగేలా వెంటనే చర్యలు తీసుకున్నామని, టిడ్కో సముదాయంలో రేషన్ దుకాణం ఏర్పాటుకు కృషిచేసిన కలెక్టర్ శ్రీమతి కృతికా శుక్లా, ఇతర అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. వారంలోనే రేషన్ పంపిణీ అందుబాటులోకి తీసుకొచ్చాం శుక్రవారం ఆయన ఎన్టీఆర్ నగర్ (టిడ్కో గృహ సముదాయం) నివాసుల కోసం ఏర్పాటుచేసిన రేషన్ దుకాణాన్ని ప్రారంభించి, స్వయంగా కార్డుదారులకు రేషన్ అందించారు. రేషన్ సరుకుల నాణ్యతను పరిశీలించిన ప్రత్తిపాటి.. ఎలా ఉంటున్నాయని కార్డుదారుల్ని ప్రశ్నించారు. అనంతరం ప్రత్తిపాటి మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు



లేకుండా ప్రభుత్వ సేవలు, పథకాల్ని వారికి చేరువ చేయడంలో కూటమిప్రభుత్వం ఎప్పుడూ ముందే ఉంటుందన్నారు. టిడ్కో గృహ లబ్ధిదారులకోసం రేషన్ దుకాణం, వైద్య సేవా కేంద్రం వంటివి ఏర్పాటు చేయాలని, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు కూడా ఇక్కడే అందించేలా చూడాలని గతనెల 26న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేసిన ప్రత్తిపాటి.. వారంలోనే రేషన్ సరఫరాను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అలానే ఇకపై అన్నిరకాల ప్రభుత్వ సేవలు టిడ్కో లబ్ధిదారుల చెంతకే వస్తాయని, ప్రాథమిక వైద్యకేంద్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు.కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరి బాబు, డి.ఎస్.వో , ఎమ్మార్వో షేక్ మహమ్మద్ హుస్సేన్, మున్సిపల్ కౌన్సిలర్లు జంగా సుజాత, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాటికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన జనసేన నేత మండలనేని చరణ్ తేజ

చిలకలూరిపేట, జనవరి 2, ప్రభాతవార్త: పురస్కరించుకుని చిలకలూరిపేట మాజీ మంత్రి, ప్రస్తుత శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారిని వారి నివాసంలో జనసేన పార్టీ నియోజకవర్గ యువ నాయకులు మండలనేని చరణ్ తేజ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.అభివృద్ధి పథంలో కూటమి ప్రభుత్వంఅనంతరం చరణ్ తేజ మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా రంజక పాలన సాగుతోందని కొనియాడారు. ముఖ్యంగా తెలుగుదేశం, జనసేన, బిజెపి సమన్వయంతో రాష్ట్రం మళ్లీ అభివృద్ధి పట్టాలెక్కిందని ఆశాభావం వ్యక్తం చేశారు. "ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, నిరుద్యోగులకు



భరోసానిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు చారిత్రాత్మకం. రాబోయే రోజుల్లో రాష్ట్రం స్వర్ణాంధ్రగా మారుతుందనడంలో సందేహం లేదు." అని చరణ్ తేజ పేర్కొన్నారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకుడు పుల్లారావునియోజకవర్గ అభివృద్ధిలో ప్రత్తిపాటి పుల్లారావు గారి పాత్ర అమోఘమని చరణ్ తేజ ఆయనకున్న రాజకీయ అనుభవం, అభివృద్ధి పట్ల ఉన్న విజన్ నియోజకవర్గానికి ఎంతో మేలు చేస్తుందని నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకుడిగా పుల్లారావు గారు ఆదర్శప్రాయులని కూటమి నేతలందరినీ కలుపుకుని పోతూ, చిలకలూరిపేటను అన్ని రంగాల్లో ముందుంచడానికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని ప్రత్తిపాటి పుల్లారావు గారికి శుభాకాంక్షలు తెలిపారు.

## కట్టా కిషోర్ మృతికి 'మర్రి' సంతాపం

చిలకలూరిపేట, జనవరి 2, ప్రభాతవార్త: మాజీ ఎమ్మెల్యే దివంగత సోమేపల్లి సాంబయ్య ముఖ్య అనుచరులు, సుదీర్ఘకాలం నాదెండ్ల సమితి అధ్యక్షులుగా పనిచేసిన కట్టా సుబ్బారావు ద్వితీయ కుమారుడు కట్టా కిషోర్ (కట్టా జవహర్ బాబు తమ్ముడు) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలుసుకొని వారి స్వగ్రామమైన చిలకలూరిపేట మండలం కుక్కపల్లివారిపాలెం లోని వారి స్వగృహం వద్ద ఉన్న వారి పార్థీవ దేహానికి నివాళులర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ నివాళుల



ర్పించారు. సతీమణి లలితమ్మ , సోమేపల్లి వెంకట సుబ్బయ్య . వారివెంట జాలాది సుబ్బారావు , కొండ్ర గుంట రామకృష్ణ, నార్నె హనుమంతరావు ,బండారుపల్లి శ్రీనివాసరావు ,గడిపూడి దశరథ రామయ్య ,హిదాయితుల్లా ,కుక్కపల్లి వెంకట్రావు, కొండగుంట కిష్టయ్య , కట్ట హరిబాబు , కందిమళ్ళ సత్యనారాయణ , కందిమళ్ళ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## మాతాశ్రీ వైద్యశాలలో అరుదైన శస్త్ర చికిత్సలు

నరసరావుపేట, జనవరి 2 ప్రభాతవార్త :: పట్టణంలోని మాతా శ్రీ హాస్పిటల్ లో అరుదైన శస్త్ర చికిత్సలను నిర్వహించారు. వివరాలను శుక్రవారం హాస్పటల్ చైర్మన్ డాక్టర్ పి రామచంద్రారెడ్డి తెలియజేశారు. తీవ్రమైనటువంటి పొట్ట నొప్పితో రామ్ చరణ్ అనే బాలుడు హాస్పటల్ కి రావడంజరిగిందన్నారు. బాలునికి వైద్య పరీక్షలు నిర్వహించి ఎడమవైపు ఉన్న ఊపిరితిత్తులు సక్రమంగా పనిచేయడం లేదని గుర్తించాన్నారు. ఆయాసం కూడా ఉండడంతో బాలుడు తీవ్ర ఇబ్బంది పడుతున్నాడన్నారు. తినే ఆహారం సక్రమంగా జీర్ణం కావడంతో సమస్య తీవ్రంగా మారిందన్నారు. బాలునికి ఉన్న జబ్బును గుర్తించి, శస్త్ర చికిత్సను చేయటం అవసమైందన్నారు. దీంతో లాప్రోస్కోపిక్



విధానంలో కేవలం శరీరంలో రెండు ప్రాంతాలలో చిన్న రంధ్రాలతో విజయవంతంగా ఆరోగ్య సమస్యను పరిష్కరించామన్నారు. అదేవిధంగా లక్ష్మ్మయ్య అనే వ్యక్తి ఆహారం ఏ విధమైన రూపంలో తీసుకున్న జీర్ణం కాకపోవడం, అధికంగా వాంతులు చేసుకోవడంతో హాస్పటల్ కు రావడం జరిగిందన్నారు. పొట్టపై ఉన్న పెద్దప్రేగు ఒత్తిడికి గురి కావడంతో ఈ పరిస్థితి ఉందని ఆరోగ్యపరీక్షల్లో నిర్ధారించామన్నారు. లక్ష్మ్మయ్యకు పొట్టపై చిన్న రంధ్రాలు పెట్టి లాప్రోస్కోపిక్ విధానంలో శస్త్ర చికిత్సను చేయడంజరిగిందన్నారు. రెండు వేరు, వేరు ఆరోగ్య సమస్యలను పెద్ద ఆపరేషన్లతో పని లేకుండా కుట్లు, కోతలు లేని తేలికైన లాప్రోస్కోపిక్ విధానంలో వారిని సాధారణ పరిస్థితికి తీసుకురావడం జరిగిందన్నారు. రామ్ చరణ్, లక్ష్మ్మయ్యలు పూర్తిస్థాయిలో ఆహారాన్ని తీసుకోవడం ఆపరేషన్ తర్వాత అత్యంత వేగంగా రికవరీ కావడం జరిగిందన్నారు. ఇటువంటి ఆరోగ్య సమస్యలకు పెద్ద ఆపరేన్లతో పాటు అత్యంత వ్యయంతో కూడినవిగా ఉంటాయన్నారు. తమ మాతా శ్రీ హాస్పిటల్ లో తక్కువ ఖర్చుతో, వేగంగా ఆరోగ్యమైన జీవనం సాగించేందుకు లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలను చేయటం జరుగుతుందని డాక్టర్ పి రామచంద్రారెడ్డి వివరించారు.

## ఏఎం.రెడ్డి కళాశాలలో వర్క్‌షాప్

నరసరావుపేట టౌన్, జనవరి 2 ప్రభాతవార్త ::నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామంలోని ఏఎం.రెడ్డి స్మారక విద్యాసంస్థ మరియు హైదరాబాదుకు చెందిన ఐ హబ్ డేటా ఐఐటి అనుబంధంగా శుక్రవారం 10 రోజుల మెషిన్ లెర్నింగ్ ఇన్ హెల్త్ కేర్ వర్క్ షాప్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మంగళగిరి ఎయిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అలెక్స్ రోబెల్లో హాజరై మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక మానవ జీవితంలో మనిషి అనేక అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. వీటిని ప్రారంభ దశలోనే అనారోగ్య కారకాలను మరియు వ్యాధి దశను కనుగొనే నూతన పద్ధతులను పది రోజుల వర్క్ షాప్ కార్యక్రమం ద్వారా విద్యార్థులు




తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఆచార్య కే. జగన్నాథ రావు విద్యార్థులను ఉద్దేశిస్తూ షెడ్యూల్ కులాల విద్యార్థులకు ప్రత్యేకంగా నిర్వహించడం ద్వారా గిరిజన ప్రాంతాల నుండి విద్యను అభ్యసించడానికి మరియు వైజ్ఞానిక అంశాల పట్ల ఆసక్తి కలిగిన విద్యార్థులకు ఈ వర్క్ షాప్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కళాశాల చైర్మన్ అట్లూరి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఇటువంటి జాతీయ మరియు అంతర్జాతీయ వర్క్ షాప్ లు మరియు సదస్సులు నిర్వహిండం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిల్స్ డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ భార్గవ భూషణ్ రావు, డాక్టర్ కృష్ణారెడ్డి, అకాడమిక్ డీన్ ఏ. పావని, విభాగాధిపతులు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ

సత్తెనపల్లి, జనవరి 2, ప్రభాతవార్త: సత్తెనపల్లి నియోజకవర్గం సత్తెనపల్లి పట్టణం 30వ వార్డు నిర్మల నగర్ మసీద్ నందు విద్యార్థులకు పుస్తకాలు దుప్పట్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు షేక్ జాన్ సైదా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర జిల్లా, పట్టణ వార్డు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## 'పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి'

సత్తెనపల్లి, జనవరి 2, ప్రభాతవార్త: విద్యార్థులకు క్రీడలతో పాటు పుస్తకాలు చదవడం పై అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు మరియు టీచర్లపై ఉందని అమరావతి సేవా సంస్థ అధ్యక్షులు గొల్లపల్లి వీరాంజనేయులు అన్నారు శుక్రవారం అమరావతి సేవా సమితి ఆధ్వర్యంలో వావిలాల స్మృతి వనంలో ఫోన్లు వదలండి పుస్తకాలు పట్టండి అనే కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అమరావతి సేవ సమితి అధ్యక్షులు వీరాంజనేయులు మాట్లాడుతూ ఇక్కడ విద్య, ఆర్థిక,రాజకీయ,చరిత్రతో సహా వివిధ రకాలైన పుస్తకాలను ప్రదర్శన ఉంచడం జరిగింది అన్నారు పుస్తకాలు చదవడం ద్వారా భాష, జాతీయబంధం, దేశ అభిమానం పెరుగుతుందన్నారు.



పుస్తకాలు చదవడం అలవాటు చేయడం వల్ల క్రమశిక్షణ కూడా పెరుగుతుందన్నారు. ఇప్పటికే నాలుగు సెక్షన్లుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని రోజురోజుకీ పుస్తకప్రియుల తాకిడి పెరుగుతుందని అలాగే పుస్తక దాతల నుంచి విశేష స్పందన వస్తుందని తెలిపారు. పుస్తకాల దాతలకు బృందా సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. నాలుగో సెక్షన్ కి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ పుస్తకాలు ఒక వ్యక్తి ఆలోచనలను మాత్రమే కాదని, సమాజ దిశను కూడా మార్చే శక్తి కలవని అన్నారు. ఈ పుస్తకాల ప్రదర్శనను పట్టణ ప్రజలతోపాటు విద్యార్థులు కూడా సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమరావతి సేవ సమితి కార్యవర్గ పాటిబండ్ల రవి రాజా,నాగమల్లేశ్వరరావు, గోపి, బాబు, శ్రీను, అంకమ్మరావు, తదితరులు పాల్గొన్నారు.

## మదర్‌థెరిస్సా సేవాసమితి అధ్యక్షునిగా జక్కిరెడ్డి మర్రెడ్డి

మాచర్ల, జనవరి 2 ప్రభాతవార్త: మదర్ థెరిస్సా సేవాసమితి నూతన అధ్యక్షులుగా జక్కిరెడ్డి మర్రెడ్డి నియమితులైనట్లు పూర్వ అధ్యక్షులు గాదె కిరీటిరెడ్డి తెలిపారు. శుక్రవారం జరిగిన సమితి విస్తృత కార్యవర్గ సమావేశంలో అధ్యక్షునిగా మర్రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మోరా భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా దుగ్గెంపూడి శౌరి రాయపరెడ్డి, కోశాధికారిగా ముత్యాల పాపిరెడ్డి, సాంస్కృతిక





కార్యదర్శిగా అందుగుల చంద్రయ్య, కార్యదర్శిగా కిరీటిరెడ్డి, లీగల్ అడ్వయిజర్‌గా చిలమకూరి నాగిరెడ్డి, సమన్వయకర్తలుగా ఎర్రబోతుల శ్రీనివాసరావు, జక్కిరెడ్డి చిన్నపరెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. వీరు రెండు సంవత్సరాలు పదవీ కాలంలో ఉంటారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి కసిరెడ్డి శాంతిరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ మానవాళికి మదర్‌థెరిస్సా ఆదర్శమని పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

## విద్యాపరిమళాలు వెదజల్లినప్పుడే ఫ్యాక్షన్ అంతరిస్తుంది: ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, జనవరి 2 ప్రభాతవార్త: విద్యాపరిమళాలు వెదజల్లినప్పుడే పల్నాడులో ఫ్యాక్షన్ అంతరించి, శాంతి నెలకొంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నియోజకవర్గంలో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10లో 580పైగా మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.50 వేలు, స్టేట్‌ఫస్ట్ ర్యాంకు సాధించిన పావని చంద్రిక, స్టేట్ రెండో ర్యాంకు సాధించిన కావ్యశ్రీలకు రూ.లక్ష చొప్పున



మొత్తం రూ.8 లక్షలు ప్రోత్సాహకంగా ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు దూరమైన ప్రాంతాల్లో ఫ్యాక్షన్, నక్సలిజం ప్రబలుతుందని, విద్యతోనే యువతను వాటి బారి నుంచి బయటపడేయొచ్చని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చామన్నారు. అలాగే 8, 9 తరగతుల్లో మెరిట్ కనబరుస్తున్న విద్యార్థులకు సైతం నగదు పురస్కారాలను అందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్య బలోపేతానికి కూటమి ప్రభుత్వం, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తున్నారని ప్రశంసించారు. విద్యావ్యవస్థల్లో సంస్కరణలు తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు కలలు కన్నట్లుగానే నాణ్యమైన విద్య, మౌలిక వసతులకు ప్రభుత్వ పాఠశాలలు కేరాఫ్‌గా నిలుస్తున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఎంఈఓలు, హెచ్‌ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదగుండెకు భరోసా సీఎం సహాయ నిధి

మాచర్ల, జనవరి 2 ప్రభాతవార్త: పేద గుండెకు భరోసా సీఎం సహాయనిధి అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో 49 మంది లబ్ధిదారులకు రూ.64.11 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నగదు చెక్కులను ఆయన



అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక స్తోమత లేక అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న ప్రతి పేదవాడికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఆదుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై అధికారులు స్పందించకుంటే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే

మాచర్ల, జనవరి 2 ప్రభాతవార్త: ప్రజా సమస్యలపై అధికారులు స్పందించకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించారు. భూ సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాలు, ల్యాండ్ కబ్జాలు, నూతన పింఛన్లకు సంబంధించి దాదాపు 30 అర్జీలను ప్రజలు ఎమ్మెల్యేకు అందజేశారు. వాటిని పరిశీలించిన జూలకంటి సంబంధిత శాఖాధికారులకు ఫోన్ చేసి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదని సూచించారు. కిందిస్థాయిలోనే ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే గత ప్రజాదర్బార్‌లో ప్రజలు అందించిన అర్జీలు పరిష్కరించారా? లేదా? అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కిరణ్‌కుమార్, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పల్నాడు జిల్లా వార్త



## మెరుగైన విద్యుత్ అందించడమే 'కూటమి' ప్రభుత్వ లక్ష్యం: చీఫ్ విప్ జీ.వీ

వినుకొండ,జనవరి2,ప్రభాతవార్త: రాష్ట్రంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ చీఫ్ విప్,సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 1వ వార్డు ధర్మపురి కాలనీ,కళ్యాణపురి కాలనీ,సిద్దార్థ నగర్‌లోని లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించేందుకు 16 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసిన 100 కె.వి ట్రాన్స్ఫార్మర్లను చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు చార్జీలు ఒక్క రూపాయి కూడా పెంచకుండా,ట్రూ ఆఫ్ చార్జీలు



రద్దుచేసి రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును అందించేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో విద్యుత్ సమస్య లేకుండా ప్రభుత్వ చర్యలు చేపట్టిందన్నారు. ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రంలో విద్యుత్తు రంగాన్ని సర్వ నాశనం చేశార,9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై అధిక భారాన్ని మోపి దుర్మార్గమైన పాలన సాగించారని అన్నారు. నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు 18 నెలల పాలనలో నియోజకవర్గానికి 11.86 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని చెప్పారు. టిట్కో గృహాల వద్ద 2.85 కోట్లతో 33/11 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం జరిగిందని,పట్టణంలో లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికి ఎన్ఎస్పి స్థలంలో మరో సబ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 1.20 కోట్లతో 2వేల విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేశామని,1683 వ్యవసాయ కనెక్షన్ ఇవ్వడం జరిగిందని చెప్పారు. మూగ చింతలపాలెం లో 70 లక్షలతో సబ్స్టేషన్, 10 లక్షలతో పవర్ బ్రేకర్,ములకలూరులో 68 లక్షలతో పవర్ ట్రాన్స్ఫార్మర్,నియోజకవర్గంలో ఆర్డిఎక్స్ సె పవర్ లైనుకు 5.26 కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో కరెంటు సమస్యలు ఎక్కడ ఉన్నా అవసరమైన చోట సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ప్రజలు సూర్యఘర్ సోలార్ పథకంతో విద్యుత్‌ను ఆదా చేసుకోవాలని కోరారు. తప్పుడు ప్రచారాలు చేస్తున్న వైకాపా నాయకులు తీరుమార్చుకోకపోతే ప్రజలే తరిమితరిమి కొడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు,అధికారులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు: జీవి

వినుకొండ,జనవరి2,ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ చీఫ్‌విప్,సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కొత్తపేట నందు గల చీఫ్‌విప్ కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో జీ.వీ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుండి 48 అర్జీలు వరకు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను ఓపిగ్గా ఆలకించిన జీ.వీ వారి సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులతో మాట్లాడి తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి వారం ప్రజా సమస్యల



పరిష్కార వేదిక ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. రెవెన్యూ,పింఛన్లు,ఇళ్ల స్థలాలకు సంబంధించి ఎక్కువగా అర్జీలు రావడం జరిగిందని వచ్చిన అర్జీలను వెంటనే ఆన్లైన్ చేసి వాటిని సంబంధిత అధికారులకు పంపించి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తున్నామని జీ.వీ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తుందని,పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇవ్వనుందని దరఖాస్తు చేసుకున్న ఇళ్ల స్థలాలు త్వరలో ఇవ్వటం జరుగుతుందని అందుకు సంబంధించిన కార్యాచరణ సిద్ధమవుతుందని అన్నారు. కూటమి పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బృహతి స్కిన్ హాస్పిటల్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



వినుకొండ,జనవరి2,ప్రభాతవార్త: బృహతి స్కిన్ హాస్పిటల్ 2026 నూతన క్యాలెండర్‌ను చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు శుక్రవారం ఆవిష్కరించారు. కొత్తపేటలోని చీఫ్‌విప్ కార్యాలయం నందు జరిగిన ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్య బృందం శ్రీనివాస్,చర్మ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీవిద్య,ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

మాచర్ల, జనవరి 2 ప్రభాతవార్త: ఎంఎస్పీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డిపర్తి శ్రీనివాసరావు మాదిగ ఆధ్వర్యంలో వారి తండ్రి, కీర్తిశేషులు గడ్డిపర్తి నాగేశ్వరరావు (ఎక్స్ఆర్మీ) 5వ వర్ధంతి సందర్భంగా జ్ఞాపకార్థం రెంటచింతల మండలం మంచికల్లు జిల్ల పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం ఎస్‌కే శిలార్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో సమస్యలతో పిల్లల చదువులు మధ్యలోనే ఆగకూడదన్నారు. చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. చదువు ఒక్కడే



అన్నిటికి పరిష్కారం చూపుతుందన్నారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను, గురువులను గౌరవించి క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే సమాజంలో గౌరవంగా జీవించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల టీచర్లు, ఎమ్మార్పీఎస్ మంచికల్లు సీనియర్ నాయకులు గెల్లెపోగు రాజారావు మాదిగ, ఎమ్మెస్పీ రెంటచింతల టౌన్ అధ్యక్షులు తాళ్లూరి మరియబాబు మాదిగ, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్లోరీ ఆఫ్ క్రైస్ట్ చర్చిలో 40 రోజుల ఉపవాస ప్రార్థనలు



విజయపురిసౌత్, జనవరి 2 ప్రభాతవార్త: స్థానిక గ్లోరీ ఆఫ్ క్రైస్ట్ చర్చిలో 40 రోజుల ఉపవాస ప్రార్థనా కూడికలను శుక్రవారం ప్రారంభించారు. డా।। రెవరెండ్ దానియేలు ఆధ్వర్యంలో చర్చి వద్ద పావురాలు ఎగురవేసి అనంతరం భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజలకు శాంతి, సమాధానం, క్షేమాన్ని మహోన్నతుడైన దేవుడు కలుగజేయాలని ప్రార్థించారు. సర్వమానవాళి పాడిపంటలతో, సుఖశాంతులతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిస్టర్ మహిమా దానియేలు, పాస్టర్లు, సంఘ విశ్వాసులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా 'వార్త' 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

పెదకూరపాడు, జనవరి 2, ప్రభాతవార్త: జాతీయ తెలుగు దినపత్రిక 'వార్త' - 2026 క్యాలెండర్ ను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో తాజా తాజా వార్తలు అందిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి



వారధిలా పనిచేస్తున్న వార్త దినపత్రికకు అభినందనలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఏటుకూరు బ్రహ్మయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు ముంతాజ్, గంగినేని లీలావతి, తహసిల్దార్ ధనలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైతుల సమస్యలు పరిష్కరించేందుకే 'వందరోజుల కార్యక్రమం'

పెదకూరపాడు, జనవరి 2, ప్రభాతవార్త: మండలంలోని చిన మక్కెన గ్రామంలో " ప్రజల వద్దకు ప్రవీణ్ : 100 రోజులు 100 గ్రామాల పర్యటన కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ 28వ రోజు పాల్గొన్నారు.ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామంలో 15 ఎకరాల వరకు 22ఎ లిస్ట్ లో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి రైతులు తీసుకొచ్చారు. తక్షణమే అధికారులతో మాట్లాడి సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి




పథకాలు పై ప్రజలు సంతృప్తితో ఉన్నారని ఎమ్మెల్యే అన్నారు. రానున్న రోజుల్లో కూటమి అమలు చేయనున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి వెన్నా సాంబశివరెడ్డి ఎమ్మార్వో మండల పార్టీ అధ్యక్షులు మరియు నాయకులు మండల అధికారులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి యువశక్తి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

సత్తెనపల్లి టౌన్ , జనవరి 2, ప్రభాతవార్త : సత్తెనపల్లి పట్టణంలో శ్రీ వాసవి యువశక్తి కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక మాజీ మున్సిపల్ చైర్మన్ కొల్లిపర కాశీ విశ్వనాథం కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్థానిక శాసనసభ్యులు కన్నా లక్షీ మ్నారాయణ మరియు పార్లమెంటరీ పార్టీ ఉపాధ్యక్షులు దరువూరి నాగేశ్వరరావు పాల్గొని, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో శ్రీ వాసవి యువశక్తి కమిటీ ముందుండాలని ఆకాంక్షి ం చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు



మరియు పట్టణ ఆర్యవైశ్య . కె. నరసింహారావు, జె.వి సుబ్బారావు, కె. రాధాకృష్ణ, కె. రామకృష్ణ, గ్రంధి మోహన్, కె. సుబ్రహ్మణ్యం,యల్. రమేష్ బాబు, బి. శివ రంజిత్ కుమార్, యం. పుల్లారావు, సి హెచ్ అనిల్,వారితో పాటు పట్టణ ఆర్యవైశ్య సంఘం బాధ్యులు, ఇతర ప్రముఖులు ఈ ఆవిష్కరణలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అన్నదాతల బతుకులు మారాలన్నదే 'కూటమి' ధ్యేయం: ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, జనవరి 2, ప్రభాతవార్త: సత్తెనపల్లి రూరల్ మండలం రెంటపాళ్ళ గ్రామం నందు ప్రభుత్వ రాజముద్ర తో ఉన్న పాస్ పుస్తకాలను రైతులకు అందజేసినశాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ , జిల్లా టిడిపి అధ్యక్షులు జాన్ సైదా , వ్యవసాయం లాభసాటి కావాలి అన్నదాతల బతుకులు మారాలి అన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని కన్నా పేర్కొన్నారు. జగన్ హయాంలో ఆరాచక ,రాక్షస పాలన సాగిందన్నారు. .గత ప్రభుత్వంలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లింది.జగన్ ప్రభుత్వం భూకబ్జాలు చేసింది.తమ సొంత భూముల పట్టాదారు పాస్ పుస్తకాల పై జగన్ ఫోటో వద్దన్న రైతుల కోరిక మేరకు, ప్రభుత్వ రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. గతంలో పట్టాదారు పాసుపుస్తకం పైనే కాకుండా, సరిహద్దు రాళ్లపై కూడా జగన్ రూ.700 కోట్ల ప్రజా ధనంతో తన ఫోటో వేసుకున్నారని, రాష్ట్రంలో అందరి ఆస్తులు ,హక్కులు తనవేనని భావించిన జగన్ అని అన్నారు. పాట్టదారుపాసు పుస్తకాలపై దేశంలో ఎక్కడలేని విధంగా జగన్ పోటోలు వేశారని, జగన్ కు పిచ్చి



ముదిరి సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలు వేసిన పరిస్థితిఏర్పడిందన్నారు. వైసీపీ హయాంలో తమ ఆస్తులు తమవేమని చెప్పుకునే పరిస్థితి లేకుండా చేసే ప్రయత్నం అన్నారు. ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించిన శాసనసభ్యులు కన్నా ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రజలు. నా దృష్టికి సమస్యలు తీసుకొచ్చారు. సమస్యల తక్షణ పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అందరి సమస్యలు పరిష్కరిస్తామని, ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమం లో వివిధ హోదాల్లో వున్న ప్రభుత్వ అధికారులు మరియు రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## 'సజ్జల'ను కలిసిన చిట్టా విజయభాస్కరరెడ్డి



సత్తెనపల్లి, జనవరి 2, ప్రభాతవార్త: వైకాపా సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డిను ఆయన నివాసం లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన మీడియా ప్యానెలిస్ట్ చిట్టా విజయభాస్కరరెడ్డి ,గంగదాసు శ్రీధర్ రెడ్డి తదితరులు.

## విశ్వజనని పౌండేషన్ స్వర్ణనంది ఎక్సలెన్స్ అవార్డ్స్ కు 'దివ్వెల' ఎంపిక

సత్తెనపల్లి, జనవరి 2, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా, సత్తెనపల్లి పట్టణానికి చెందిన న్యాయవాది, తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆర్య వైశ్య సంఘ నాయకులు మరియి సేవారత్న అవార్డు గ్రహీత దివ్వెల శ్రీనివాసరావు హైదరాబాద్ కు చెందిన విశ్వజనని పౌండేషన్ సంస్థ ప్రకటించిన స్వర్ణ నంది ఎక్సలెన్స్ అవార్డు కు ఎంపిక అయినట్లు ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ బొగ్గారపు బ్రహ్మానందం ద్వారా తెలుకొన్నారు. ఈ అవార్డు ఈ నెల 4వ తేదీ (ఆదివారం ) మధ్యాహ్నం విజయవాడ లోని ఆలపాటి రామారావు, అనుముల లక్ష్మణరావు ఫంక్షన్ హాల్లో ప్రముఖుల చేతులమీదుగా అందుకోనున్నారు. దివ్వెల శ్రీనివాసరావు చేస్తున్న భరతమాత అన్నప్రసాద వితరణ సేవలు మరియు సమాజ సేవలు గుర్తించి ఇస్తున్నాం అని నిర్వాహకులు తెలిపారు. దివ్వెల కు పలువురు న్యాయవాదులు, ఆర్య వైశ్య సంఘ నాయకులు , పెద్దలు అభినందనలు తెలిపారు.



## అంకాళ్ళ ప్రభావతికి నివాళులర్పించిన వైకాపా సమన్వయకర్త డాక్టర్ 'గజ్జల'

సత్తెనపల్లి, జనవరి 2, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని 8వ వార్డుకు చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు సీనియర్ న్యాయవాది అంకాళ్ళ వెంకటేశ్వర్లు మాతృమూర్తి ప్రభావతి స్వర్గస్తులైనారు. సమాచారం తెలుసుకున్న



సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి సత్తెనపల్లి పట్టణంలోని ప్రభావతి గారి నివాసానికి వెళ్లి వారి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు.గుజ్జర్లపూడి నిరంజన్ ప్రకాష్ , పెద్దింటి నాగేశ్వరరావు, గుంటూరు జానీ, అచ్యుత శివ ప్రసాద్, వాకుమల్ల చెంచిరెడ్డి , గుజ్జర్లపురి సతీష్ , వలెం నరసింహారావు , సయ్యద్ గోర, మునావత్ ఏడుకొండలు , మణి బాబు , మర్రి సుబ్బారెడ్డి (అడ్వకేట్) , గార్లపాటి ప్రభాకర్ ,జొన్నల గడ్డ ఆనంద్, కాసిమల్ల మార్క్,యాసారపు బాబు ,జలీల్, నాగూర్ భాషా, ఖాసిం పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న యనుముల కేశవరెడ్డి



మాచర్ల, జనవరి 2 ప్రభాతవార్త: గుండెపోటుతో మరణించిన మూఢావత్ శ్రీనునాయక్ కుటుంబానికి యనుముల కేశవరెడ్డి ఆధ్వర్యంలో వంకాయలపాటి రాజీవ్‌కుమార్, నరేష్‌కుమార్ చేతుల మీదుగా రూ.10 వేలు ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. పట్టణంలోని 9వ వార్డుకు చెందిన మూడావత్ బాలునాయక్ గుండెపోటుతో అకాల మరణం చెందారు. వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న యనుముల కేశవరెడ్డి స్పందించి అంత్యక్రియల కోసం రూ.10 వేలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడం మన బాధ్యత అని పేర్కొన్నారు. శివారెడ్డి, శివాజీ, శ్రీను కల్వరి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ వైద్యసేవను సద్వినియోగం చేసుకోవాలి

**రేపల్లె, జనవరి 2, ప్రభాతవార్త:** ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ వసంతం వీరరాఘవయ్య అన్నారు. శుక్రవారం రేపల్లె పట్టణంలోని ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్‌లో ఎన్టీఆర్




వైద్య సేవలను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు, టిడిపి నాయకుడు అనగాని సత్యప్రసాద్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ వసంతం వీరరాఘ వయ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవలో నగదు రహిత నాణ్యమైన వైద్యం పొందవచ్చునని చెప్పారు. ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్ ఏర్పాటు చేసి 3 సంవత్సరాలైన సందర్భంగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవల నిర్వహణకు అనుమతి లభించింద న్నారు. ఈ వైద్యశాలలో నెలకు 80 సర్జరీలు, ప్రతి రోజూ 60 మంది రోగులకు వైద్య పరీక్షలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా ఆపరేషన్స్ చేయించుకునే అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. ఫోకస్ ఐ కేర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కాగిత కిషోర్‌బాబు మాట్లాడుతూ డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచితంగా నేత్ర పరీక్షలు, కంటికి సంబంధించిన ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. గుంటూరు, విజయవాడ ప్రాంతాలకే పరిమితమైన డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలు రేపల్లె పట్టణంలో అందుబాటులోకి వచ్చాయని ఆయన తెలిపారు. ఆపరేషన్ చేయించుకోవాల్సిన వారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు అందజేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మేక కోటేశ్వరరావు, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ వేములపల్లి రాజగోపాల్, కె.పిచ్చియ్య, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివ రావు, సయ్యద్ కరీముల్లా, యార్లగడ్డ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## రేపు హిందూ సమ్మేళనం

**పొన్నూరు, జనవరి 2, ప్రభాతవార్త:** ఈ నెల 4వ తేదీ ఉదయం 9గంటలకు స్థానిక భావనారాయణస్వామి దేవాలయంలో హిందూ సమ్మేళన కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ హైందవ సోదర సోదరీమణులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో భారత ధర్మదేవత బిరుదాంకితులు, శ్రీశైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ప్రధాన వక్తగా గుంటూరు విభాగ్ ప్రచారక్ గౌతమ్ పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హిందువులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# బాపట్ల జిల్లా వార్త



## పట్టాదారు పాసుపుస్తకాలపై కలెక్టర్‌లతో పిఎస్ వీడియో కాన్ఫరెన్స్

**బాపట్ల, జనవరి2, ప్రభాతవార్త:** రాష్ట్ర సచివాలయంలోని సి ఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అన్ని జిల్లా కలెక్టర్లు




తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ, ప్రజా సానుకూల అవగాహన, రైల్వే లెవెల్ క్రాసింగ్స్, ఎరువులు తదితర అంశాలపై శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశానికి బాపట్ల జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ భావన, డిఆర్ ఓ.జి.గంగాధర్ గౌడ్, జిల్లా కలెక్టరేట్ ఏ ఓ.మల్లిఖార్జున రావు, ఏడి ల్యాండ్, సర్వే, అల్తాఫ్, సివిల్ సప్లైస్ డిఎం శ్రీలక్ష్మి, ఇంచార్జి వ్యవసాయ అధికారిణి అన్నపూర్ణ, డియల్ డి ఓ.విజయలక్ష్మి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతినెల భవన నిర్మాణ కార్మికులకు సరుకులు అందజేత

**కర్లపాలెం, జనవరి02, ప్రభాతవార్త:** ప్రతినెల ఇద్దరు కార్మికులకు భవన నిర్మాణ కార్మికులు బియ్యం, సరుకులు, కూరగాయలు అందజేసా మని భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి మండల అధ్యక్షులు శవనం కోటిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరమును పురస్కరించుకొని 60 సంవత్సరములు దాటిన వయోవృద్ధులకు ప్రతి నెల ఒకటవ తారీఖున సహాయ సహకారాలు అందించాలని సంక్షేమ నిధి సభ్యులు తీర్మానం చేయడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా భవన నిర్మాణ కార్మికులు కర్లపాలెం తారకరామా నగర్ కు చెందిన తలపల శంకరమ్మ, ఎం వి రాజుపాలెం కు చెందిన ఆట్ల వెంకటేశ్వర్ రెడ్డి కి పాతిక కేజీలు




బియ్యం, కూరగాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంక్షేమ నిధి కోశాధికారి షేక్ సమ్మద్, కార్యదర్శి మరుప్రోలు గోపిరెడ్డి, షేక్ కరిముల్లా, ఆట్ల వెంకటేశ్వర్ రెడ్డి, షేక్ షంషుద్దీన్, పిట్టు కాసుల రెడ్డి, షేక్ ఇబ్రహీం, పఠాన్ యూనిస్ ఖాన్, షేక్ ఖాసిం పాల్గొన్నారు

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి స్పీకర్స్, సౌండ్స్‌బాక్సులు వితరణ

**పిట్టలవానిపాలెం, , జనవరి02, ప్రభాతవార్త:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల బలోపేతానికి దాతల సహాయ సహకారాలు ఎంతగానో దోహదపడ



తాయని విస్తరణ అధికారి కె.నాగేశ్వరరావు అన్నారు. మండల పరిదలోని చందోలు ప్రాదమిక ఆరోగ్య కేంద్రానికి దాతలు శుక్రవారం స్పీకర్స్‌ను అందించారు. ఈ సందర్భంగా విస్తరణాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ చందోలు గ్రామమాజి సర్పంచ్, మాజి సమితి ప్రెసిడెంట్ షేక్ ముగ్ధుం అతని భార్య మహమ్మద్ బేగం జ్ఞాపకార్థం, అతని కుమారుడు మహమ్మద్ హబీబ్ ఇక్బాల్ విశ్రాంత ఎస్ఐ చందోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, స్పీకర్ అండ్ సౌండ్ బాక్స్‌లు అందిం చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపర్వైజర్ యు నరసింహారావు, డాక్టర్, డాక్టర్ చంద్రిక, డాక్టర్ సుహాన, హెల్త్ అసిస్టెంట్, హసన్ జానీ, హాస్పిటల్ సిబ్బంది, మరియు ఆదర్శ గ్రామా కమిటీ తరపున మస్తాన్ బేగ్, తదితరులు పాల్గొన్నారు.

# జనవరి 4న చెరుకుపల్లి మండల కేంద్రంలో హిందూ సమ్మేళనం

**చెరుకుపల్లి, జనవరి 2, ప్రభాతవార్త :** రాష్ట్రీయ స్వయం సేవక్ సంగ్ ప్రారంభించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రతి సంఘ్ మండల కేంద్రంలో హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ రేపల్లె కండ కార్యవాహ్ ఉప్పు సాంబశివరావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఈ నెల 4 వ తేదీ ఆదివారం చెరుకుపల్లి ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు శోభాయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరుకుంటున్నట్లు బీజేపీ సభ్యులు రాంపల్లి జగన్నాథ శాస్త్రి , ఆర్యవైశ్య మండల అధ్యక్షులు విశ్వంశెట్టి శ్రీనివాసరావు కోరారు.

# రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం కేంద్రంపై చంద్రబాబు ఒత్తిడి తేవాలి : కేసన శంకరరావు

**రేపల్లె, జనవరి 2, ప్రభాతవార్త:** చట్టసభలు, స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల చట్టబద్ధత కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై ఉందని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ ప్రక్రియను పూర్తి చేయించాలన్నారు. అప్పుడే రాజ్యాంగం షెడ్యూల్ 9 ద్వారా పెరిగే బిసి రిజర్వేషన్లకు రాజ్యాంగ చట్టపర రక్షణ లభిస్తుందని ఆయన చెప్పారు. ఇలా చేస్తేనే బిసిలకు సామాజిక న్యాయం లభిస్తుందని తెలిపారు. బిసిల రక్షణ చట్టంతో పాటు పదోన్నతులలో రిజర్వేషన్లు, బ్యాక్లాగ్ పోస్టుల భర్తీ, 50 సంవత్సరాలకే సామాజిక పెన్షన్లు అమలు వంటి ఫలాలు బిసిలకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రంలో ప్రత్యేక ఒబిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను కేంద్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రత్యేక బడ్జెట్ కేటాయించే అవకాశం ఏర్పడి బిసిల సంక్షేమం నెరవేరుతుందని కేసన శంకరరావు వెల్లడించారు. చట్ట సభలలో ఒబిసి మహిళలకు సబ్ కోటానిస్తూ మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణ చేయాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలోని అన్ని రంగాలలో ఒబిసిల ఆర్థికాభివృద్ధి జరిగితీరాలన్నారు. వెనుకబడిన తరగతుల సాధికారితతోనే వికసిత్ ఆంధ్రప్రదేశ్, వికసిత్ భారత్ సాధ్యమని ఆయన పేర్కొన్నారు. చిరకాలంగా నిర్వహిస్తున్న బిసి ఉద్యమాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం జన గణనతో పాటు కుల గణనకు సిద్ధమవుతున్నదన్నారు. బిసి సంక్షేమ సంఘం పోరాటాల ఫలితంగానే కూటమి ప్రభుత్వం బిసిలకు ఎన్నికలప్పుడు వాగ్దానాలిచ్చి అధికారంలోకి వచ్చిందని శంకరరావు చెప్పారు. వాగ్ధానాలకే పరిమితం కారాదని చిత్తశుద్ధితో అమలు చేస్తేనే బిసిలకు న్యాయం జరుగుతుందని ఆయన గుర్తు చేశారు. డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి సమగ్ర కుల గణన పేర్తి చేయించాలని శంకరరావు డిమాండ్ చేశారు. అణగారిన వర్గాల క్షేమం కోరుతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు అనేక రూపాలలో ఉద్యమాలు నిర్వహించామని ఆయన తెలియజేశారు. ఉద్యమాలలో బిసి నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, విద్యార్థులు, కార్మికులు సంఘటితంగా వ్యవహరించటం ప్రశంసనీయమని శంకరరావు అభినందించారు. భారత దేశంలో సుమారు 3 వేల కులాలు, 25 వేల ఉప కులాలు ఉండగా వెనుకబడిన తరగతుల వారు గణనీయమైన సంఖ్యలో ఉన్నారని ఆయన వివరించారు.

# మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు

**కొల్లిపర, జనవరి 2, ప్రభాతవార్త:** మాదక ద్రవ్యాల జోలికి వెళ్ళి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్ఐ ప్రసాద్ చెప్పారు. శుక్రవారం మండలంలోని తూములూరులో డ్రగ్స్ నిరోధంపై పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ




సందర్భంగా ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ డ్రగ్స్ నిరోధంపై అవగాహనకు సంకల్పబలమే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. డ్రగ్స్, గంజాయి వలన యువత భవిష్యత్తు నిర్వీర్యమవుతుందని ఆయన చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సన్మార్గంలో నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నా, డ్రగ్స్ వినియోగిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారమి వ్వాలని ఆయన ఆదేశించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజాన్ని సాధించేందుకు ప్రజల సహకారం అవసరమని ఎస్ఐ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

**కొల్లిపర, జనవరి 2, ప్రభాతవార్త :** ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విఆర్ఓలు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని మండల తహశీల్దార్ సిద్ధార్థ ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విలేజ్ సర్వేయర్లు, విఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రజల నుంచి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. గ్రీవెన్స్ లో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, మండల సర్వేయర్ హరికృష్ణ, ఆర్ఐ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# తల్లిదండ్రుల ఆశయం నెరవేరుస్తున్న చిరువ్యాపారి

**తెనాలి టౌన్ జనవరి2(ప్రభాతవార్త):** కన్న తల్లిదండ్రుల ఆశయం కొనసాగిస్తూ, వారు లేకపోయినా, వారి పేరుమీద సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న కుమారుడి వైనం. పట్టణానికి చెందిన కటకంశెట్టి ఏడుకొండలు



తన తండ్రి మరణించి 23సంవత్సరాలు ఐనా, తన తండ్రి కటకంశెట్టి చిన్న వీరయ్య జ్ఞాపకార్థంగా, ఏటా అన్నదానకార్యక్రమం నిర్వహిస్తున్నాడు. శుక్రవారం స్థానిక జెఎంజె కాలేజీకి చెందిన స్వధార్ శక్తి సదన్ లో ఆశ్రయం పొందుతున్న మహిళలు, యువతులు, చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కటకంశెట్టి చిన్న వీరయ్య 23వ వర్ధంతి సందర్భంగా ఆయన జా..పకార్థం కుమారుడు కటకంశెట్టి ఏడుకొండలు, మల్లీశ్వరి దంపతులు ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. శక్తి సదన్ లో ఉంటున్న 70 మందికి అన్నదానం చేశారు. ప్రభుత్వ వైద్యశాల వద్ద చిన్నపాటి టిఫిన్ బండి నిర్వహించుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే ఏడు కొండలు తన తల్లిదండ్రు చిన వీరయ్య , అనసూర్యమ్మల జా..పకార్థం 23 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. గతంలో ఆస్పత్రిలో రోగులకు, వారి సహాయకులు ఉచితంగా అల్పాహారం పంపిణీ చేయడం, పేదలకు దుస్తులు, దుప్పట్లు అందజేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సంవత్సరం శక్తి సదన్ లో మధ్యాహ్న భోజనం అందజేయడంతో పాటు ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వారికి నెలలో ఒకరోజు ప్రతి నెలా ఉదయం అల్పాహారం తన టిఫిన్ బండి వద్ద నుండి పంపిస్తానని శక్తి సదన్ నిర్వాహకులకు ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కటకంశెట్టి ఏడుకొండలు, వారి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. తన తండ్రి సూచించిన దాని ప్రకారం తనకు ఉన్నంతలో ఇతరులకు సహాయం చేస్తున్నట్లు ఏడుకొండలు తెలియజేశారు. జన్మనిచ్చి, పెంచి, పెద్ద చేసిన తల్లిదండ్రులను ఎవరు నిర్లక్ష్యం చేయవద్దని, వృద్ధాప్య దశలో వారిని జాగ్రత్తగా చూసుకోవాలని ఏడుకొండలు కోరారు. కుటుంబ సభ్యులు కటకంశెట్టి మల్లేశ్వరి, గోపికృష్ణ, అనంతశెట్టి నిరంజన్ కుమార్, అనూరాధ, నంద, కావ్యాంజలి తదితరులు పాల్గొన్నారు.

## గోపాలం సీతారావమ్మకు నివాళులర్పించిన వరికూటి అశోక్‌బాబు

**వేమూరు జనవరి 2 (ప్రభాతవార్త) :** వేమూరు నియోజకవర్గం వేమూరు మండలం చావలి గ్రామానికి చెందిన వైఎస్ఆర్‌సిపి సీనియర్



నాయకులు గోపాలం రాంప్రసాద్ మాతృమూర్తి సీతారావమ్మ ఇటీవల స్వర్గస్తులైనారు. సీతారావమ్మ పెద్ద కర్మ సందర్భంగా వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, వైసీపీ నాయకులతో కలిసి గోపాలం సీతారావమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

# గోదా అమ్మవారి నగరోత్సవం

**రేపల్లె, జనవరి 2, ప్రభాతవార్త:** పట్టణంలోని రైలుపేటలో కొలువుదీరిన పట్టాభి రామస్వామి ఆలయంలో శుక్రవారం ధనర్మాస పూజలు జరిగాయి. గోదా అమ్మవారికి విశేష పూజలు చేశారు. రంగనాథ స్వామిని నిత్యం



పూజించి స్వామి అనుగ్రహం కోసం నెల రోజుల పాటు వివిధ రకాల పూజలను నిర్వహించే ప్రక్రియలో భాగంగా పల్లకిలో గోదాదేవి అమ్మవారిని ఉంచి నగరోత్సవం నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ, పసుపు, పండ్లు నివేదించిన భక్తులు మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టాభి రామస్వామి దేవాలయం కమిటీ సభ్యులు తటవర్తి విజయ్‌కుమార్, రాధికారాణి, సంపత్ కుమార్, జి.సూర్యప్రకాష్, సుధాకర్, పి.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.


# హార్బర్ వద్ద కాలవలో పడి మత్స్యకారుడు గల్లంతు



**నిజాంపట్నం, జనవరి 2, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నిజాంపట్నం హార్బర్ వద్ద కాలవలో మత్స్యకారుడు గల్లంతైన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రాములు అనే మత్స్యకారుడు తాను పనిచేసే బోటు ఫ్యాన్ చెక్ చేయటానికి హార్బర్ జెట్టీ సమీపంలోని కాలవలోకి దిగాడు. రాములు ఎంత సేపటికి బయటకు రాకపోవటంతో తోటి మత్స్యకారులు గాలింపు చేపట్టారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బొమ్మిడి రామకృష్ణ, బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావులు పర్యవేక్షిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సిబ్బంది సమయపాలన పాటించకుంటే చర్యలు

**కొల్లిపర, జనవరి 2, ప్రభాతవార్త:** విధి నిర్వహణలో సమయపాలన పాటించని ఉద్యోగుల పై చర్యలు ఉంటాయని ఇన్‌ఛార్జి ఎంపిడిఓ దానయ్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని



బొమ్మువానిపాలెం, అన్నవరం గ్రామాలలోని సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా దానయ్య మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది బాధ్యతతో పనిచేయాలన్నారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే కార్యక్రమాన్ని సచివాలయ సిబ్బంది వేగవంతం చేయాలని ఆయన సూచించారు. గ్రామాలలో పారిశుధ్యం మెరుగుదలపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి ఉంచాలని ఆయన కోరారు.

# బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావుకు సత్కారం

రేపల్లె, జనవరి 2, ప్రభాతవార్త:అహర్నిశలు వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం శక్తి వంచన లేకుండా ఉద్యమిస్తున్న ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావును బిసి వర్గాలు ఘనంగా సన్మానించాయి. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కేసన శంకరరావు స్వగ్రామమైన రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నం మండలం బొ ర్రావారిపాలెంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పేదలు, బడుగు వర్గాల ఆరాధ్య నాయకునిగా భావిస్తున్న ఆయా వర్గాల నాయకులు గజమాలలు బొకేలు, శాలువాలతో శంకరరావును సత్కరించారు. కేసన సేవలను కొనియాడారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. తనను సన్మానించిన వారికి శంకరరావు కృతుతలు తెలిపారు. ఈ కార క్రమంలో బొర్రావారిపాలెం సర్పంచ్ కేసన నాగముత్యాలమ్మ, ఎంపిటిసి బొర్రా బుడారంకయ్య, కాగితాల సుబ్బారావు, టి. బుచ్చిరామకృష్ణ, జుజ్జువరపు సురేష్, అనగాని హరికృష్ణ, కృష్ణారావు, చింతల ప్రసాద్, రాఘవయ్య, ఏడుకొండలు, శ్రీనివాసమూర్తి, సాయిబాబు, చినబాబు, కూరపాటి రాజు తదితరులు పాల్గొని కేసన శంకరరావు సేవలను ప్రస్తావిస్తూ ప్రసంగించారు. ఆయురారోగ్యాలతో ఉంటూ బిసిల అభివృద్ధికి పాటుపడాలని వక్తలు ఆకాంక్షించారు.



# బ్రిడ్జి కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలి

**నిజాంపట్నం, జనవరి 2, ప్రభాతవార్త:** ఐటిఐ రెండు సంవత్సరముల కోర్సులు ఉత్తీర్ణులైన విద్యార్థులు నేరుగా పాలిటెక్నిక్ రెండవ సంవత్సరంలో ప్రవేశం పొందుటకు నిజాంపట్నం ప్రభుత్వ ఐటిఐలో బ్రిడ్జి కోర్సును నిర్వహిస్తున్నామని ప్రధానాచార్యులు పి ఉమామహేశ్వరిదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ బ్రిడ్జి కోర్సు 05-01-2026 నుంచి 04-02-2026 వరకు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈనెల 4వ తేదీలోగా సమర్పించాలని 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు కార్యాలయ పనివేళలలో జి వెంకటేశ్వరరావు(9963509246)ను, టి రాకేష్(9885304584), జివిఆర్ఎన్ ప్రసాదరావు(8309914256)లను సంప్రదించాలని ఆమె కోరారు.

# నేడు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

**రేపల్లె, జనవరి 2, ప్రభాతవార్త:** పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో శనివారం సాయంత్రం 5 గంటలకు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, విద్యావేత్త సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం జరుగుతుందని శుక్రవారం నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గంలోని బాబా సాహెబ్ అంబేద్కర్ ఉద్యోగ, రాజకీయ, యువజన, బహుజన సంఘాల నాయకులు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

# పేదల విద్యా వైద్యానికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, జనవరి 2, ప్రభాతవార్త:** పేదల విద్యా వైద్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసి ఎంతో మంది పేదలకు ఆసరాగా నిలుస్తోందని



ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండల పరిధిలోని చింతలపూడి ఎమ్మెల్యే స్వగృహంలో నూతనంగా మంజూరైన పించన్‌ను శుక్రవారం లబ్దిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన అన్ని వాగ్దానాలను నెరవేర్చి సూపర్ సిక్స్ సూపర్ హిట్‌గా నిలిచిందన్నారు. డయాలసిస్ పేషెంట్లకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అందులో భాగంగా మండల పరిధిలోని వల్లభరావుపాలెం గ్రామానికి చెందిన డక్కుమళ్ళ సాయిచరణ్‌కు ప్రభుత్వం నుండి రూ.10వేలు పెన్షన్‌ను మంజూరు చేసింది. ఈ పెన్షన్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్దిదారునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వేజెండ్ల ఏకాంబారేశ్వరరావు, బొద్దులూరి వెంకటేశ్వరరావు, మదమంచి వీరయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

**భట్టిప్రోలు(రేపల్లె), జనవరి 2, ప్రభాతవార్త:** సమాజ శ్రేయస్సుకు వాసవి క్లబ్ పురోభివృద్ధికి పాటుపడాలని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం అధ్యక్షుడు తూనుగుంట్ల సాయిబాబా అన్నారు. శుక్రవారం భట్టిప్రోలులోని సాయికృష్ణ కళావేదికలో జరిగిన సమావేశానికి వాసవీక్లబ్ పూర్వ అధ్యక్షుడు బి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. నూతన అధ్యక్షుడిగా తూనుగుంట్ల నాగభూషణం, కార్యదర్శిగా చెన్న వెంకటేశ్వరరావు, కోశాధికారిగా



ఎం.జగదీష్, మహిళా క్లబ్ అధ్యక్షురాలిగా పెనుగొండ నాగరాజకుమారి, కార్యదర్శిగా శిరం పద్మావతి, కోశాధికారిగా శిరం మాధురిలు ఎన్నికయ్యారు. వీరితో జిల్లా నూతన గవర్నర్ నంబూరు నాగభూషణం ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సత్యప్రసాద్, తమ్మన రమేష్‌బాబు, మురళీధర్, చెన్న వెంకట ఉమామహేశ్వరరావు, తూనుగుంట్ల శ్రీధర్, శనగపల్లి శ్రీనివాస ప్రసాద్ గుప్తా, తూనుగుంట్ల ఈశ్వరబాబు, తూనుగుంట్ల వెంకటేశ్వరగుప్తా, బి.రామ ప్రసాద్, మాజీ అధ్యక్షులు, క్లబ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ షిరిడీ సాయిబాబా జయంతి వేడుకలు

**భట్టిప్రోలు(రేపల్లె), జనవరి 2, ప్రభాతవార్త:** స్థానిక శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో బాబా జయంతి వేడుకలు శుక్రవారం జరిగాయి. శ్రీ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నగర సంకీర్తనలు జరిగాయి. జ్యోతి ప్రజ్వలన చేశారు. ఏకాదశి ఉత్తరాభిషేకం, ఉపనిషత్, కైవల్య ఉపనిషత్ అంశాలపై ప్రవచనం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం అధ్యక్షురాలు బి.అరుణ



కుమారి, టి.చాముండేశ్వరి, వీరాంజ నేయులు, మానేపల్లి సుబ్బారావు, నాగభూషణరావు, కృష్ణకుమారి, దేవస్థానం అధ్యక్ష కార్యదర్శులు తమ్మన రమేష్‌బాబు, ఎం.సాంబశివరావు, బి.కిరణ్‌కుమార్, బొలిశెట్టి శ్రీనివాసరావు, జవ్వాది వెంకటేశ్వరరావు, చుండూరు గోపాలకృష్ణ, పూర్ణచంద్రరావు, బి.రమేష్‌బాబు, సిహెచ్.పాపారావు తదితరులు పాల్గొనా న్నరు.

# ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన ర్యాలీ

**కొల్లూరు, జనవరి 2 (ప్రభాతవార్త) :** మండల కేంద్రమైన కొల్లూరులో పంచాయితీ కార్యాలయం వద్ద శుక్రవారం పంచాయితీ కార్యదర్శి శంకరరావు ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రణపై తమ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఢిల్లీని కమ్మేసిన పొగమంచు



**అటు చలిగాలులు తీవ్రతరం.. ఇటు ప్రమాదస్థాయిలో వాయు కాలుష్యం**
**హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ అదే పరిస్థితి**
**పలు విమానాలు, రైళ్లు రద్దు, రోడ్డు రవాణాకు అంతరాయం**
**6 వరకు ఇదే పరిస్థితి: ఐఎండి హెచ్చరిక**

**న్యూఢిల్లీ, జనవరి 2:** దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. అటు చలిగాలుల తీవ్రత పెరిగింది. దీనికి తోడు ప్రమాదకర స్థాయిలో వాయు కాలుష్యం. హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భారత వాతావరణ శాఖ (ఐఎండి) అధికారుల సమాచారం మేరకు రాబోయే రోజుల్లో చలిగాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశముంది. అలాగే దట్టమైన పొంగమంచు ఉంటుందని అంచనా వేసింది. కాలుష్యం కూడా బాగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. హిమాలయ ప్రాంతాలలో హిమపాతం, చల్లని గాలుల తీవ్రత 6వ తేదీ వరకు ఎక్కువగా ఉంటుందని ఐఎండి హెచ్చరిక జారీ చేసఇంది. కాలుష్య నియంత్రణ అధికారుల ప్రకారం, శుక్రవారం ఉదయం నగరంలో ఏక్యూఐ లెవెల్స్ 386గా నమోదైంది. 26 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో గాలి నాణ్యత వెరీ పూర్ కేటగిరీలో నమోదైనట్లు పేర్కొది. అత్యధికంగా ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 423గా నమోదైంది. అయితే దట్టమైన పొగమంచు రాజధానిలో అనేక ప్రాంతాల్లో దృశ్యమానత గణనీయంగా పడిపోయింది. సఫ్దర్‌జంగ్, పాలం వద్ద దృశ్యమానత 50 మీటర్లకు పడిపోయింది. మధ్యాహ్న సమయానికి 60 మీటర్లకు స్వల్పంగా మెరుగుపడింది. దీనికి తోడు తీవ్రమైన చలిగాలులతో ఢిల్లీ వాసుల సాధారణ జీవనానికి తీవ్ర ఇబ్బందులు కలిగిం చింది. రైళ్లు, విమానాల రాకపోకలకు అంత రాయం కలిగించింది. డజన్ల కొద్దీ విమానాలు రద్దు కాగా, 80కి పైగా రైళ్లు ఆలస్యంగా నడు స్తున్నాయి. ఇంకొన్నిం టిని అధికారులు దారి మళ్లించారు. పొగమంచు విపరీతంగా కురుస్తున్నం దున విజిబిలిటీ తగ్గిపోవడంతో పలు విమానాలను రద్దు చేస్తున్నట్లు ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు ప్రకటించాయి. విమానాల రద్దుతో ప్రభావితమైన ప్రయాణికులు ఆన్‌లైన్‌లో రీబుక్ చేసుకోవచ్చుని, లేదంటే డబ్బు వాపసు పొందవచ్చని తెలిపాయి.

**హైదరాబాద్‌లోనూ దట్టమైన పొగమంచు.. స్తంభించిన ట్రాఫిక్**

హైదరాబాద్ శివారు ప్రాంతాలను శుక్రవారం తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కమ్మేసింది. మంచు తీవ్రత ఎక్కువగా ఉండటంతో రోడ్లు, భవనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం, నాగార్జునసాగర్ హైవే, మేడ్చల్, తూంకుంట, శామీర్‌పేట, గండిపేట, మోకిల, పటాన్‌చెరు, వికారాబాద్, రాజేంద్రనగర్, ఆదిబట్ల తదితర ప్రాంతాల్లో జీరో విజిబిలిటీ నమోదైంది. దీంతో ఉదయాన్నే రోడ్లెక్కిన వాహనదారులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొగమంచు కారణంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంతో పాటు బెంగళూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డు పక్కనే నిలిపివేశారు. ఫలితంగా శంషాబాద్ నుంచి పాలమాకుల వరకు సుమారు 10 కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. అటు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ ఆర్)పై కూడా మంచు ప్రభావం ఎక్కువగా ఉండటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై కూడా ఇదే పరిస్థితి. విజిబిలిటీ పూర్తిగా తగ్గిపోవడంతో వాహనదారులు హెడ్ లైట్లు, ఇండికేటర్లు వేసుకుని నెమ్మదిగా వెళ్లాల్సి వచ్చింది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉండటంతో వాహనదారులు ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు.



## ఇరాన్‌లో ఖమైనీకి వ్యతిరేకంగా భారీ నిరసన ప్రదర్శనలు,

### ఏడుగురు మృతి, వందలాది మందికి గాయాలు

**టెహ్రాన్, జనవరి 2:** ఇరాన్ సర్వోన్నత నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీకి వ్యతిరేకంగా సాగుతున్న నిరసనలు 2026 నూతన సంవత్సరం వేళ హింసాత్మకంగా మారాయి. పెరుగుతున్న నిత్యావసర ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుదలపై సామాన్యులు మొదలుపెట్టిన ఈ పోరాటం ఇప్పుడు ఇరాన్ వ్యాప్తంగా ఉన్న పల్లెలకు కూడా పాకింది. ఒకవిధంగా చెప్పాలంటే ఇరాన్‌లోకూడా జెన్‌జడ్ ఉద్యమం తీవ్రస్థాయికి చేరుతున్నట్లు స్పష్టం అవుతోంది. ఆందోళనల్లో యువత ఎక్కువగా పాల్గొంటుండటమే ఇందుకు నిదర్శనం. వారం రోజులుగా జరుగుతున్న ఘర్షణల్లో ఇప్పటివరకు ఏడుగురు మరణించగా, వందలాది మంది గాయపడినట్లు తేలింది. టెహ్రాన్ యూనివర్సిటీ విద్యార్థులు రోడ్లపైకి వచ్చి సర్వాధికారికి మరణం అంటూ నినాదాలు చేశారు. 1979 ఇస్లామిక్ విప్లవం కంటే ముందు ఇరాన్‌ను పాలించిన షా మహమ్మద్ రెజా పహ్లావీ కుమారుడు రెజా పహ్లావీకి నిరసనకారులు మద్దతు పలకడం విశేషం. ప్రస్తుతం అమెరికాలో ప్రవాసంలో ఉన్న రెజా పహ్లావీ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ విజయం మనదే ఎందుకంటే మన పోరాటం న్యాయమైనది అంటూ నిరసనకారులకు సంఘీభావం ప్రకటించారు. 1979 ఇస్లామిక్ విప్లవం సందర్భంగా పదవీచ్యుతుడైన అమెరికా మద్దతుదారు షా మొహమ్మద్ రేజా పహ్లావీ కుమారుడు రేజా పహ్లావీకి అనుకూలంగా విద్యార్థులు నినాదాలు చేశారు. టెహ్రాన్ వ్యాప్తంగా షాకు కీర్తిస్తూ నినాదాలు మార్మోగిన దరిమిలా అమెరికాలో ప్రవాస జీవితాన్ని గడుపుతున్న రేజా పహ్లావీ ఎక్స్ వేదికగా స్పందించారు. తాను మీతోనే ఉన్నానని, తమ పోరాటం న్యాయమైనది కాబట్టి విజయం తమదేనని ఆయన నిరసనకారులను ఉద్దేశించి ప్రకటించారు. ఇరాన్ రియాల్ విలువ డాలర్‌తో పోలిస్తే సగానికి పడిపోవడం, ద్రవ్యోల్బణం 42.5 శాతానికి చేరడంతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. లోర్డెగాన్, కుహదాష్త్, ఇస్ఫహాన్ వంటి నగరాల్లో భద్రతా బలగాలకు, నిరసనకారులకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ జరుగుతోంది. కుహదాష్త్‌లో జరిగిన ఘర్షణలో బాసిజ్ పారామిలిటరీ దళానికి చెందిన అమీర్ హుస్సామ్ ఖోదయారీ ఫర్ద్ అనే వ్యక్తి మరణించగా, మరో 13 మంది గాయపడ్డారు. పరిస్థితి విషమిస్తుండటంతో ఇరాన్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఒకవైపు భద్రతా చర్యలు చేపడుతూనే, మరోవైపు చర్చలకు సిద్ధమని ప్రకటించింది. వర్తక సంఘాల ప్రతినిధులతో నేరుగా మాట్లాడతామని ప్రభుత్వ అధికార ప్రతినిధి ఫాతిమా మొహజెరానీ తెలిపారు. కాగా, నిరసనకారులను అణచివేయడానికి ఇరాన్ ఇంటర్నెట్ సేవలను కూడా కొన్ని ప్రాంతాల్లో నిలిపివేసింది.



## నీరు కాదు విషాన్ని పంచారు..

### ఇండోర్ మరణాలపై రాహుల్‌గాంధీ ఆందోళన

**న్యూఢిల్లీ, జనవరి 2:** కలుషిత నీరు తాగి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ ఘటనపై తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. అక్కడి ప్రభుత్వం నీరు కాకుండా విషాన్ని పంపిణీ చేస్తోందని మండి పడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్టించుకోకుండా కుంభ కర్ణుడిలా నిద్రపోతోందని రాహుల్ విమర్శించారు. కలుషిత నీరు తాగడం వల్ల చాలా మంది ఇళ్లలో విషాదం నెలకొందని పేదలు నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. దీనికి తోడు అధికార బిజెపి నేతలు నిర్లక్ష్యపు ప్రకటనలు చేయడాన్ని తప్పుబట్టారు. బాధిత కుటుంబాలకు ఓదార్పు ఇవ్వకుండా అహంకారంతో వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. మురికిగా, దుర్వాసన వస్తోన్న నీటి గురించి గతంలో ప్రజలు పదే పదే ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదు? తాగే నీటిలో మురుగునీరు ఎలా కలిసింది? వెంటనే నీటి సరఫరా ఎందుకు ఆపలేదు? బాధ్యులైన అధికారులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారు? అని రాహుల్ ప్రశ్నించారు. పరిశుభ్రమైన నీరు పొందడం ప్రజల హక్కు అని అన్నారు. ఈ హక్కును కాలరాసిన బిజెపి ప్రభుత్వమే ఇందుకు పూర్తి బాధ్యత వహించాలన్నారు. దుష్పరిపాలనకు మధ్యప్రదేశ్ కేంద్రంగా మారిందని విమర్శించారు. మొన్నటి వరకు దగ్గు మందు కారణంగా, ఆ తర్వాత ప్రభుత్వాసుపత్రుల్లో ఎలుకల వల్ల పిల్లలు ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పుడు కలుషిత నీరు కారణంగా మృతి చెందుతున్నారన్నారు. ఇలా ఎప్పుడు పేదలు మరణించినా మోడీజీ మాత్రం మౌనంగా ఉంటారన్నారని విమర్శించారు. ఇక ఓ మరుగుదొడ్డి వద్ద మంచినీటి పైపులైన్ లీకేజ్ వల్లే ఈ మరణాలు చోటుచేసుకుంటున్నాయని నగర మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తాజాగా తెలిపారు.

## గిగ్‌వర్కర్లకు మేలుచేసే నాలుగు కొత్త లేబర్‌కోడ్‌లు



**న్యూఢిల్లీ, జనవరి 2:** గిగ్ వర్కర్లకు సైతం మేలుచేసేవిధంగా కేంద్రం నాలుగు కొత్త కార్మిక చట్టాలకు (లేబర్ కోడ్స్) సంబంధించిన ముసాయిదా నిబంధనలను కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. ఈ కొత్త విధానం ద్వారా తొలిసారిగా గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్లు అంటే ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, క్యాబ్ డ్రైవర్లు వంటివారినికూడా సామాజిక భద్రత పరిధిలోకి తీసుకువస్తున్నారు. వారికి కనీస వేతనం, ఆరోగ్యం, వృత్తి భద్రత వంటి ప్రయోజనాలు అందనున్నాయి. ఏప్రిల్ 1 నుంచి ఈ కొత్త చట్టాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముసాయిదా నిబంధనల ప్రకారం ఈ ప్రయోజనాలు పొందాలంటే గిగ్ వర్కర్లు కొన్ని షరతులను పాటించాల్సి ఉంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకే సంస్థ (అగ్రిగేటర్)తో కనీసం 90 రోజులు పనిచేసిన వారు సామాజిక భద్రత పథకాలకు అర్హులవుతారు. ఒకటి కంటే ఎక్కువ సంస్థలతో పనిచేసే వారికి ఈ పరిమితిని 120 రోజులుగా నిర్ణయించారు. ఒకే రోజులో ఒక వర్కర్ వేర్వేరు సంస్థల కోసం పనిచేస్తే, ఆ పనిదినాలను వేర్వేరుగా లెక్కిస్తారు. ఉదాహరణకు ఒకే రోజు ముగ్గురు అగ్రిగేటర్లతో పనిచేస్తే, దానిని మూడు పని దినాలుగా పరిగణిస్తారు. ఈ కొత్త చట్టాల ద్వారా మరికొన్ని ముఖ్యమైన మార్పులు కూడా రానున్నాయి. ఇకపై అన్ని రంగాల ఉద్యోగులకు యాజమాన్యాలు తప్పనిసరిగా నియామక పత్రాలు (అపాయింట్‌మెంట్ లెటర్లు) ఇవ్వాల్సి ఉంటుంది. దీనివల్ల ఉద్యోగ భద్రత, పారదర్శకత పెరుగుతాయి. అలాగే ఇప్పటివరకు కొన్ని నిర్దిష్ట పరిశ్రమలకే పరిమితమైన కనీస వేతనం, ఇకపై అన్ని రంగాల కార్మికులకు చట్టబద్ధంగా వర్తిస్తుంది. అధిక వేతనాలు, మెరుగైన పని పరిస్థితులు కోరుతూ గిగ్ వర్కర్లు సమ్మెకు దిగడానికి ఒక రోజు ముందు, అంటే గత ఏడాది డిసెంబరు30న ఈ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల కావడం గమనార్హం. ప్రస్తుతం ఈ ముసాయిదాపై భాగస్వామ్య పక్షాల నుంచి కేంద్ర ప్రభుత్వం అభిప్రాయాలను స్వీకరిస్తోంది.

## అంగారక గ్రహంపై నీటి గుహలు!



**న్యూయార్కు, జనవరి 2:** అంగారక గ్రహంపై నీటి గుహలను చైనా శాస్త్రవేత్తలు గుర్తించారు. హెబ్రుస్ వాలీస్ ప్రాంతంలో ఆ గుహలు ఉన్నట్లు తేల్చారు. నీటి వల్ల గుహలు ఏర్పడినట్లు అంచనా వేస్తున్నారు. భూమి కాకుండా మరో గ్రహంపై నీటి గుహలను గుర్తించడం ఇదే మొదటిసారి. మార్స్ గ్రహంపై అగ్నిపర్వతాల ద్వారా ఏర్పడిన గుహలను గతంలో గుర్తించారు. కానీ రాళ్లలోని రసాయనాల వల్ల నీటి గుహలు ఏర్పడినట్లు తాజా రిపోర్టులో తేల్చారు. 'ద ఆస్ట్రోఫిజికల్ జనరల్ లెటర్స్'లో ఈ స్టడీకి చెందిన నివేదిక ఇచ్చారు. నీటి గుహల ఆవిష్కరణ మార్స్ గ్రహంపై జీవం ఉందన్న ఆధారాలను స్టడీ చేసేందుకు ఊతం ఇచ్చేలా ఉన్నది. ఎన్నో ఏళ్ల క్రితమే ఈ గుహలు ఏర్పడినట్లు తేల్చారు. భవిష్యత్తు అన్వేషణలకు ఈ గుహలను స్టడీ చేయనున్నారు. 2025 అక్టోబర్ 30న ఆ అధ్యయనానికి చెందిన డేటాను పబ్లిష్ చేశారు. నాసా శాటిలైట్ల నుంచి సేకరించిన డేటా ఆధారంగా చైనా శాస్త్రవేత్తలు రిపోర్టు ఇచ్చారు.

## ప్రతి ఒక్కరూ ఇంట్లో మాతృభాషనే మాట్లాడాలి!

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్

**ముంబయి, జనవరి 2:** దేశంలో భాషా వివాదం ముదురుతున్న తరుణంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతి భారతీయుడు తన సొంత భాషను గౌరవించాలని ముఖ్యంగా కుటుంబ సభ్యులతో మాతృ భాషలోనే సంభాషించాలని ఆయన కోరారు. భాషా వైవిధ్యం దేశానికి బలం కావాలి తప్ప బలహీనత కాకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంగ్లీష్‌తో అన్నీ సాధ్యం కాదని ఆయన అన్నారు. ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న భగవత్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలోని లోతైన అర్థాలను వివరించడానికి ఇంగ్లీష్ భాషలో తగిన పదజాలం లేదని అన్నారు. ఉదాహరణకు కల్పవృక్షం అనే పదాన్ని ఇంగ్లీష్‌లోకి అనువదిస్తే దాని అసలు అర్థం, ఆధ్యాత్మికత దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. కేవలం ఇంగ్లీష్ మీడియం చదువుల వల్ల భాషలు అంతరించిపోవని ఇంట్లో మాతృభాషలో మాట్లాడటం మానేయడం వల్లనే ప్రాంతీయ భాషలకు ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కులం, మతం, సంపద లేదా భాష ఆధారంగా అంచనా వేయకూడదని భగవత్ సూచించారు. "భారతదేశం అందరిదీ ఇక్కడ పుట్టి, ఈ దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ భారతీయులే" అని ఆయన స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక వేత్తలు కూడా ఇప్పుడు ఇంగ్లీష్‌ను ఆశ్రయించాల్సి రావడం మన భాషల పట్ల పెరుగుతున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని అన్నారు. నైతిక విలువలు, సంప్రదాయాలు తదుపరి తరాలకు అందాలంటే మాతృభాషను కాపాడుకోవడం ఒక్కటే మార్గమని ఆయన ఉద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. మాతృభాషపై భగవత్ చేసిన సూచనలను పలువురు ఆహ్వానిస్తుండగా మరికొందరు మాత్రం తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఇంగ్లీషు భాష మాట్లాడడం బాగా అలవాటు అవ్వాలంటే ఇంట్లో కూడా ఆ భాషలోనే మాట్లాడాలంటూ పలువురు సూచిస్తున్నారు. అభిప్రాయపడ్డారు. ఇంగ్లీష్ తో అన్నీ సాధ్యం కాదని ఆయన అన్నారు. ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న భగవత్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలోని లోతైన అర్థాలను వివరించడానికి ఇంగ్లీష్ భాషలో తగిన పదజాలం లేదని అన్నారు. ఉదాహరణకు కల్పవృక్షం అనే పదాన్ని ఇంగ్లీష్‌లోకి అనువదిస్తే దాని అసలు అర్థం, ఆధ్యాత్మికత దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు. కేవలం ఇంగ్లీష్ మీడియం చదువుల వల్ల భాషలు అంతరించిపోవని ఇంట్లో మాతృభాషలో మాట్లాడటం మానేయడం వల్లనే ప్రాంతీయ భాషలకు ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలను కులం, మతం, సంపద లేదా భాష ఆధారంగా అంచనా వేయకూడదని భగవత్ సూచించారు. "భారతదేశం అందరిదీ ఇక్కడ పుట్టి, ఈ దేశాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరూ భారతీయులే" అని ఆయన స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక వేత్తలు కూడా ఇప్పుడు ఇంగ్లీష్‌ను ఆశ్రయించాల్సి రావడం మన భాషల పట్ల పెరుగుతున్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని అన్నారు. నైతిక విలువలు, సంప్రదాయాలు తదుపరి తరాలకు అందాలంటే మాతృభాషను కాపాడుకోవడం ఒక్కటే మార్గమని ఆయన ఉద్ఘాటించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. మాతృభాషపై భగవత్ చేసిన సూచనలను పలువురు ఆహ్వానిస్తున్నారు.

## సంక్షిప్తంగా..

### తమిళనాట మల్లెపూలు కిలో రూ.3 వేలు!



**చెన్నై, జనవరి 2:** తమిళనాడులో ఆధ్యాత్మిక మాసం మార్గళి పూజలకు తోడు, ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు తోడవడంతో పూల ధరలు భారీగా పెరిగాయి. ముఖ్యంగా మల్లెపూల ధరలు సామాన్యులకు అందనంత స్థాయికి చేరాయి. మధురై మార్కెట్‌లో కిలో మల్లెలు రూ. 2,500 పలకగా, తేని జిల్లా ఆండిపట్టి మార్కెట్‌లో ఏకంగా రూ. 3,000 మార్కును తాకాయి. రాష్ట్రంలో వర్షాలు తగ్గి మంచు కురుస్తుండటంతో పూల దిగుబడి గణనీయంగా పడిపోయింది. ఇదే సమయంలో వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సరం కూడా కావడంతో పూలకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. మల్లెపూలతో పాటు ఇతర పూల ధరలు కూడా పెరిగాయి. కిలో కనకాంబరం రూ. 2,500, ముల్లై పూలు రూ. 1,200, పన్నీటి గులాబీలు రూ. 200 చొప్పున విక్రయించారు. సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో పూల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

### పుతిన్ ఇంటిపై దాడి నిజమే: యుఎస్‌కు ఆధారాలిచ్చిన రష్యా



**మాస్కో, జనవరి 2:** యుద్ధం ముగించేందుకు ప్రయత్నాలు జరుగుతుండగా.. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇల్లే లక్ష్యంగా డ్రోన్ దాడులు జరగడం తీవ్రం చర్చనీయాంశమైంది. ఉక్రెయిన్ దళాలు ఈ దాడికి పాల్పడ్డాయంటూ రష్యా ఆరోపించిన సంగతి తెలిసిందే. వీటిని పలు దేశాలు ఖండిస్తున్న నేపథ్యంలో.. దాడి నిజమేనని రష్యా నిజరూపించుకునే పనిలో పడింది. ఇందులో భాగంగా దాడికి సంబంధించి లభ్యమైన కొన్ని ఆధారాలను అమెరికాకు అందజేసింది. ఈ మేరకు ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ ఓ విడియో విడుదల చేసింది. రష్యా సైనిక నిఘా సంస్థ అధిపతి అడ్మిరల్ ఇగోర్ కోస్త్యుకోవ్ మాస్కోలోని యుఎస్ మిలిటరీ అటాచ్ అధికారులతో భేటీ అయ్యారు.

### తైవాన్ సమీపంలో యుద్ధ విన్యాసాలు ఆపండి : చైనాను కోరిన అమెరికా



**వాషింగ్టన్, జనవరి 2:** తైవాన్ విషయంలో చైనా అనుసరిస్తున్న విధానాలపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. బీజింగ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేసింది. ఇటీవల తైవాన్ జలసంధి చుట్టూ చైనా భారీగా యుద్ధ విన్యాసాలు చేయడం తీవ్ర ఆందోళన కలిగించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపైనే తాజాగా అమెరికా విదేశాంగ శాఖ స్పందించింది. 'తైవాన్ చుట్టూ చైనా సైనిక విన్యాసాలు, బెదరింపులకు పాల్పడటం ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తలు పెంచుతాయి. బీజింగ్ సంయమనం పాటించాలని, తైవాన్‌పై సైనిక ఒత్తిడిని ఆపాలని కోరుతున్నాం. దౌత్యమార్గాలతో ఈ సమస్య పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం.' అని విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ పిగోట్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తైవాన్ జలసంధి చుట్టూ శాంతి, స్థిరత్వానికి యుఎస్ మద్దతుస్తోందన్నారు.

## మోడీతో ట్రంప్‌నకు వ్యక్తిగత విభేదాలు.. అందుకే భారత్‌కు దూరం!

**వాషింగ్టన్, జనవరి 2:** రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. భారత్‌తో అనుసరిస్తున్న విధానాలను అమెరికా కాంగ్రెస్ సభ్యుడు సుహాస్ సుబ్రమణ్యం తప్పుబట్టారు. ట్రంప్ తన చర్యలతో భారత్-అమెరికాల మధ్య సంబంధాలను పూర్తిగా దెబ్బతీశారని ఆరోపించారు. ఇది ఇరు దేశాల ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు ప్రమాదకరమని హెచ్చరించారు. డెమొక్రటిక్ నేత సుబ్రమణ్యం ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'ట్రంప్ తన తొలివిడత పాలనలో తీసుకున్న చర్యలకు పూర్తి వ్యతిరేకంగా ఇప్పుడు వ్యవహరిస్తున్నారు. తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భారత ప్రధాని మోడీతో సంబంధాలను బలోపేతం చేశారు. ఇప్పుడు మోడీతో ఆయనకు వ్యక్తిగత విభేదాలు ఉన్నట్లుగా కన్పిస్తోంది. దానివల్ల చాలా యేళ్లుగా బలంగా ఉన్న ఇరు దేశాల సంబంధాలను ఆయన చెడగొట్టుకుంటున్నారు. ఇది ఇరు దేశాలకు మంచిది కాదు' అని ఆయన అన్నారు. భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడం అమెరికాకు చాలా ముఖ్యమని, ముఖ్యంగా చైనా ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి ఇది సాయపడుతోందన్నారు. ట్రంప్ విధించిన సుంకాలు ఇరుదేశాల మధ్య ఆర్థిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీశాయని సుబ్రమణ్యం అభిప్రాయపడ్డారు. అమెరికా కాంగ్రెస్‌లో ఉభయపక్షాలు భారత్‌తో సంబంధాలకు కట్టుబడి ఉన్నాయన్నారు.



## కుమార్తెతో కలిసి కొత్త సంవత్సరవేడుకల్లో కిమ్!

**ప్యాంగ్యాంగ్, జనవరి 2:** ఉత్తర కొరియా పాలకుడు కిమ్ జోంగ్ ఉన్ తన కుమార్తె జుయేను మరోసారి ప్రపంచానికి ప్రత్యేకంగా పరిచయం చేశారు. 2026 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా, కిమ్ తన తండ్రి కిమ్ జోంగ్ ఇల్, తాత కిమ్ ఇల్ సంగ్ భౌతిక కాయాలను భద్రపరిచిన పవిత్రమైన కుమ్సుసాన్ ప్యాలెస్ ఆఫ్ ది సన్ ను కుమార్తెతో కలిసి సందర్శించారు. జుయే ఈ ప్యాలెస్‌ను సందర్శించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఉత్తర కొరియా ప్రభుత్వ మీడియా కెసిఎన్ఏ విడుదల చేసిన చిత్రాలలో కిమ్ కుటుంబం ప్రధాన వరుసలో నిలబడి నివాళులర్పించింది. ఇందులో కిమ్ జోంగ్ ఉన్, ఆయన భార్య రి సోల్ జు మధ్యలో కుమార్తె జుయే నిలబడి ఉన్నారు. సాధారణంగా అత్యంత ప్రాధాన్యం కలిగిన వారు ఉండే మధ్య స్థానాన్ని తన కుమార్తెకు కేటాయించడం ద్వారా కిమ్ ఆమెను తన వారసురాలిగా సూచనప్రాయంగా ప్రకటిస్తున్నారని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్యాంగ్‌యాంగ్‌లో జరిగిన నూతన సంవత్సర ప్రదర్శనలో కూడా జుయే సందడి చేశారు. తన తండ్రి ధరించిన శైలిలోనే నల్లటి లెదర్ కోటు ధరించి ఆయన పక్కనే కూర్చున్నారు. కౌంట్‌డౌన్ ముగిసిన తర్వాత కిమ్ బుగ్గపై ముద్దుపెట్టుకుని శుభాకాంక్షలు తెలుపుతూ కనిపించారు. ఈ వేడుకల్లో ఆమె పిల్లలను హత్తుకోవడం, ప్రజలకు అభివాదం చేయడం వంటి దృశ్యాలు ఆమెకు పెరుగుతున్న ప్రాధాన్యం చాటుతున్నాయి.

## ఆస్తి కోసం తండ్రిని చంపేశారు

### - ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో ఘోరం



**లక్నో, జనవరి 2:** ఆయనో రిటైర్డ్ ఆర్మీ అధికారి. ఆయనకు ఇద్దరు కుమారులు. వారి మధ్య ఆస్తి వివాదం. ఇల్లు విడిచి వెళ్లాలని కొడుకులకు తండ్రి అల్టిమేటం జారీ చేశాడు. కొంతకాలంగా కుమారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఆస్తిపై ఆశతోపాటు, ఇల్లు ఖాళీ చేయడం ఇష్టంలేని కుమారులిద్దరూ తండ్రిని హతమార్చాలని కుట్ర పన్నారు. తండ్రిని హత్య చేయాలని తెలిసిన వ్యక్తికి సుపారీ ఇచ్చారు. సుపారీ తీసుకున్న ముఠాలో ఓ కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. అంతా అనుకున్నట్లుగా ఇంటికొస్తున్న తండ్రిని సుపారీ గ్యాంగ్ డిసెంబర్ 26న తుపాకీతో కాల్చి చంపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన రిటైర్డ్ ఐఎఫ్ అధికారి యోగేష్ (58) తన ఇంట్లో ఉంటున్న కుమారులను ఆ ఇల్లు ఖాళీ చేయాలని కొంతకాలంగా ఒత్తిడి తెస్తున్నారు. ఆస్తిపై ఆశతో పాటు, ఇల్లు ఖాళీ చేయడం ఇష్టం లేని కుమారులు తండ్రిని వదిలించుకోవాలని పథకం వేశారు. ఇందుకోసం తమ పొరుగున ఉండే అరవింద్ (32) అనే వ్యక్తికి సుపారీ ఇచ్చారు. అరవింద్ తన బావమరిది, కౌశాంబి జిల్లాలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నవీన్‌తో కలిసి ఈ కాల్పులకు పాల్పడ్డాడు. బుధవారం సాయంత్రం నిందితుడు అరవింద్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు అతడి నుంచి పిస్టల్, బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో యోగేష్‌పై తానే కాల్పులు జరిపినట్లు అరవింద్ అంగీకరించాడు. ఘజియాబాద్ కోర్టు అతడికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. యోగేష్ ఇద్దరు కుమారులు, కానిస్టేబుల్ నవీన్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## ఫుడ్‌పాయిజనింగ్‌తో 200 చిలుకల మృతి

**భోపాల్, జనవరి 2:** కలుషిత ఆహారం వల్ల సుమారు 200 చిలుకలు మరణించాయి. ఇది చూసి స్థానికులు భయాందోళన చెందారు. బర్డ్ ఫ్లూ కారణంగా చిలుకలు చనిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అయితే చిలుకల మృతికి ఫుడ్ పాయిజనింగ్ కారణమని పశు వైద్యులు నిర్ధారించారు. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బద్వా ప్రాంతంలోని నర్మదా నది ఒడ్డున ఉన్న అక్విడక్ట్ వంతెన సమీపంలో గత నాలుగు రోజుల్లో సుమారు 200 చిలుకలు మరణించాయి. ఇది చూసి స్థానికులు ఆందోళన చెందారు. బర్డ్ ఫ్లూ సోకడం వల్ల చిలుకలు చనిపోయినట్లు అనుమానం వ్యక్తం చేశారు.
వందలాది చిలుకలు మరణించిన సమాచారం తెలుసుకుని పశువైద్యులు, వన్యప్రాణుల సంరక్షణ శాఖతో పాటు అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతానికి చేరుకున్నారు.
చిలుకల కళేబరాలకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. వాటి మృతికి ఫుడ్ పాయిజనింగ్ కారణమని పశువైద్యులు నిర్ధారించారు.

# ఆధునిక భారతావనిలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే

-మహిళా సాధికారిత కోసం అలుపెరగని పోరాటం
-52 పాఠశాలల ఏర్పాటు
-భర్త చితికి నిప్పంటించి నూతన సాంప్రదాయానికి తెరలేపిన సావిత్రిబాయి పూలే.

రేపల్లె-ప్రభాతవార్త

నిమ్నవర్గాల అభ్యున్నతికి కృషి చేసిన భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయురాలు, రచయిత్రి సావిత్రిబాయి పూలే ఆధునిక విద్యతోనే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందనే ప్రగాఢ విశ్వాసంతో కుల వ్యవస్థ, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారు. మహిళలు సంబంధించిన అన్ని హక్కులను సాధించేందుకు పోరాటమే శరణ్యమని సామాజిక బాధ్యతగా సావిత్రిబాయి పూలే భావించారు. పీడిత ప్రజలలో మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణిగా ఆమె నిలిచిపోయారు. మహారాష్ట్రలోని సతారా జిల్లా నయాగావ్ గ్రామంలో 195 సంవత్సరాల క్రితం అంటే 1831 సంవత్సరం జనవరి 3వ తేదీ సావిత్రిబాయి పూలే ఒక రైతు కుటుంబంలో జన్మించారు. సావిత్రిబాయి పూలేకు 9 ఏళ్ళ వయసులో 12 ఏళ్ళ జ్యోతిరావు పూలేతో వివాహం జరిగింది. 1848వ సంవత్సరంలో బహుజనుల బాలికల కోసం పూణేలో పాఠశాలను ప్రారంభించగా అగ్రవర్ణాల నుంచి వేధింపులు, భౌతిక దాడులు ఎదురయ్యాయి. పాఠశాలకు వెళ్ళేటప్పుడు సావిత్రిబాయి పూలేపై బురద చల్లడం, రాళ్ళు విసరడం, అసభ్యకరమైన పదజాలంతో దూషించడం వంటి దుశ్చర్యలకు పాల్పడేవారు. బురద చీరతో అలాగే పాఠశాలకు వెళ్ళి అక్కడ వేరొక దుస్తులను ధరించి ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు ఆ బురద చీరను కట్టుకుని నడచి వెళ్ళేది. తన విధిని తాను ధైర్యవంతంగా నిర్వహిస్తున్నట్లు సావిత్రిబాయి పూలే చెప్పేవారు. ఇలాగే వేధింపులు పెరిగిపోవడంతో సహనానికి కూడా ఒక హద్దు ఉంటుంది కదా ఒకడి చెంప చెళ్ళుమనిపించింది. ఈ నేపథ్యంలో అనతి కాలంలోనే విద్యా ఉద్యమానికి సహకారం, గుర్తింపు లభించాయి. ఒక ముస్లిం వ్యక్తి ఆయన ఇంటిని పాఠశాలకు కేటాయించాడు. కొందరైతే పుస్తకాలు సేకరించడం విశేషం. దియోరావ్, మోరోవితల్, వాల్వేకర్ వంటి ప్రముఖులు పాఠశాల నిర్వహణకు సహకరించడంతో మరలా 1851వ సంవత్సరంలో సావిత్రిబాయి పూలే పాఠశాలను ప్రారంభించారు. విద్యాభివృద్ధి, పాఠశాలల ఏర్పాటు కోసం ఆమె పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే దంపతులకు సంతానం లేని కారణంగా బ్రాహ్మణ వితంతువు కుమారుడు యశ్వంతరావును దత్తత తీసుకున్నారు. దేశంలో విద్యా ఉద్యమం ప్రారంభించిన సావిత్రిబాయి పూలే 52 పాఠశాలలను ఏర్పాటు చేశారు. 1849 సంవత్సరంలో



అయితే సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే దంపతులను గృహ బహిష్కారానికి గురి చేశారు. దళితుల, స్త్రీల విద్యావ్యాప్తికి ఆ దంపతులు ఎనలేని కృషి చేశారు. మానవ హక్కులలో భాగంగా సామాజిక సమస్యల గురించి మహిళలను చైతన్యపరిచేందుకు మహిళాసేవా మండలిని స్థాపించారు. సమాజంలో మహిళా హక్కులే మానవ హక్కులని సావిత్రిబాయి పూలే చైతన్యం తీసుకువచ్చారు. 1873లో సత్యశోధక్ సమాజ్‌ను ప్రారంభించారు. బాల్య వివాహాలు, మూఢనమ్మకాలు, సతీసహగమనానికి వ్యతిరేకంగా, వితంతువు పునర్వివాహాలకు, అసమాన బ్రాహ్మణ వ్యవస్థకు వ్యతిరేకంగా తీవ్రమైన ఉద్యమాన్ని నడిపారు. బాల్యదశలోనే వైధవ్యాన్ని అనుభవిస్తున్న ఎందరో బాలికల ఆకలిబాధలు తీర్చి ఆశ్రయం కల్పించారు. గర్భవతులకు సేవలు చేసి వారి కళ్ళల్లో ఆనందాన్ని చూసారు. వితంతువులకు శిరోముండనం చేసే విధానాన్ని సావిత్రిబాయి పూలే వ్యతిరేకించారు. క్షురకులలో మార్పు తీసుకురావడంతో 1860 సంవత్సరంలో వితంతువులకు శిరోముండనం చేసేది లేదంటూ క్షురకులే ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సత్యశోధక్ సమాజ్ మహిళా విభాగం నేతృత్వంలో పురోహితులు లేకుండానే వివాహాలు, శుభకార్యక్రమాలు నిర్వహించే విధంగా సావిత్రిబాయి పూలే నిర్ణయించారు. 1873 డిసెంబరు 25న భార్యను కోల్పోయిన ఓ యువకుడికి తన స్నేహితురాలి కుమార్తెతో వివాహం జరిపించారు. 1868 సంవత్సరం నుంచే అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారు. 1870, 1896 సంవత్సరాలలో భారతదేశం ప్రజలు కరువు పరిస్థితులను చవిచూశారు. ఆ సమయంలో సావిత్రిబాయి పూలే, జ్యోతిరావు పూలే దంపతులు కరువుతో విలవిలలాడుతున్న కుటుంబాలలోని 2 వేల మంది అనాథ బాలలకు ఆశ్రయం కల్పించారు. వీరు ఏర్పాటు చేసిన పాఠశాలలో విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రారంభించారు. సావిత్రిబాయిపూలే సంఘసంస్కర్త వరకే పరిమితం కాకుండా రచయితగా ప్రసిద్ధి చెందారు. 1854లో కావ్యఫూలే అనే కవితా సంపుటి, 1891లో పావన కాశీ సుబోధ్ రత్నాకర్ అనే కవితా సంపుటి రచించారు. 1892లో సావిత్రిబాయి పూలే ఉపన్యాసాలకు సంబంధించిన గ్రంథాన్ని ప్రచురించారు. 1890 నవంబరు 28వ తేదీ భర్త జ్యోతిరావు పూలే మృతితో సావిత్రిబాయి పూలే కోలుకోలేని దు:ఖసాగరంలో మునిగిపోయింది. భర్త చితికి తానే నిప్పుపెట్టి దహన సంస్కారాలకు నాంది పలికింది. భారత దేశ చరిత్రలో ఇలా జరగటం ఇదే తొలి సంఘటన. ఆ తరువాత సత్యశోధక్ సమాజ్ సేవలను ప్రణాళికాబద్ధంగా ఉధృతం చేశారు. 1896-97 సంవత్సరాలలో మహారాష్ట్రను ప్లేగు వ్యాధి, తీవ్ర కరువు పరిస్థితులు ప్రజల జీవనాన్ని అతలాకుతలం చేశాయి. ప్లేగు వ్యాధితో బాధపడుతున్న వారికోసం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ప్లేగు వ్యాధి సోకిన దళిత వర్గానికి చెందిన బాలికలను దగ్గరకు తీసుకుని వైద్య చికిత్స చేసి రక్షించింది. తుదకు సావిత్రిబాయి పూలే ప్లేగు వ్యాధికి గురయ్యారు. 1897 మార్చి 10వ తేదీ ఆమె తుదిశ్వాస విడిచారు. దీంతో దత్తపుత్రుడు యశ్వంత్ అంత్యక్రియలు పూర్తిచేశాడు. అప్పటి నుంచి సావిత్రిబాయి పూలే జయంతిని భారతదేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. పూణే విశ్వవిద్యాలయానికి సావిత్రిబాయి పేరు పెట్టారు. భారత ప్రభుత్వం 1997లో సావిత్రిబాయి పూలే జ్ఞాపకార్థం తపాలా బిళ్ళను విడుదల చేయటం విశేషం. సావిత్రిబాయి పూలే జీవితం మహిళాలోకానికి ఆదర్శంగా నిలిచింది.

# దేవాలయాల అభివృద్ధే కూటమి ప్రభుత్వం ధ్యేయం

## ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**చేబ్రోలు(పొన్నూరు), జనవరి 2, ప్రభాతవార్త:** శిథిలావస్థకు చేరిన దేవాలయాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని శలపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వర, చంద్రశేఖర స్వామి దేవాలయం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఇటీవల రూ.93.33లక్షలు నిధులు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శలపాడు



గ్రామానికి వెళ్ళి స్వామివారిని దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో పనులు ప్రారంభించి ఆలయం యొక్క రూపురేఖలు మారుస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అనే దేవాలయాలు అభివృద్ధికి ఆమడ దూరంగా వెళ్ళాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనేక దేవాలయాలను కూలగొట్టారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనేక దేవాలయాలను అభివృద్ధిలోకి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో అనేక దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజలు కూడా కూటమి ప్రభుత్వానికి సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నరేంద్ర కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళనం బ్రోచర్ ఆవిష్కరించిన కేంద్రమంత్రి పెమ్మసాని

**తెనాలి మున్సిపాలిటీ జనవరి2(ప్రభాతవార్త):** కులాలకి, రాజకీయాలకి, వర్గాలకి అతీతంగా హిందువులందరినీ ధార్మికంగా ఒకటిగా కలపాలనే ఆశయంతో, పట్టణంలో జనవరి 4వ తేదీన, ఆదివారం బోసురోడ్డు లోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం నందు, హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్న సందర్భంగా, ఈ కార్యక్రమాన్ని విజయవంతం



చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తూ, హిందూ సమ్మేళన నిర్వహణ కార్యకర్తలు శుక్రవారం కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కార్యాలయంలో, కేంద్రమంత్రి చేతులమీదుగా బ్రోచర్ ఆవిష్కరింపజేశారు. ఈసందర్భంగా హిందూసమాజం, కులమతాలకు అతీతంగా పాల్గొని హిందూసమ్మేళనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు.

# పారదర్శకతకు నిదర్శనమే నూతన పాసుపుస్తకాలు జారీ

## ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**చేబ్రోలు(పొన్నూరు), జనవరి 2, ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం పారదర్శకతకు నిదర్శనమే పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ అని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. చేబ్రోలు మండల పరిధిలోని శలపాడు రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూర్చే విధంగా రెవెన్యూ సంస్కరణలను తీసుకురావడం జరిగిందన్నారు. రైతులు రీసర్వే జరుగుతున్న గ్రామాల్లో సిబ్బందికి, అధికారులకు సహకరించి మీ



గ్రామ పంచాయితీ కార్యాలయంలో శుక్రవారం నూతన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన రీ సర్వేలో భాగంగా శలపాడు, వీరానాయకుని పాలెం, శేకూరు గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. అందుకు సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలను లబ్దిదారులకు ఎమ్మెల్యే చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రెవెన్యూ రికార్డు మొత్తాన్ని అస్తవ్యస్తం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతుల భూములను పక్కాగా, పారదర్శకంగా రీ సర్వే చేసి అర్హులందరికీ పట్టాదారు పాసుపుస్తకాలను అందజేస్తున్నట్లు చెప్పారు. టిడిపి ప్రభుత్వం హయాంలోనే భూములకు సంబంధించిన పక్కా ధృవీకరణ పత్రాలను, పట్టాదారు పాసుపుస్తకాలను తీసుకోవాలని కోరారు. తహాశీల్దార్ కళ్ళెం శ్రీనివాసశర్మ మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు సంబంధించిన 333మంది రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పెరుగు శ్రీనివాసరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, ప్రధాన కార్యదర్శి అనంతలక్ష్మి, అధికార ప్రతినిధి తాటిశంకర్, సొసైటీ ఛైర్మన్ షేక్ రియాజ్, నీటి సంఘం అధ్యక్షుడు కంచర్ల శేషగిరిరావు, మోర్ల నాగేశ్వరరావు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఏటుకూరులో అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 2, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వం ప్రజా అవసరాలను తీర్చేందుకు కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులను చేపట్టిందని ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు, జిల్లా మాజీ కలెక్టర్, పబ్లిక్ ఎకౌంట్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని గుంటూరు రూరల్ మండలం, ఏటుకూరు గ్రామ సచివాలయం వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక నేతలతో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. పనుల



పురోగతిని, నాణ్యతను స్వయంగా పరిశీలించి అధికారులకు, కాంట్రాక్టర్లకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించాడు. ఈ పనులు పూర్తయితే గ్రామస్తులకు, సచివాలయ సిబ్బందికి ఇబ్బంది తీరుతుందని వివరించారు. ఇది గ్రామస్తుల చిరకాల స్వప్నం అన్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీఠ వేస్తుందని చెప్పారు. పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నిశంకర్రావు అమర్నాథ్, ఉగ్గిరాల పూర్ణ, జనసేన నాయకుడు నిశంకర్రావు నవీన్, నల్లకా స్వామి, యర్రంశెట్టి శ్రీను, తన్నీరు అనిల్, తదితర కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : తెదేపా మండల అధ్యక్షులు మర్రి.

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 2, ప్రభాతవార్త :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మర్రి సాంబశివరావు పేర్కొన్నారు. మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలో శుక్రవారం మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో



రైతులకు రాజముద్రతో ముద్రించిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిడిపి మండల అధ్యక్షులు మర్రి హాజరై మాట్లాడుతూ..నూతన పట్టాదారు పాస్ పుస్తకాల ద్వారా రైతులకు భూ హక్కులపై సంపూర్ణ భరోసా లభిస్తుందని, ఎలాంటి రాజకీయ గుర్తులు లేకుండా ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించడం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనం అన్నారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతుకు ఏకష్టం వచ్చినా మేమున్నాం అంటూ ముందుకు వచ్చే ఏకైక నాయకుడు మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడని పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పాసుపుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మను ముద్రించారని, తాము మాత్రం నిబంధనల ప్రకారం ప్రభుత్వ రాజముద్రతో రైతులకు పాస్ పుస్తకాలు అందజేస్తున్నామని తెలిపారు. అలానే రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు వెళుతుందని ఒకపక్క రాజధాని నిర్మాణం, మరోపక్క రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు పరుస్తూ కూటమి ప్రభుత్వం జెట్ స్పీడ్ తో ముందుకు వెళుతుందన్నారు. మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పలు ఐటీ కంపెనీలు ముందుకు వస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమంతో పాటు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల రూపకల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. తహసీల్దార్ క్షమారాణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పూర్తయిన గ్రామాలలో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా అనంతవరప్పాడు గ్రామంలో 623 మంది రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజముద్రలతో ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేసేందుకు ఈనెల 2 నుండి 9వ తేదీ వరకు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సదస్సుల ద్వారా రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా వెంకటరావు, టిడిపి నియోజకవర్గ తెలుగు యువత నేత నాగిశెట్టి నాగరాజు, నార్నే బాబు, శేఖర్, టిడిపి సీనియర్ నేత ఎర్రగుంట్ల నరేంద్ర, గ్రామస్తులు, రైతులు, కూటమి నేతలు కార్యకర్తలు, అభిమానులు, రెవిన్యూ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్ విస్తృత తనిఖీలు

**గుంటూరు క్రైమ్, జనవరి2, ప్రభాతవార్త :** శుక్రవారం ఉదయం పాత గుంటూరు నందు గల పొన్నూరు రోడ్ లో బైపాస్ వద్ద అక్రమముగా తరలిస్తున్న ప్రజా పంపిణీ రేషను బియ్యము 80 బస్తాలలో, బస్తా ఒకింటికి 50 కేజీల చొప్పున 40 క్వింటాళ్ళ బియ్యంను సహా స్వాధీన పరచుకున్నారు. లారీ యజమాని, డ్రైవర్ మరియు బియ్యం అక్రమ వ్యాపారం చేయుచున్న శుద్ధపల్లి డొంకకు చెందిన డి.నరేంద్ర మరియు శ్యాం ప్రసాద్.. అను వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేయవలసినదిగా గుంటూరు విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు ఆదేశించినారు .మరోవైపు అక్రమాలకు తావిస్తున్న రేషన్ షాప్ డీలర్ల పై కూడా కొరడా జూలి పిస్తూ పొన్నూరు మండలం లోని ఒక చౌక ధరల దుకాణం నంబర్ 0788001 నందు ఆకస్మిక తనిఖీ చేసి డీలర్ శ్రీమతి చిలకా వెంకట రమణ w/o. చిన నరశింహరావు పైన నిత్యావసరాల



వస్తువుల చట్టం కేసు నమోదు చేయవలసినదిగా పొన్నూరు విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులు ఆదేశించినారు. ఒకే రోజు బృందాలుగా దాడులు చేయటం జరిగినది. పై తనిఖీలలో విజిలెన్స్ ఇన్స్పెక్టర్ కె. చంద్ర శేఖర్, తహసిల్దార్ ఎం. లక్ష్మీ మాధవి, నీళివీ సైదులు, సబ్ ఇన్స్పెక్టర్ కె.అమీర్, స్థానిక మరియు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ప్రభాకర్

**గుంటూరు వెస్ట్, జనవరి 2, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో 2026 డైరీ, క్యాలెండర్ ను ఛైర్మన్ దేగల ప్రభాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ దేగల ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపీఐడిసి ని ఎంతగానో



ప్రోత్సహించారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఏపీఐడీసీను పూర్తిగా నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. 2006 నుంచి కార్పొరేషన్ కొన్ని అనివాహికరణాలవల్ల కార్పొరేషన్ యొక్క యాక్టివిటీ ఆగిపోవడం జరిగిన్నారు. కూటమి ప్రభుత్వం ఏపీఐడీసీ కి పూర్వ వైభవం తీసొకొచ్చేందుకు సమిష్టిగా కృషి చేస్తున్నామన్నారు. రానున్నరోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి నిర్ణయంతో, నూతనంగా ప్రారంభించబోయే పరిశ్రమలను, పారిశ్రామికవేత్తలకు లోన్లను ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఎండి రఘునాథ్, డైరెక్టర్లు బాలభారతి, రాజారావు, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# యుటిఎఫ్ క్యాలెండర్లు డైరీలు ఆవిష్కరణ

**పెదనందిపాడు జనవరి 2 (ప్రభాతవార్త)** ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తున్న యుటిఎఫ్ సభ్యులకు ప్రశంసనీయమని పెదనంది పాడు మండల విద్యాశాఖ అధికారి 1. సిహెచ్ రమేష్ కుమార్. ఎంఈఓ 2. పోపూరి జాకబ్‌లు అన్నారు. శుక్రవారం సాయంత్రం పెదనంది పాడు విద్యా వనరుల కేంద్రంలో




యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఏ రత్నకుమార్. ప్రధాన కార్యదర్శి ఫాణిరెడ్డి. మహిళా కార్యదర్శి కల్పన. జిల్లా కార్యదర్శి అనురాధ. నున్న రామకృష్ణ. బాలిరెడ్డి. యురేకా. ఎస్ దీప్తి. వెంకటనారాయణ చంద్రశేఖర్ తదితర సీనియర్ సంఘ సభ్యు లు. విద్యాశాఖ అధికారులతో కలిసి యుటిఎఫ్. డైరీలు. క్యాలెండర్ లు ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు అధికారులకు గ్రీటింగ్స్ అందజేశారు.

# టెన్త్ విద్యార్థులకు న్యూట్రీషియన్ ఫుడ్

**గుంటూరు విద్య జనవరి 2 ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి రెండో తేదీ నుండి 10వ తరగతి విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ తప్పని సరిగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో అందజేయాలనీ జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాష తెలిపారు. ఒక విద్యార్థికి ఒక రోజుకి 7 రూపాయల 50 పైసలు చొప్పున ఖర్చు చేయాలి. దీనికి సంబంధించి ఖర్చును జిల్లా పరిషత్ వారు ప్రధానోపాధ్యాయుల అకౌంట్ కు విడుదల చేస్తారు. కనుక ప్రతి ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులందరికీ న్యూట్రిషన్ ఫుడ్ తప్పనిసరిగా అందచేయ వలసినదిగా గుంటూరుజిల్లా విద్యాశాఖాధికారి పేర్కొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ నాయకులు

**గుంటూరు విద్య జనవరి 2 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర సంఘం గుంటూరు జిల్లా కలెక్టర్ తమ్మిమ్ అన్సారియాని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం లో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్‌ని కోరారు. ఈకార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, సర్వీసు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వినుకొండ



రాజారావు రాష్ట్ర ప్రధానకార్యదర్శి చాంద్ బాష, మహిళా విభాగం అధ్యక్షురాలు సుమిత్రాదేవి , మాధవిలత , మణి శ్రీ , మల్లేశ్వరి, మున్సిపల్ కార్పొరేషన్ ఉద్యోగులు, నాయకులు రెహమాన్ , ఉదయ రంగా , కోఆపరేటివ్ ఉద్యోగులు ,అన్వర్ బాషా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# దినసరి వేతన ఉద్యోగులకు పిఎఫ్ జయచేయాలని న్యాయస్థానం ఆదేశాలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జనవరి2, ప్రభాతవార్త:** ఏఎన్‌యులో విధులు నిర్వహిస్తున్న దినసరి వేతన ఉద్యోగులకు పిఎఫ్ బకాయిలు చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈమేరకు 2019లు దినసరి వేతన ఉద్యోగుల తరుపున ఉద్యోగ సంఘం కార్యదర్శి వేసిన పిటిషన్‌పై గతేడాది జూలైలో తీర్పును వెల్లడించింది. ఈ తీర్పుపై వర్సిటీ నిమ్మకుండడంతో గుంటూరు ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ అధికారులు వర్సిటీకి వచ్చి నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. వర్సిటీలో 1992 జనవరి నుంచి దినసరి వేతన ఉద్యోగులుగా పనిచేస్తున్న వారికి వారు విధుల్లో చేరినప్పటి నుంచి సుమారు 412మందికి మే 2017 వరకు వర్సిటీ పిఎఫ్ చెల్లించలేదు. దీనిపై ఆల్ యూనివర్సిటీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఛీఫ్ సెక్రటరి కె.భాను ప్రసాద్ వర్సిటీ పిఎఫ్ చెల్లించేలా ఆదేశించాలని 2019లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. పలు వాయిదాల అనంతరం 2025 ఆగస్టులో న్యాయస్థానం తీర్పును వెల్లడించింది. ఈ తీర్పుపై వర్సిటీ అధికారులు రిట్ వేసేందుకు ప్రయత్నాలు చేయగా న్యాయస్థానం ఉద్యోగుల పక్షాన నిలిచి వారికి రావల్సిన బకాయిల్లో 50శాతం చెల్లించిన తరువాతే తదుపరి రిట్‌కు అవకాశం ఉంటుందని ఆదేశించడంతో వర్సిటీ అధికారులు అయోమయంలో పడ్డారు. 1992 నుంచి దినసరివేతన ఉద్యోగులుగా ఉన్న వారిలో కొందరు ఉద్యోగ విరమణ చేయగా మరికొందరు పదోన్నతులతో టైం స్కేల్ కేటగిరిలోకి వెళ్ళారు. దీంతో ప్రస్తుతం 350మంది వరకు దినసరి వేతన ఉద్యోగులు ఉన్నట్లు తెలిసింది. వర్సిటీ 50శాతం పిఎఫ్ బకాయిలు చెల్లిస్తే ఒక్కో ఉద్యోగికి రూ.1లక్షకు పైగా పిఎఫ్ నిధులు అందనున్నాయి. గతేడాది ఆగస్టు నుంచి వర్సిటీ ఎటువంటి చెల్లింపులు చేయక పోవడంతో గుంటూరు పిఎఫ్ కార్యాలయ అధికారులు వర్సిటీకి వచ్చి వర్సిటీ లావాదేవీలు నిర్వహిస్తున్న బ్యాంకులను సంప్రదించి అకౌంట్‌లను ఫ్రీజ్ చేయాలని లేఖలు అందించినట్లు సమాచారం. ఈక్రమంలో దూరవిద్యకేంద్రం అకౌంట్ ఫ్రీజ్ అయినట్లు తెలిసింది. న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చినా వర్సిటీ అధికారుల కాలయాపనతోనే ఈ స్థితి నెలకొందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. కొందరు అధికారులు దినసరివేతన ఉద్యోగులకు పిఎఫ్ బకాయిలు చెల్లించేందుకు సానుకూలంగా స్పందించినా అది కార్యరూపం దాల్చకపోవడం గమనార్హం. న్యాయస్థానం దినసరి ఉద్యోగులకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సందర్భంగా అప్పటి ఆల్ యూనివర్సిటీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఛీఫ్ సెక్రటరిని ప్రతిస్పందన కోసం ప్రభాతవార్త ఫోన్‌లో ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.





# జూలై 2027 కంటే ముందే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం : ఎమ్మెల్యే గల్లా మాధవి

**గుంటూరు వేస్ట్ జనవరి 3 ప్రభాకర్ వార్త :** గుంటూరు నగర అభివృద్ధిలో కీలకమైన శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే శ్రీమతి గల్లా మాధవి , గౌరవ కేంద్ర మంత్రివర్యులు శ పెమ్మసాని చంద్రశేఖర్ గారితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ గారు, మున్సిపల్ కమిషనర్ గారు, సంబంధిత శాఖల అధికారులు కూడా హాజరయ్యారు. ఆర్‌ఓబి పనుల ప్రగతి, వేగం, నిర్మాణ నాణ్యతతో పాటు ప్రజల నుంచి వస్తున్న అభిప్రాయాలు, విమర్శలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గల్లా మాధవి గారు మాట్లాడుతూ కేంద్ర మంత్రివర్యులు పెమ్మసాని చంద్రశేఖర్ గారి ఆధ్వర్యంలో శంకర్ విలాస్ బ్రిడ్జి పనులను క్షుణ్ణంగా పరిశీలించామని, ఈస్ట్ వైపు పనులు వేగంగా కొనసాగుతున్నాయని, పశ్చిమ నియోజకవర్గం వైపు కూడా పనులు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎమ్మెల్యే గల్లా మాధవి గారు తెలిపారు. ఈ ఆర్‌ఓబి నిర్మాణానికి నిర్ణయించిన డెడ్‌లైన్ జూలై 2027 అయినప్పటికీ, ఆ తేదీకి ముందే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నామని, ఆర్‌ఓబి నిర్మాణ సమయంలో ఎదురవుతున్న ప్రధాన అంశం ట్రాఫిక్ సమస్య మాత్రమేనని ఎమ్మెల్యే గల్లా మాధవి గారు తెలిపారు. అయితే ఈ ట్రాఫిక్ పరిస్థితులను స్వయంగా ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో కార్ మరియు ద్విచక్ర వాహనంలో తిరుగుతూ పరిశీలించామని చెప్పారు. భారీ నిర్మాణ పనులు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులు ఒకేసారి జరుగుతున్నప్పటికీ ఎక్కడా 10 నిమిషాల కంటే ఎక్కువ ట్రాఫిక్ జామ్ లేకుండా అధికారులు సమర్థంగా నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో అయితే కిలోమీటర్ల కొద్దీ గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితులు ఉంటాయని, అలాంటివి గుంటూరులో లేకుండా ట్రాఫిక్ మళ్లింపు, రద్దీ సమయాల్లో ప్రత్యేక సిబ్బంది నియామకం, ఆక్రమణల తొలగింపు, ఫ్రీ లెఫ్ట్‌ల క్లియర్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అంతేకాకుండా, కొన్ని ప్రాంతాల్లో భవనాల సెల్లార్లను పార్కింగ్‌కు ఉపయోగించకుండా వ్యాపారాలకు వినియోగించడంతో రోడ్లపై అక్రమ పార్కింగ్ పెరుగుతోందని, దీనిపై అధికారులు మరింత దృష్టి సారించాలని సూచించారు. వైసీపీ నేతలు ఎన్ని విమర్శలు, బురదజల్లే ప్రయత్నాలు చేసినా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నిర్ణయించిన డెడ్‌లైన్‌లో ఆర్‌ఓబి పూర్తి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలపై అవాస్తవ ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్ష నేతలు ముందు తమ ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. అభివృద్ధి అనేది మాటలతో కాదు, పనులతో చూపించాల్సిన అంశమని, కూటమి ప్రభుత్వం అదే చేస్తోందని ఎమ్మెల్యే గల్లా మాధవి గారు తెలిపారు. ప్రజల ఇబ్బందులను తగ్గిస్తూ, నిర్మాణాత్మకంగా ఈ ప్రాజెక్టును పూర్తి చేసి గుంటూరు నగర ప్రజలకు శాశ్వత పరిష్కారం అందిస్తామని ఆమె స్పష్టం చేశారు.



# ప్రభుత్వం రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

**కొల్లూరు, జనవరి 2 (ప్రభాతవార్త) :** ప్రభుత్వం రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమం కొల్లూరు మండలం దోనేపూడి గ్రామంలో శుక్రవారం వేమూరు నియోజకవర్గ శాసన సభ్యులు నక్కా





ఆనందబాబు ఆధ్వర్యంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, బాపట్ల ఎంపీ తన్నేటి కృష్ణప్రసాద్, బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకం పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. రీ సర్వే పూర్తయిన రైతులందరికి పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమం వారి చేతుల మీదుగా జరిగినది గత కొన్ని దశాబ్దాలకు భూములు అమ్మకాలు కొనుగోలు వారసత్వ బదిలీలు రోడ్లు కాలవలు నిర్మాణం వంటి మార్పులు జరుగుతున్నప్పటికీ రెవెన్యూ రికార్డులు సమయానుకూలంగా సమీకరణ కాకపోవడం వల్ల సరిహద్దులు గందరగోళ్ళ విస్తరణ తేడాలు భూ విధానాలు కోర్టు కేసులు పెరిగాయి. ఈ పరిస్థితిని శాశ్వతముగా పరిష్కరించడానికి రీ సర్వే ప్రాజెక్టు రూపుదిద్దుకుందని వారన్నారు. ప్రపంచ బ్యాంకు నీతి ఆయోగ్ అధ్యయనాలు ప్రకారం దేశంలో పెండింగ్ కేసులు దాదాపు రెండు మూడు వంతులు భూ విధానాలే కావటం సగటు ఒక్క కేసుకు 20సంవత్సరాలు నడవడం చూస్తున్నాము. ఇది రైతులు రైతు జీవితాన్ని రాష్ట్ర అభివృద్ధికి తీవ్ర ప్రభావం చూపుతుందని వారు అన్నారు. 1395మంది రైతులు కాను 888మంది రైతులకు రీ సర్వే పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో రామలక్ష్మీ, తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు, కొల్లూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధనప్రసాద్, దోనేపూడి పిఎసిఎస్ అధ్యక్షులు వెనిగళ్ళ మహేష్, సంఘం డైరీ డైరెక్టర్ గుత్తికొండ జ్ఞానానంద భగవాన్, కూటమి నాయకులు, వివిధశాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సహకారం మరువలేనిది

### -రూ.2.75లక్షల సొంత నిధులతో ఆధునీకరణ. -ఉపాధ్యాయులు శ్రీధర్‌కు ఘన సత్కారం.

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 2, ప్రభాతవార్త :** శిథిలాస్థితికి చేరుకున్న మండల విద్యా వనరుల కేంద్రాన్ని బాగుచేయించడంలో ఉపాధ్యాయుల బృంద సహకారం మరువ



లేనిదని మండల విద్యాశాఖాధికారి గరిమెళ్ళ సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శుక్రవారం మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం శిథిలావస్థితికి చేరుకోవటంతో స్థానిక ఉపాధ్యాయ బృందం చేయిచేయి కలిపి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని రూ.2.75 లక్షల సొంత నిధులతో బాగు చేయించడం జరిగిందనారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కొంతమంది ఉపాధ్యాయుల సహకారంతో కార్యాలయానికి గ్రిల్స్, టైల్స్ మరియు ఎలక్ట్రికల్ పరికరాలు రంగులు సమకూర్చడం జరిగిందన్నారు. కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయు లను ఎంఈఓ అభినందించి సత్కరించారు. శుక్రవారం ఎంఈఓ సత్యనారాయణమూర్తి పుట్టినరోజు సందర్భంగా ఉపాధ్యాయుని ఉపాధ్యాయులందరూ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యాలయాన్ని బాగుచేయడానికి తమ సొంత నిధులు వెచ్చించిన ఎంఈఓకు తోడుగా ఉపాధ్యాయులు షహనాజ్, పసుపులేటి శ్రీధర్ కూడా సొంత నిధులు కేటాయించటం చాలా అభినందనీయమన్నారు. అలాగే నంబూరు వద్దనున్న వివిఐటి యూనివర్సిటీ కోఆర్డినేటర్ పబ్లికేషన్స్ డివిజన్ మోదుగుల రవికృష్ణ కూడా తన వంతు ఆర్థిక సహకారం అందించారని చెప్పారు. 2025వ సంవత్సరంలో కేవలం ఐదు సెలవులను ఉపయోగించుకున్న లేమల్లెపాడు ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పసుపులేటి శ్రీధర్ ను ఈ సందర్భంగా తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయురాలు శాంతమ్మ, వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అవగాహన సదస్సు

**పెదనందిపాడు జనవరి 2 (ప్రభావతవార్త)** పెదనందిపాడు ఎల్ ఎమ్ హెచ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, శ్రీనివాస హై స్కూల్. కు చెందిన పదవ తరగతి విద్యార్థులకు "ఫిజిక్స్ కాన్సెప్ట్స్ అండ్ ప్రాక్టికల్ అప్లికేషన్స్ ఇన్ రియల్ వరల్డ్ " అనే అంశం పై ప్రముఖులు గెస్ట్ లెక్చర్ రిసోర్స్ పర్సన్ గా గుంటూరు వాసిరెడ్డి వెంకటాద్రి. ఇంటర్నేషనల్ అండ్ టెక్నోలాజీజికల్ యూనివర్సిటీ కి చెందిన ఫిజిక్స్ ప్రొఫెసర్ డాక్టర్. ఆళ్ల శ్రీవాణి ప్రసంగిస్తూ



విద్యార్థిని విద్యార్థులకు భూగ్రహం మీద మనుషుల దైవనందిని జీవితం ఏ విధంగా ఫిజిక్స్ కాన్సెప్ట్స్ తో ముడిపడి ఉన్నదో సవివరముగా వివరించి నారు. ఫిజిక్స్ అప్లికేషన్స్ ను మనం రియల్ వరల్డ్ లో ఎలా వాడుకోవచ్చునో మరియు వాటి వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ అవగాహన సదస్సు పై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్కూల్ పాలక వర్గ సభ్యులు డాక్టర్ శ్రీవాణి . డాక్టర్ వీర రాఘవయ్య దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల పాలకవర్గం సభ్యులు దాసరి శేషగిరిరావు. ముద్దన నాగరాజ కుమారి. ముద్దన వీర రాఘవయ్య. ఆయా పాఠశాల ప్రిన్సిపల్స్ కిరణ్ కుమార్ జోషి. శాంత కుమారి. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పాతూరి శ్రీనివాస్. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయ విధానం పుడమికి శ్రేయస్కరం

**వట్టిచెరుకూరు రూరల్, జనవరి 2, ప్రభాతవార్త :** ప్రకృతి వ్యవసాయ విధానం భూమికి శ్రేయస్కరమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి పేర్కొన్నారు. మండలంలోని సొపాడు గ్రామంలో రబీలో అనుసరించాల్సిన ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై జిల్లా రిసోర్స్ సెంటర్ వారి సౌజన్యంతో రైతులకు పూర్వ అభ్యాస శిక్షణా కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి హాజరై మాట్లాడుతూ.. జాతీయ పకృతి వ్యవసాయ మిషన్ అనేది రసాయన రహిత, సంప్రదాయ పద్ధతులతో పకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పథకం అన్నారు. సాగు ఖర్చు తగ్గించి రైతులు ఆదాయాన్ని పెంచడం, నేల ఆరోగ్యం, జీవన వైవిధ్యం మెరుగుపరచడం దీని ముఖ్య లక్ష్యాలని తెలియజేశారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంలో భాగంగా సొపాడు గ్రామాన్ని ఎంపిక చేయటం జరిగిందన్నారు. ఇక్కడ రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఇచ్చి ప్రస్తుతం రైతుల పేర్లను నమోదు చేసుకోవడం జరుగుతుందని వివరించారు. ప్రస్తుతం రబి సీజన్లో రెండు లేదా మూడు పద్ధతులు పాటించి వచ్చేటువంటి ఖరీఫ్ సీజన్ నుంచి పూర్తి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని సూచించారు. ఆరోగ్యకరమైన నేల ద్వారానే ఆరోగ్యకరమైన పంటలు లభిస్తాయని .అనంతరం కోడిగుడ్డు, నిమ్మరసం మిశ్రమ ద్రావణం తయారుచేసే విధానాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సహాయంతో చేసి చూపించారు. ఈ ద్రావణాన్ని ఏ మోతాదులో




వినియోగించు కోవాలో వివరంగా తెలియజేసి నారు. భూమి ఆరోగ్యం గా ఉంటేనే ఆరోగ్యమైన పంటలు పండుతాయని, వాటిని వినియోగించిన మానవాళి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఆర్డీఎస్ కిట్లు, రైతులకు ధ్రువ పత్రాలు పంపిణీ చేసినారు. మండల వ్యవసాయాధికారి చందవోలు సునీత మాట్లాడుతూ రైతులు యూరియా అధిక మోతాదని తగ్గించి, కొంత ప్రకృతి వ్యవసాయం వైపు మరలాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది, ఎఫ్ఎంటి నాగరాజ శశికాంత్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది త్రిపూర్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

# అధికార భాష కమిషన్ రాష్ట్ర సభ్యునికి తెలుగు భాషా సేవా పురస్కారం

**గుంటూరు విద్య జనవరి 2 ప్రభాతవార్త:** ఆంధ్ర సారస్వత పరిషత్ ఆంధ్రమేవ జయతే వారు జనవరి 3 నుండి గుంటూరులో నిర్వహించుచున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా ఈ కార్యక్రమంలో ఎంతోమంది కవులను, సాంస్కృతిక , సాహిత్య వేత్తలను, కళాకారులను జానపద రీతులను, అష్టావధానాలు, సహస్రవధానాలు ఆధ్యాత్మిక సభలు నిర్వహిస్తున్నారు. అన్ని రంగాల సాహిత్య సాంస్కృతిక కళల మేళవింపుల



కలయికతో ఈ సభలు జరుగనున్నాయి. ఈనెల నాలుగో తారీఖున ఆంధ్ర సారస్వత పరిషత్ వారు సేవా పురస్కారాలు వివిధ విభాగంలో ఇచ్చుచుండగా ఇందు ప్రధాన వేదికలో ఆంధ్ర వైభవ సదస్సు పేరుతో జరిగే కార్యక్రమంలో బహుముఖ భాషావేత్త తెలుగు భాషా ప్రేమాభిమాని జీవితాంతము తెలుగు భాష కోసం , తెలుగు వ్యాప్తి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న మండలి వెంకటకృష్ణారావు ఆంధ్రప్రదేశ్ అధికార భాష కమిషన్ రాష్ట్ర సభ్యులు, డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు తెలుగు భాష సేవా పురస్కారాన్ని అందుకోనున్నారు. వీరు తెలుగు భాషకు అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకొని ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగు భాషా సేవ పురస్కారానికి ఎంపిక చేయడం జరిగిందని ఆరోజున త్రిపుర గవర్నర్ ఎన్.ఇంద్రో ్సనారెడ్డి చేతుల మీదుగా డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు పురస్కారం ను అందుకుంటారు. డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు మూడో ప్రపంచ తెలుగు మహాసభల ఉత్సవ కమిటీలో కూడా సహ సమన్వయకర్తగా పనిచేస్తున్నారని ఆంధ్ర సారస్వత పరిషత్ మరియు మూడో ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమాల నిర్వహణ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఈ కార్యక్రమాల సందర్భంగా తెలియజేశారు.

# ఎన్ఎస్ఎస్ అవార్డులు లభించిన సందర్భంగా నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అభినందన కార్యక్రమం

**మంగళగిరి, జనవరి 2, ప్రభాతవార్త :** మంగళగిరి మండలం అత్మకూరు గ్రామంలోని నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో, కళాశాల ఎన్ ఎస్ ఎస వాలంటీర్లకు విశ్వవిద్యాలయ స్థాయి



అవార్డులు లభించిన సందర్భంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. 2024-2025 విద్యా సంవత్సరానికి గాను నిర్మల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ యూనిట్‌కు విశ్వవిద్యాలయ స్థాయి ఎన్ ఎస్ ఎస్ అవార్డులు లభించాయి. విశ్వవిద్యాలయ స్థాయిలో ప్రకటించిన ఆరు అవార్డుల్లో రెండు అవార్డులు ఈ కళాశాల విద్యార్థులు సాధించడం విశేషం. వరుసగా మూడో సంవత్సరంగా కూడా ఎన్ఎస్ఎస్ అవార్డులు పొందడం కళాశాలకి గర్వకారణంగా నిలిచిందన్నారు. సంజన, సి హెచ్. కార్తికేయ శ్రీరామ్ వీరు చేసిన నిరంతర సామాజిక సేవలకు గుర్తింపుగా డిసెంబర్ 30, 2025న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులు అందజేశారు. అవార్డు గ్రహీతలను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఘనంగా అభినందించారు. రెవ్. సిస్టర్ డా. యు. సౌరీలు, సెక్రటరీ, కారస్పాండెంట్ రెవ్. సిస్టర్ జి. నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేఖా నరేష్ బాబు పాల్గొన్నారు.

# 4నుండి శ్రీత్యాగరాజ స్వామి 179వ ఆరాధన సంగీత మహోత్సవాలు ప్రారంభం

**గుంటూరు కల్చరల్,జనవరి 2,ప్రభాతవార్త :** స్థానిక లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో శ్రీత్యాగరాజ స్వామి 179వ అరాధన సంగీత మహోత్సవాలు 04-01-2026 నుంచి 08-01- 2026 వరకు నిర్వహించనున్నట్లు ప్రాంగణంలో జరిగిన సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40సంవత్సరాలుగా నిరాటంకంగా నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధన సంగీత మహోత్స వాలు గుంటూరుకు ఒక విశేషం అన్నారు. ఉపాధ్యక్షులు గిరిజాశంకర్ మాట్లాడుతూ మొదటి రోజు ఉదయం సభ ఉత్సవ ప్రారంభం, ప్రతిరోజు ఉదయం లఘు కచేరీలు, సాయంత్రం శాస్త్రీయ సంగీత కచేరీలు జరుగుతాయన్నారు. ప్రధాన కచేరీలో భాగంగా చెన్నై కళాకారులు



కె.ఎస్.విష్ణుదేవ్ నంబూద్రి,గాత్రకచేరి, రెండవరోజు సాయంత్రం చెన్నై కళాకారులు విశ్వాస్ వారి మాండలిన్ కచేరీ, మూడవరోజు సాయంత్రం డాక్టర్ సేలం గాయత్రీ చెన్నై వారి శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి ,బుధవారం అనిరుద్ సుబ్రహ్మణ్యం గాత్ర కచేరీ, గురువారం ఉదయం నాదస్వరం,త్యాగరాజ స్వామి అభిషేకం ,ఉంచ వృత్తి ఊరేగింపు,పంచరత్న సేవ, అన్నప్రసాద వితరణ జరుగుతాయన్నారు. అందరూ ఆహ్వానితులేనని ప్రతి ఒక్కరూ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# బంగారు తల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన

**గుంటూరు విద్య జనవరి 2 ప్రభాతవార్త :** గుంటూరు, కొత్తపేట లోని శ్రీమతి కాసు శాయమ్మ నగర పాలక ఉన్నత పాఠశాల కొత్తపేట నందు ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు బంగారు తల్లి ఫౌండేషన్ తరపున ఆళ్ళ సాయి కిరణ్ మోటివేషనల్ సెషన్ నిర్వహించడం జరిగినది. ఈ సెషన్ లో ఆడబిడ్డల చదువు, టైమ్ మేనేజ్మెంట్ , గోల్ ను రీచ్ అయ్యే విధానం మరియు కెరీర్ కు అవసరం అయ్యే గైడెన్స్ ను ఇచ్చి వారిని మోటివేషన్ ఇచ్చి వారిని చురుకుగా తయారయ్యేట్లుగా వివరించడం జరిగింది. సమాజాన్ని పట్టి పీడిస్తున్న డ్రగ్స్ మహమ్మారి గురించి వివరించి దాని వలన వచ్చే పర్యవసానాలను తెలియచేసి వారిలో అవేర్నెస్



తీసుకువచ్చారు, కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రధానం చేసి హెడ్మాస్టర్ జిలానీ బాషాని సన్మానించడం జరిగినది. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు అనువుగా స్టేడియం అభివృద్ధి

### -ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, జనవరి 2,ప్రభాతవార్త:** క్రీడాకారులకు అనువుగా డీవిసి మినీ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్



అన్నారు. స్థానిక నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని స్టేడియాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు, క్రీడాకారులను పరిచయం చేసేందుకే నాడు తమ హయాంలో దీన్ని నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వంతోపాటు దాతలు కూడా ముందుకు రావడం వల్ల ఈ స్టేడియాన్ని బాగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అయితే గత ప్రభుత్వం ఐదేళ్ళల్లో స్టేడియాన్ని సర్వనాశనం చేసిందన్నారు. దీంతీ స్టేడియంలోని వాకింగ్ ట్రాక్ కూడా పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పలువురు క్రీడాకారులు, ప్రజలు స్టేడియంలో వసతులు కల్పించాలని కోరడంతో అందుకు సమ్మతించి ప్రభుత్వం ఆధ్వర్యంలో స్టేడియంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి అవసరమైన మట్టిని కూడా నాణ్యతతో కూడినది వాడుతున్నట్లు చెప్పారు. ఇంకా ముమ్ముందు స్టేడియాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట మునిసిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్‌బాబు, పట్టణాభివృద్ధి కమిటి కన్వీనర్ షేక్ యాసిన్‌బాబా, నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులున్నారు.

# నేడు శివ ముక్కోటి

**పొన్నూరు, జనవరి 2,ప్రభాతవార్త:** పట్టణంలో అతిపురాతనమైన శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావనారాయణస్వామి వారి దేవాలయ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ కాశీవిశ్వేరస్వామివారి దేవాలయంలో శివ ముక్కోటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు దేవా లయం అసిస్టెంట్ కమిషనర్



గాండ్ల కామేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. శివ ముక్కోటిని పురస్కరించుకొని శనివారం వేకువజామున 5గంటలకు స్వామివారు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. శివ ముక్కోటి పర్వదినానికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. పర్వదినాన్ని పురస్కరించుకొని దేవాలయాన్ని అందంగా అలంకరించినట్లు చెప్పారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని ఆశీస్సులు పొందాలని కామేశ్వరమ్మ కోరారు.

# రీ సర్వేకు రైతులు సహకరించాలి

### -మండలంలో ఆరు గ్రామాల్లో రీ సర్వే ప్రారంభం -తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్

**పొన్నూరు, జనవరి 2,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన రీ సర్వే కార్యక్రమం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ అన్నారు. నాల్గవ విడత రీ సర్వే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కొండముది, ములుకుదురు, జడవల్లి, జూపూడి, మునిపల్లె, వెల్లలూరు గ్రామాల్లో రీ సర్వేని ప్రారంభించారు. గత నెల 30వ తేదీన



ఈ రీ సర్వేకి సంబంధించి రైతులతో సమావేశమై రీ సర్వే వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులు తమ వద్ద ఉన్న పత్రాలతో రీసర్వే సిబ్బందిని కలిసి సమస్యలను వివరించుకోవచ్చన్నారు. ప్రతి రైతుకు పక్కాగా దృవీకరణ పత్రాలు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అందులో భాగంగానే రీ సర్వేని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి బృందంలో ముగ్గురు గ్రామ సర్వేయర్లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్యే ఉంటారన్నారు. రైతులు సిబ్బందికి సహకరించి తమ భూములకు సంబంధించిన ఖచ్చితమైన పత్రాలు పొందేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెనాలి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ జయరాజ్, మండల సర్వేయర్ అడపాల సత్యనారాయణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, వీఆర్వోలు, వీఆర్యేలు పాల్గొన్నారు.

# విజ్ఞాన్స్‌మహోత్సవ్-2కే26 క్రికెట్ విజేతగా ఎంబీయూ


**పొన్నూరు, జనవరి 2,ప్రభాతవార్త:** చేబ్రోలు మండలం,వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 19వ ఎడిషన్ విజ్ఞాన్స్ మహోత్సవ్-2కే26లో భాగంగా జరిగిన జాతీయస్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ) జట్టు విజేతగా నిలిచింది. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా విజ్ఞాన్స్ వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ హాజరై ఇరుజట్ల ఆటగాళ్ళకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన టాస్ వేసి ఫైనల్ మ్యాచ్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఫైనల్‌లో విజయవాడకు చెందిన సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలతో తలపడిన మోహన్‌బాబు యూనివర్సిటీ జట్టు ఉత్కంఠభరితమైన పోరులో ఆరు పరుగుల తేడాతో విజయం సాధించి చాంపియన్స్‌గా నిలిచింది. చివరి ఓవర్ల వరకు ఉత్కంఠ కొనసాగిన ఈ మ్యాచ్ ప్రేక్షకులను అలరించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేసిన మోహన్‌బాబు యూనివర్సిటీ జట్టు నిర్ణీత 10ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 96పరుగులు చేసింది. జట్టులో హర్ష 3ఫోర్లు, 1 సిక్సర్‌తో 26పరుగులు, పృథ్వీ యాదవ్ రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో 20పరుగులు, ఎ.గౌతమ్ 14 పరుగులు, కెప్టెన్‌దినేష్ 12పరుగులు చేశారు. సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల బౌలర్లలో డీకె. భవానీ ప్రసాద్ చెరో రెండు వికెట్లు తీసి ఆకట్టుకున్నారు. అనంతరం 97పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల జట్టు నిర్ణీత 10ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 90పరుగులు మాత్రమే చేసి ఆరు పరుగుల తేడాతో పరాజయం పాలైంది. సిద్ధార్థ కళాశాల బ్యాట్స్‌మెన్‌లలో సోహన్ చౌదరి 5ఫోర్లు, ఒక సిక్సర్‌తో 39పరుగులు, సాల్మన్ వెస్లీ 2సిక్సర్లతో 25పరుగులు చేసి పోరాడారు. మోహన్‌బాబు యూనివర్సిటీ బౌలర్లలో ప్రవీణ్‌కుమార్, హర్ష, వివేక్‌రెడ్డి చెరో వికెట్ సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. మూడో స్థానానికి



జరిగిన పోటీలో కళ్ళం హరినాథ్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలపై కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల 7పరుగుల తేడాతో విజయం సాధించి మూడో స్థానాన్ని కైవసం చేసుకొంది. ఈ జాతీయస్థాయి క్రికెట్ చాంపియన్ షిప్‌లో విజేతలుగా నిలిచిన జట్లకు ఫిబ్రవరి 7వ తేదీన జరిగే విజ్ఞాన్స్ మహోత్సవ్-2కే26 ముగింపు వేడుకల్లో ప్రశంసా పత్రాలు, మెడల్స్‌లతోపాటు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ జాతీయ స్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్లఓ దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిభావంతమైన జట్లు పాల్గొనడం విశేషమని తెలిపారు. విజ్ఞాన్స్ మహోత్సవ్-2కే26లో భాగంగా నిర్వహించిన ఈ క్రీగా పోటీలు విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, జట్టు సమన్వయాన్ని పెంపొందించేందుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డైరెక్టర్లు, కోచ్‌లు, మెంటర్లు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని మ్యాచ్‌ను ఉత్సాహంగా తిలకించారు.

# వందరోజుల కార్యాచరణలో భాగంగా,కమిషనర్ పర్యటన

**తెనాలి మున్సిపాలిటీ జనవరి2(ప్రభాతవార్త):** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం, మున్సిపల్ కమిషనర్ మరియు 31వ వార్డు కౌన్సిలర్ గోగిరెడ్డి మానస



రెడ్డి,చెంచుపేట లోని కోగంటి శివయ్య మున్సిపల్ పాఠశాల ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో కమిషనర్ ఆత్మీయంగా పరస్పర చర్చ నిర్వహించారు. పిల్లల విద్యా ప్రగతి,ఆరోగ్యం, క్రమశిక్షణ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్న కమిషనర్,వారి సమగ్ర అభివృద్ధి కోసం ఉపాధ్యాయులకు తగిన సూచనలు మరియు మార్గదర్శకాలు అందజేశారు. పిల్లలకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడంతో పాటు,వారి భవిష్యత్తు లక్ష్యాల సాధనకు అవసరమైన సహకారం అందించాలని ఈ సందర్భంగా కమిషనర్ సూచించారుఅనంతరం పట్టణంలోని ఐతానగర్ లో నిర్మిస్తున్న ఫైకస్ థీమ్ పార్కును,మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు సందర్శించారు. పార్కులో చేపట్టిన పనులను పరిశీలించిన ఆయన ఇంజనీరింగ్ విభాగ అధికారులకు పలు సూచనలు చేశారు పనుల్లో నాణ్యత ఉండాలని అనుకున్న ప్రకారం సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ పార్కు ప్రజలకు అందుబాటులోకి వచ్చాక ఎంతో ఆహ్లాదకరంగా ఉపయోగపడే విధంగా ఉంటుందని కమిషనర్ తెలిపారు.

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను వేగవంతం చేయాలి

### -తహశీల్దార్ మహమ్మదహ జియావుల్ హక్

**పొన్నూరు, జనవరి 2,ప్రభాతవార్త:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించిన నమోదు



ప్రక్రియను వేగవంతం చేయాలని తహశీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం పొన్నూరు పట్టణ, మండల బిఎల్వోల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఎల్వోలు ప్రతి ఇంటికి వెళ్ళి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించిన ఓటరు మ్యాపింగ్‌ను పూర్తి చేయాలన్నారు. బిఎల్వోలు ఇప్పటి వరకు చేసిన ప్రగతికి సంబంధించిన వివరాలను పేరు పేరున అడిగి తెలుసుకొన్నారు. ఓటర్ల జాబితాలో డుబుల్ ఎంట్రీలు, మరణించిన ఓటర్లు, స్పష్టత లేని ఫోటోలను తొలగించాలన్నారు. కొత్త ఫోటోలను చేర్పించేవిధంగా బిఎల్వోలు కృషి చేయాలన్నారు. 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించాలన్నారు. ఈ నెలలో జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఓటర్ల జాబితా తయారీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సమావేశంలో కార్యాలయ సూరింటెండెంట్ ఆలేటి మాధవి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్లు సయ్యద్ లాల్, షేక్ సిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ కస్టమర్లకు,నూతన సంవత్సరం ప్రతేకఆఫర్:

**తెనాలి టౌన్ జనవరి2(ప్రభాతవార్త):** నూతన సంవత్సర 2026 సందర్భముగా, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బి.యస్.యన్.ఎల్ ) జనవరి1నుండి31,వరకు నెల రోజులపాటు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా ఎఫ్ఆర్సి 1 "ఫ్రీడమ్ ప్లాన్ " మళ్లీ ప్రారంభించబడింది. కేవలం రూ.1తో 30 రోజుల వ్యాలిడిటీ కలిగిన ఈ ప్లాన్‌లో అపరిమిత కాలింగ్,రోజుకు 2 జిబి డేటా,రోజుకు 100 మెసేజీలు మరియు ఉచిత సిమ్ కార్డు అందించబడుతుంది. ఈ ఆఫర్ ఎం.యన్.పి. వినియోగదారులకు కూడా వర్తిస్తుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెనాలి డివిజనల్ ఇంజనీర్, ఆపరేషన్స్,ఆకవరపు శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సిమ్ కార్డు కావలసిన వారు తమ దగ్గరలోని బి.యస్.యన్.యల్ సేవా కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు.

# ప్రపంచ తెలుగుమహాసభల్లో, ప్రముఖ శిల్పి,కళారత్న కాటూరిఖికి పురస్కారం

**తెనాలి టౌన్ జనవరి2(ప్రభాతవార్త):** ఆంధ్ర సారస్వత పరిషత్తు వారి ఆధ్వర్యంలో,జనవరి 3,4,5 తేదీల్లో,గుంటూరులో మూడు రోజులపాటు జరగనున్న మహాసభల్లో, పట్టణానికి చెందిన ప్రముఖ శిల్పి కళా రత్న కాటూరి వెంకటేశ్వరరావు కి ఆంధ్రశ్రీపూర్ణకుంభ పురస్కారం ప్రధానం చేయనున్నారు. ఈ మహాసభల సందర్భంగా తెలుగు శిల్ప కళకు విశిష్ట సేవలు అందించిన ప్రముఖ శిల్పి,కళా రత్న శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు కి ఆంధ్రశ్రీ పూర్ణకుంభ పురస్కారం ప్రదానం చేస్తున్నారు. ఈ మహాసభల సందర్భంగా కాటూరి వెంకటేశ్వరరావు రూపొందించిన ఐరన్ స్క్రాప్ విగ్రహాలతో కూడిన ఫోటో ఫ్రేములు,అలాగే కొన్ని ప్రత్యేక శిల్పకళాఖండాలు ప్రదర్శనకు ఉంచనున్నారు. తెలుగు భాష, సంస్కృతి, కళల అభివృద్ధికి అంకితమైన ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో ఈ పురస్కారం అందుకోవడం పై తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు,ఆయన తనయుడు రవిచంద్ర. ఈ సందర్భంగా, పలువురు కాటూరి వెంకటేశ్వరరావు అభిమానులు,సన్నిహితులు,కాటూరి ఆర్ట్ గ్యాలరీ సిబ్బంది హర్షం వ్యక్తంచేశారు.



# డబ్ల్యూపిఎల్‌లో.. అత్యధిక రన్స్ చేసిన ప్లేయర్స్



నాట్ స్కైవర్‌బ్రంట్ | ఎల్లీస్ పెర్రీ | మెగ్ లానింగ్ | షఫాలీ వర్మ | హర్మన్‌ప్రీత్ కౌర్

## అగ్రస్థానంలో స్కైవర్‌బ్రంట్

## టాప్ 5లో చోటు దక్కని స్మృతి

**న్యూఢిల్లీ:** ఉమన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్)-2026 ఈ నెల 9న ప్రారంభమవుతుంది. టోర్నమెంట్ తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరుతో తలపడ నుంది. టోర్నమెంట్ చరిత్రలో, ముంబై రెండు టైటిళ్లను గెలుచుకోగా, బెంగుళూరు ఒక టైటిల్‌ను గెలుచుకుంది. ఇక ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యధిక పరుగులు చేసిన ఐదుగురు మహిళా ప్లేయర్లు ఉన్నారు. ఇందులో భారత్ మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన పేరు మాత్రం లేదు. ఈ టాప్ 5 ప్లేయర్ల జాబితాలో అగ్రస్థానంలో నాట్ స్కైవర్‌బ్రంట్ ఉంది. ఆమె 29 మ్యాచ్‌ల్లో 1,027 పరుగులు చేసింది. ముంబైలో కీలక సభ్యురాలైన నాట్ స్కైవర్‌బ్రంట్ 46.68 సగటుతో అద్భుతమైన స్కోరు చేసి, 8 అర్ధ సెంచరీలు కూడా చేసింది. ఇవి ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాయి. రెండవ స్థానంలో రాయల్ ఛాలెంజర్స్ ప్లేయర్ ఎల్లీస్ పెర్రీ ఉంది. పెర్రీ మహిళల ప్రీమియర్ లీగ్ చరిత్రలో అత్యంత నమ్మకమైన బ్యాట్స్‌మెన్‌లలో ఒకరిగా పరిగణించ బడుతోంది. ఆమె 25 మ్యాచ్‌ల్లో 64.80 సగటుతో 972 పరుగులు చేసి, 8 హాఫ్ సెంచరీలు కూడా చేసి బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచింది. అలాగే ఢిల్లీ క్యాపిటల్స్ మాజీ కెప్టెన్ మెగ్ లానింగ్ మూడో స్థానంలోఉంది. ఆమె 27 మ్యాచ్‌ల్లో 952 పరుగులు చేసింది, సగటున 39.66తో, తొమ్మిది అర్ధ సెంచరీలు చేసింది. లానింగ్ తన జట్టుకు స్థిరంగా మంచి ఆరంభాలను అందించింది. నాలుగో స్థానంలో యువ మరియు దూకుడు బ్యాట్స్‌మెన్ షఫాలీ వర్మ ఉంది. ఆమె నిర్భయమైన ఆటతీరు డబ్ల్యూపిఎల్‌లో ప్రత్యేకంగా నిలుస్తుంది. ఆమె 27 మ్యాచ్‌ల్లో 865 పరుగులు చేసింది. ఆమె స్ట్రైక్ రేట్ 162.59చూస్తే ఎంతత్వరగా స్కోరు చేస్తుందో చూపిస్తుంది. ఆమె ఆరు అర్ధ సెంచరీలు చేయగా, బౌలర్లను ఎల్లప్పుడూ ఒత్తిడిలోఉంచుతుంది. ఐదవ స్థానంలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఉంది. ఆమె జట్టు మిడిల్ ఆర్డర్‌లో బలమైన ప్లేయర్‌గా ఉంది. ఆమె 27 మ్యాచ్‌ల్లో 851 పరుగులు చేయగా, సగటున 40.52తో 8 అర్ధ సెంచరీలు చేసింది. హర్మన్‌ప్రీత్ కౌర్ తరచుగా తన జట్టును విజయాల వైపు నడిపిస్తుందిమరియు మ్యాచ్‌లను ముగించడంలో నిష్ణాతురాలు.



# నేడే రెజ్లింగ్ లీగ్ వేలం

## ఆమన్, అంతిమ్, అన్షులకు డిమాండ్

**న్యూఢిల్లీ:** ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్) వేలం పాటకు రంగం సిద్ధమైంది. జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ (డబ్ల్యూఎఫ్ఐ) ఆధ్వర్యంలో తొలిసారి ఈనెల 3న జరుగనున్న పీడబ్ల్యూఎల్ కోసం ప్లేయర్ల ఎంపిక ప్రక్రియ అన్ని హంగులతో సమాయత్తమైంది. ఆటగాళ్లను కొనుగోలు చేసుకొనేందుకు ఆరు ఫ్రాంచైజీలు మెగా వేలంలో పాల్గొనున్నాయి. ఒక ప్రొ రెజ్లింగ్ టోర్నమెంట్ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరగనుంది. రాబోయే సీజన్‌లో హర్యానా థండర్స్, టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్, పంజాబ్ రాయల్స్, మహారాష్ట్ర కేసరి, ఢిల్లీ దంగల్ వారియర్స్, యుపి డామినేటర్స్ ఫ్రాంచైజీలు రెజ్లింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ప్రధానంగా పారిస్(2024) ఒలింపిక్స్ కాంస్య విజేత అమన్ సెహ్రావత్‌తో పాటు, విదేశీ స్టార్ రెజ్లర్లు యుయి సుసాకి, యుసెనిలిస్ గుజ్‌మన్ లోపెజ్ రూ.18 లక్షల కనీస ధరతో వేలంలోకి అడుగుపెడుతున్నారు. మహిళల విభాగంలో ప్రపంచ చాంపియన్‌షిప్ మెడలిస్టు అంతిమ్ పంగల్, అన్షు మాలిక్, కామన్వెల్ క్రీడల పతక విజేత దీపక్ పునియా, నవీన్ రూ.10లక్షల బేస్ ధరతో వేలం రేసులో నిలువగా, అత్యుత్తమ రెజ్లర్లలో ఒకరైన సుజీత్ కల్కల్ రూ.7లక్షలతో కనీస ధరతో వేలంలో దిగాలని నిర్ణయించుకున్నాడు. మహిళల విభాగంలో అంతిమ్ పంగల్ రూ.10లక్షల బేస్ ధరతో వేలం రేసులో నిలిచింది. ఇక ఆషూ మాలిక్, జాతీయ ఛాంపియన్ స్మృతి షిండే రూ.10లక్షల, ఒలింపిక్ ఛాంపియన్, జపాన్‌కు చెందిన యూ రూ.18లక్షలతో వేలం బరిలో దిగుతోంది. క్యూబా, ఉక్రెయిన్, అజర్‌బైజాన్, రష్యా రెజ్లర్లు కూడా భారత్ వేదికగా జరిగే ప్రొ రెజ్లింగ్ వేలం కోసం రిజిస్టర్ చేయించుకున్నారు. వీరంతా కనీస ధర రూ.5లక్షల నుంచి 10 లక్షలలోపు రిజిస్టర్ చేయించుకున్నారు.



## ఇంటర్నేషనల్ లీగ్ టి20..

# ఫైనల్ బెర్త్‌కు నైట్‌రైడర్స్

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ లీగ్ టి20, 2025-26 ఎడిషన్ చివరి దశకు చేరింది. క్వాలిఫయర్-1లో గెలిచి డెజర్ట్ వైపర్స్ నేరుగా ఫైనల్స్ బెర్త్‌ను ఖరారు చేసుకోగా, మరో ఫైనల్ బెర్త్ కోసం పోటీ జరిగింది. దుబాద్ వేదికగా జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో అబుదాబీ నైట్‌రైడర్స్ దుబాయ్ క్యాపిటల్స్‌పై తిరుగులేని విజయం సాధించి క్వాలిఫయర్స్-2కు అర్హత సాధించింది. ఈ ఎలిమినేటర్ మ్యాచ్‌లో క్యాపిటల్స్‌పై అబుదాబీ నైట్‌రైడర్స్ 50పరుగుల తేడాతోగెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన నైట్‌రైడర్స్ మైఖేల్ పిప్పర్ (72), ఫిల్ సాల్ట్ (43), జేసన్ హోల్డర్ (22 నాటౌట్) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 158 పరుగులు చేసింది. క్యాపిటల్స్ బౌలర్లలో నబీ 3 వికెట్లతో సత్తా చాటగా, హైదర్ అలీ, వకార్ సలాంఖిల్ తలో వికెట్ తీశారు. అనంతరం ఒక మోస్తరు లక్ష్య ఛేదనలో చేతులెత్తేసిన క్యాపిటల్స్ 16.2 ఓవర్లలో 108 పరుగులకే ఆలౌటై ఘోర పరాజయాన్ని ఎదుర్కొంది. సునీల్ నరైన్ (3-0-12-3), జేసన్ హోల్డర్ (3.2-0-18-3), లివింగ్‌స్టోన్ (4-0-26-3) అద్భుతంగా బౌలింగ్ చేసి క్యాపిటల్స్ పతనాన్ని శాసించారు.

## ఉమన్స్ హాకీ లీగ్‌లో..

# బెంగాల్ టైగర్స్ విజయం

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఇండియా లీగ్ (డబ్ల్యూహెచ్ఐఎల్), 2025-26, షూటౌట్‌లో శ్రాచి బెంగాల్ టైగర్స్ 4-3తో ఎస్‌జి పైపర్స్‌ను ఓడించింది. నిర్ణీత సమయం ముగిసే సమయానికి ఇరుజట్లు 3-3తో సమంగానిలిచాయి. లాల్రెమ్సియామి సడన్‌డెత్ గోల్‌తో బోనస్ పాయింట్‌ను దక్కించుకుంది. టైగర్స్ తరపున అగస్టినా గోర్జెలానీ (6వ నిముషం, 18), లాల్రెమ్సియామి (11) నిర్ణీత సమయంలో గోల్స్ సాధించగా, పైపర్స్ తరపున లోలా రియారా (10, 60), సునెలిటా టోప్పో (59) గోల్స్ చేశారు. టైగర్స్ తొలి ఎంట్రీ దూకుడుగా ప్రారంభించి వరుసగా పెనాల్టీ కార్నర్‌లను సంపాదించింది. గోర్జెలానీ ద్వారా గోల్‌గా మార్చి ఆధిక్యంలోకి తెచ్చింది. పైపర్స్‌కు చెందిన లోలా తనదైన పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుని స్కోర్‌ను సమంచేసింది. తదుపరి లాల్రెమ్సియామి టైగర్స్ ఆధిక్యాన్ని పునరుద్ధరించే యత్నంలో గోల్ చేసి 2-1 ఆధిక్యాన్ని ఇచ్చింది. ఆ తర్వాత గోర్జెలానీ పెనాల్టీ కార్నర్ నుండి మళ్లీ కొట్టడంతో టైగర్స్ రెండవ క్వార్టర్‌లో తమ ఆధిక్యాన్ని పెంచుకుంది. ఎస్‌జీ పైపర్స్ నిరంతర దాడులు చేసినప్పటికీ, టైగర్స్ గోల్ కీపర్ జెన్నిఫర్ రిజ్జో వరుస



సేవ్‌లను చేసి తన జట్టును హాఫ్ టైం నాటికి 3-1తో ఆధిక్యంలో ఉంచింది. రెండవ అర్ధభాగాన్ని పైపర్స్ దాడులను ప్రారంభించి పెనాల్టీ కార్నర్‌ను సంపాదించినా అది పరిగణలోకి రాలేదు. నాల్గవ క్వార్టర్ పైపర్స్ చివరికి పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కెప్టెన్ నవనీత్ కౌర్ షాట్‌ను సునేలిత నేర్పుగా తిప్పికొట్టి స్కోరును ఒకే గోల్‌కు తగ్గించింది. అయితే షూటౌట్‌లో టైగర్స్‌కు పరిస్థితులు అనుకూలించడంతో విజయం సాధించింది.

# లక్నో లయన్స్ హ్యాట్రిక్

## రామ్‌దూట్స్‌పై 48-33తో గెలుపు

**న్యూఢిల్లీ:** అవధ్ రామ్‌దూట్స్‌పై ఆధిపత్య విజయంతో లక్నో లయన్స్ కొత్త సంవత్సరాన్ని ప్రారంభించింది. ఉత్తరప్రదేశ్ కబడ్డీ లీగ్, సీజన్ 2, ఎనిమిదో రోజు ప్రారంభ మ్యాచ్‌లో లక్నో లయన్స్ 48-33 తేడాతో రామ్‌దూట్స్‌ను ఓడించి మరో కమాండింగ్ ప్రదర్శనను అందించి నూతన సంవత్సరాన్ని ప్రారంభించింది. తొలి అర్ధభాగం యువ రైడర్ శివమ్‌చౌదరి నేతృత్వంలోని లక్నో జట్టుకు అనుకూలంగా ఉంది. అతను అవధ్ డిఫెన్స్‌ను పదే పదే ఇబ్బంది పెట్టాడు.



శివమ్ కేవలం ఎనిమిది రైడ్‌లలో 10 పాయింట్లు సాధించడంతో లక్నో జట్టు ఆధిపత్యాన్ని పెంచింది. నిరంతర ఒత్తిడి ఫలితంగా లక్నో లయన్స్ 13 పాయింట్ల ఆధిక్యంతో హాఫ్ టైంలోకి దూసుకెళ్లి పోటీపై పట్టు సాధించింది. విరామం తర్వాత అవధ్ రామ్‌డూట్స్ తిరిగి పుంజుకోవడానికి ప్రయత్నించింది. అయితే శివంమరో కీలకమైన దాడితో మూడు పాయింట్లను సంపాదించాడు. చివరి దశలో మ్యాచ్ మందగించడంతో, లక్నో లయన్స్ ఆటను తెలివిగా నిర్వహించి చివరికి 48-33 తేడాతో సమగ్ర విజయాన్ని సాధించింది.

# వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలు పైపైకి..




## మెటల్, ఆటో, పిఎస్‌యు బ్యాంకింగ్ షేర్ల ర్యాలీ

**ముంబయి, జనవరి 2:** భారత ఈక్విటీ మార్కెట్లువారాంతపు ట్రేడింగ్‌లో సరికొత్త రికార్డులు సృష్టించాయి. మెటల్, ఆటో, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో బలమైన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు భారీగా లాభపడ్డాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 573 పాయింట్లు లాభపడి 85,762 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 182 పాయింట్లు పెరిగి 26,328 వద్ద ముగిసింది. ట్రేడింగ్ సమయంలో నిఫ్టీ 26,330 వద్ద ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని తాకింది. బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్ల జోరు కొనసాగడంతో బ్యాంక్ నిఫ్టీ కూడా 60,152.35 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠాన్ని నమోదు చేసింది. రంగాల వారీగా చూస్తే, పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 1.78 శాతం లాభంతో టాప్ గెయినర్‌గా నిలిచింది. ఆటో, మెటల్, రియల్టీ, పవర్ సూచీలు కూడా 1 శాతం చొప్పున లాభపడ్డాయి. అయితే, ఎఫ్ఎంసీజీ రంగం మాత్రం 1.15 శాతం నష్టపోయింది. మార్కెట్ ముగిసేసరికి, 2,527 షేర్లు లాభాల్లో ముగియగా, 1,347 షేర్లు నష్టపోయాయి. వాహన విక్రయాల గణాంకాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో ఆటో షేర్లలో కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. దేశీయంగా స్థూల ఆర్థిక పరిస్థితులు స్థిరంగా ఉండటం, దేశ వృద్ధిపై విశ్వాసం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్నిచ్చాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.04 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.78 శాతం చొప్పున లాభపడ్డాయి. నిఫ్టీ 26,300 స్థాయికి పైన స్థిరంగా కొనసాగితే, ర్యాలీ 26,500 వరకు వేగవంతం కావచ్చు. అదే జోరు కొనసాగితే 26,700 స్థాయికి చేరే అవకాశం ఉందని ఒక నిపుణులు అంచనావేసారు. ఇదిలా ఉండగా, ట్రేడింగ్ సెషన్‌లో యూఎస్ డాలర్‌తో రూపాయి మారకం విలువ 90 మార్కును దాటి బలహీనపడింది. రాబోయే కార్పొరేట్ ఫలితాలపై సానుకూల అంచనాలతో మార్కెట్‌లో సానుకూల ధోరణి కొనసాగుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇక బిఎస్ఇలో మిడ్ క్యాప్‌సైచీ 0.97శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.79శాతంపెరిగాయి. మార్కెట్ల పరంగా బిఎస్ఇలో 2772 షేర్లు పెరిగితే 1449 కంపెనీలషేర్లు క్షీణించాయి. 150 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగినట్లు తెలుస్తోంది. ఇక ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఫిబ్రవరి 5వ తేదీనాటికి 0.76 శాతం పెరిగి రూ.1,36,830కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడి చమురు మార్చినెల సెటిల్‌మెంట్‌చేసుకన్నది 04సెంట్లు క్షీణించింది. బ్యారెల్‌కు 60.81 డాలర్లు చొప్పున ధరలు కొనసాగాయి.



# డార్క్‌స్టోర్ నెట్‌వర్క్ వల్లే స్పీడ్ డెలివరీలు

## జొమాటో సిఇఒ

**ముంబయి, జనవరి 2:** జొమాటో, బ్లింకిట్ అందిస్తున్న 10నిమిషాల డెలివరీ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని ఆ కంపెనీ వ్యవస్థాపకుడు, సీఈఓ దీపిందర్ గోయల్ బయటపెట్టారు. స్పీడ్ డెలివరీకి డెలివరీ పార్ట్‌నర్లు వేగంగా వాహనాలు నడపడం కారణం కాదని, కస్ట మర్లకు అత్యంత సమీపంలో దట్టంగా ఏర్పాటుచేసిన 'డార్క్ స్టోర్ల నెట్‌వర్కే' కీలకమన్నారు.డెలివరీ ఏజెంట్ల భద్రతపై వస్తున్న ఆందోళనలు, న్యూఇయర్ సందర్భంగా కొందరు గిగ్‌వర్కర్లు చేసిన సమ్మె నేపథ్యంలో ఆయన సోషల్ మీడాయాలో వివరణ ఇచ్చారు. ఒకఆర్డర్ వచ్చినప్పుడు ప్యాకింగ్‌కు సుమారు 2.5 నిమిషాల సమయం పడుతుంది. డెలివరీసగటున 2కిలోమీటర్ల లోపు దూరంలోనే ఉంటుందని,గంటకు కేవలం 15కిలోమీటర్ల వేగంతో ప్రయాణించినా 8నిమిషాల్లో చేరవచ్చని వివరించారు.డెలివరీ ఆలస్యమైతే తమ ఏజెంట్లకు ఎలాంటి జరిమానాలు విధించమని,అలాగే సమయానికి డెలివరీ చేసినందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా ఉండవని ఆయన తేల్చి చెప్పారు.దీనివల్ల వారిపై ఎలాంటి ఒత్తిడి ఉండదని పేర్కొన్నారు.డెలివరీ పార్ట్‌నర్లు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారనే ఆరోపణలపైనా గోయల్ స్పందించారు. ఇది కేవలం డెలివరీ పార్ట్‌నర్ల సమస్య కాదని, మన సమాజంలోనే చాలా మందికి తొందర ఎక్కువ అని ఆయన అన్నారు. యూనిఫాంలో ఉండటం వల్ల తమ వాళ్లు సులభంగా కనిపిస్తారని అన్నారు. కాగా, నిరసనల మధ్యే న్యూఇయర్ రోజున జొమాటో, బ్లింకిట్ కలిసి రికార్డు స్థాయిలో 75లక్షల ఆర్డర్లను డెలివరీ చేసినట్లు తెలిపారు.

# 92 కంపెనీలపై వచ్చిన 109 ఫిర్యాదులు పరిష్కారం

## బాంబే స్టాక్ ఎక్ఛేంజి వెల్లడి



**ముంబయి, జనవరి 2:** బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి గత ఏడాది డిసెంబరునెలలోఇన్వెస్టర్లనుంచి వచ్చిన 109 ఫిర్యాదులను పరిష్కరించింది. మొత్తం 92 కంపెనీలపై 109 మంది ఇన్వెస్టర్లు ఫిర్యాదులుచేసారు. కొత్తగా 141 ఫిర్యాదులు స్వీకరించిన బిఎస్ఇ వీటిని కూడా పరిశీలిస్తోంది. అదే డిసెంబరు నెలలో 113 ఫిర్యాదులు మా త్రమే వచ్చాయని తెలిపింది. వాటిలో 92 కంపెనీలక చెందిన 109 ఫిర్యాదులను పరిష్క రించామని వెల్లడించింది. జెఎస్‌డబ్ల్యు స్టీల్, మధువీర్‌కామ్ 18 నెట్‌వర్క్ లిమిటెడ్, ధని సర్వీసెస్ వంటి ఫిర్యాదులు పరిష్కారానికి నెలరో జులకుపైగా వ్యవధి తీసుకుందని తెలిపారు. ఇన్వెస్టర్లనుంచి ఫిర్యాదులకోసం సెబీ ఆన్‌లైన్ ఫిర్యాదుల ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసింది. ఈ ఫిర్యాదుల విభాగాన్నిస్కోర్స్ అని పిలుస్తున్నారు. అంటే సెబీ కంప్లయింట్ రిడ్రెస్ సిస్టమ్‌ను స్కోర్స్‌గా చెపుతున్నది. గతంలో బిఎస్ఇ ఇన్వె స్టర్లకు హెచ్చరికలు చేసింది. ఆదిత్య రిషబ్‌మిశ్రా అనే వ్యక్తి ఇన్వెస్టర్లకు చట్టవిరుద్ధంగా అక్రమ సేవలు సలహాలు ఇస్తున్నట్లు వెల్లడించింది. ఇలాంటి వ్యక్తులనుంచి ఆ వ్యక్తులు ఆఫర్‌చేసే సేవలకు దూరంగా ఉండాలని సూచించింది. బిఎస్ఇలో రిజిస్టరు అయిన వ్యక్తులనుంచి మాత్రమే ఇన్వెస్టర్లు సేవలు పొందాలని సూచించింది. అలాగే ఆర్‌బిఐ కూడా ప్రజల్లో అవగాహన పెంచే కార్యనరకమాలుచేపట్టింది.డిజిటల్ కార్యక్రమాల్లో పూర్తి అవగాహన కలిగి ఉండాలని, టివిలు, ప్రింట్, ఎస్ఎంఎస్, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో విస్తృత ప్రచారం చేస్తోంది. ఆర్‌బిఐ కెహతాహై ప్రచారం బి అవేర్ బుక్‌లెట్, వంటివి పెట్టుబడులపట్ల ఇన్వెస్టర్లలో అవగాహన పెంచే కార్యక్రమాలు చేస్తోంది.

# 2027 నాటికి భారత్ ఆర్థికవృద్ధి 11%

## ఎస్‌బిఐ మ్యూచువల్ ఫండ్స్ నివేదిక

**న్యూఢిల్లీ, జనవరి 2:**భారత్ స్థూల దేశీయోత్పత్తివృద్ధి 2027నాటికి 11 శాతానికి చేరుతుందని ఎస్‌బిఐ మూచువల్‌ఫండ్ నివేదిక ప్రకటించింది. వాస్తవ జిడిపి వృద్ధిరేటు 7.2శాతంగా ఉంటుంది. దేశీయంగా వినియోగం పెరగడం, ప్రభుత్వ విధానాల మద్దతుతో వృద్ధి సులువుగా లక్ష్యం చేరుకుంటుందని వెల్లడించింది. భౌగోళికంగా అంతర్జాతీయంగా అనిశ్చితులు ఉన్నప్పటికీ దేశీయ పరిస్థితులు ఆర్థికవృద్ధికి ఎక్కువ ఊతం ఇస్తున్నట్లు తెలిపింది. జిఎస్టీ రీడిజైన్, కొత్త కార్మికచట్టాలు, మెరుగుపడిన ఆర్తిక పరిస్థితులు, పెట్టుబడులు గణనీయంగా వృద్ధి, కార్పొరేట్ కంపెనీల ఆస్తి అప్పుల పట్టీలు వృద్ధి వంటివి ఇందుకు దోహదంచేస్తాయని ఎస్‌బిఐ మూచువల్‌ఫండ్ ప్రకటించింది. దేశీయంగా రుణాల్లో కూడా వృద్ధిక నిపిస్తుండటంతో వినియోగరంగ వ్యయంపెరుగుతుందని, మానిటరీ పాలసీలు కూడా వృద్ధికి ఆస్కారం ఇస్తున్నట్లు వివరించింది. జిఎస్టీ హేతుబద్దీకరణ, కార్మిక చట్టాలు,మౌలికవనరుల వృద్ధి వంటివి పుష్కలంగా ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తాయని ప్రకటించింది. పెట్టుబడుల సైకిల్‌పరంగా చూస్తే కంపెనీలకు




పెరుగుతున్నాయని, దీనివల్ల తక్కువ వడ్డీలకే రుణపరపతి లభ్యతతోపాటు మూలధన వ్యయం పెరిగేందుకు పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయని ఎస్‌బిఐ ఫండ్స్ వివరించింది. దీనికితోడు ద్రవ్యోల్బణం కూడా నాలుగు శాతానికి పెరగకుండా అటూ ఇటూగా దిగువస్థాయిలోనే నమోదవుతున్నదని ఫండ్స్ సంస్థ ప్రకటించింది. యాక్సిస్‌బ్యాంకు గత ఏడాది జిడిపి వృద్ధి 2027లో భారత్ 7.5శాతంగా ఉంటుందని వెల్లడించింది. అలాగే ఎస్ అండ్‌పి గ్లోబల్ సంస్థ కూడా జిడిపి వృద్ధి 6.5నుంచి ఏడుశాతం ఉం టుందని గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ప్రపంచ వ్యాప్త ఆర్థిక మందగమనం, భౌగోళిక పరిస్థితులు ఉద్రిక్తతలు మాత్రం కొంత ఆందో ళనకరం కాగలవని ఎస్‌బిఐ మూచువల్‌ఫండ్స్ అంచనావేసింది.

## అదానీ ఎంటర్‌ప్రైజెస్ రూ.1000 కోట్ల ఎన్‌సిడిల జారీ


**ముంబయి,జనవరి 2:** ఆదాని గ్రూప్‌లోని ఆదాని ఎంటర్‌ప్రైజెస్ మూడో ఎన్‌సిడిలను జారీచేసింది. ఈ బదలీకి వీలుకాని డిబెంచర్ల ద్వారా సుమారు 1000 కోట్లు నిధులు సేకరించేందుకునిర్ణయించింద.ఇ సాలీనా రిటర్నులు 8.90శాతంగా ఉంటుంది. అయితే వీటి కాలపరిమితి 24,36,50 నెలలుగా నిర్ధారించింది. ఈనెల 6వ తేదీ ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. స్థిరమైన ఆదాయం కోరుకునే ఇన్వెస్టర్లకు ఈ రాబడులు మంచి వేదిక అవుతుందని, కంపెనీ చెపుతోంది. ఈనిధులను రుణాలు తీర్చి రీఫైనాన్సింగ్ కోసం, సాధారణ కార్పొరేట్ అవసరాలకు ఖర్చుచేయనున్నట్లు వెల్లడించింది. డబుల్ ఎ, ఎప్లస్ రేటింగ్ ఉన్నట్లు ఆదాని వెల్లడించింది. ప్రాథమికంగా ఇష్యూబేస్ రూ.500 కోట్లు ఉంటుంది. అదనంగా మరో 500 కోట్లు సమీకరణకు కూడా వెసులుబాటు ఉంది. ఆరోతేదీ ప్రారంభం అయి 19వ తేదీ ముగుస్తుంది. సాలీనా రాబడులు 8.60శాతం నుంచి 8.90శాతం వరకూ ఉంటుంది. కంపెనీ ఆస్తులను వీటికి సెక్యూరిటీగా చూపిస్తోంది. 110శాతం సెక్యూరిటీ ఇస్తున్నట్లు




ఆదాని వెల్లడించింది. కేర్‌సంస్థ డబుల్‌ఎ, ఇక్రా డబుల్‌ఏ రేటింగ్‌ఇచ్చాయి. ప్రస్తుతం ఉన్న రుణాలను చెల్లించడంకోసం 75శాతం మిగిలిన 25శాతం కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తారు. కనీస ఎట్టుబడి 10 వేల రూపాయలుగా ప్రకటించింది. అంటే పది ఎన్సీడిలు తీసుకోవాలిస ఉంటుంది. ఈ నిధులతో మౌలి కవనరుల విస్తరణ, ఇంధనం, కొత్త వ్యాపారాలకకు వినియోగించేందుకు నిధులు ఖర్చు ఉంటుందని కంపెనీ ప్రకటించింది.

## ప్రైమరీ మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు

# రూ.34,336 కోట్ల పెట్టుబడి



**న్యూఢిల్లీ, జనవరి 2:** రిటైల్ ఇన్వెస్టర్లు ప్రైమరీ మార్కెట్లలో ఈ ఆర్థికసంవత్సరం ఎనిమిది నెలల కాలంలో 34,336 కోట్లు పెట్టుబడులు పెట్టినట్లు పారిశ్రామికవర్గాల డేటానుంచి తెలు స్తోంది. భారత్ మార్కెట్లు 2025లో గణనీయంగా నిదులు సేకరించాయి. 103 మెయిన్ బోర్డు ఐపిఒలు రూ.176 లక్షల కోట్లు సమీకరించగా 267 ఎస్ఎంఇ ఐపిఒలు సుమారు 11,435 కోట్లు సేకరించాయి. మొత్తం 108 మెయిన్‌బోర్డు లిస్టింగ్‌లలో 72 తెరుచుకోగా వాటి ఇష్యూ ధరలకంటే తక్కువగా 36 ట్రేడ్ అయ్యాయి. లాభాలు పొందిన సంస్థల్లో 16 స్టాక్స్ ఉన్నాయి. 30 నుంచి 70శాతంవరకూ పెరిగినట్లు తేలింది. లిస్టింగ్‌లో22 సంస్థలు 10నుంచి 30శాతం పెరిగాయి. మరికొన్ని 34 సంస్థలు ఒకటినుంచి 10శాతం మధ్యలోనే లాభపడ్డాయి. అంటే స్వల్ప లాభాలతోనే సరిపెట్టుకున్నాయి. ప్రైమరీ మార్కెట్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. సెకండరీ మార్కెట్‌లో రికార్డుస్థాయిలో విత్‌డ్రాలు జరిగాయి. నవంబరువరకూ 13 వేల కోట్లు విత్‌డ్రా అయితే రూ.1.25 లక్షలు నిధులు వచ్చాయి. ప్రధానంగా చెప్పాలంటే ఐపిఒలనుంచే నిధులు ఎక్కువ సమకూరాయి. రూ.100 నుంచి రూ.500కోట్ల వరకూ కొన్ని కంపెనీలుంటే రూ.1000 కోట్ల నుంచి రూ.2వేల కోట్ల సెగ్మెంట్‌లోనే అత్యధిక కంపెనీలు ఐపిఒలు జారీచేసాయి. గడచిన ఎనిమిది నెలల కాలంలో గణనీయంగా వచ్చిన పెట్టుబడులు వచ్చే ఏడాది నాలుగు లక్షలకోట్ల మూలధన వనరులకు ఐపిఒలు వేదిక అవుతాయని మార్కెట్ డేటా స్పష్టం చేస్తోంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14